

'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 333

గురువారం 23-2-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



హరికథే ఆమె కథ

హరికథ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహిళా భాగవతారిణిపై కథనం - 11లో



5 నెలల్లో అతిపెద్ద పతనం

వడ్డీరేట్ల పెంపుతో 61 వేల దిగువకు సెన్సెక్స్... నెల కనిష్టానికి నిఫ్టీ - 13లో



అమెరికా 'అధ్యక్ష' బరిలో రామస్వామి

భారతీయ మూలాలున్న అమెరికన్ యువ పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామి ఆ దేశ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్నారు.

- వివరాలు 6లో▶



కులవివక్షను నిషేధించిన సియాటిల్

కులవివక్షను నిషేధిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం ద్వారా అమెరికాలో ఈ చర్య తీసుకున్న తొలి నగరంగా సియాటిల్ నిలిచింది.

- వివరాలు 6లో▶



న్యూస్‌రీల్

కుక్కల దాడిలో బాలుడి మృతిపై హైకోర్టు విచారణ



కుక్కల దాడిలో బాలుడు మృతి చెందిన ఘటనను హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఓ పత్రికలో ప్రచురితమైన వార్తను సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీనిపై నేడు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరపనుంది.

- వివరాలు 5లో▶

ఢిల్లీ మేయర్‌గా షెల్లీ ఒబెరాయ్



గతంలో పలుమార్లు వాగ్వాదాలు, వాయిదాలతో సుప్రీంకోర్టుదాకా వెళ్లిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) మేయర్ ఎన్నిక ఘట్టం ఎట్టకేలకు సజావుగా ముగిసింది. బీజేపీ అభ్యర్థి రేఖా గుప్తాపై ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ 34 ఓట్ల తేడాతో నెగ్గి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు.

- వివరాలు 6లో▶

రికార్డు పంట!



గతంలో ఎన్నడూ లేనంతగా 68.53 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు

2020–21 నాటి యాసంగి సాగు రికార్డులు బద్దలు

- యాసంగి వరిసాగులోనూ ఈసారి రికార్డు
- తొలిసారిగా 53.08 లక్షల ఎకరాల్లో వరినాట్లు
- తొమ్మిదేళ్ల కిందటితో పోలిస్తే 40.85 లక్షల ఎకరాల మేర పెంపు
- ఇటీవలి వానాకాలం వరిసాగు కూడా ఆల్‌టైమ్ రికార్డే.. వ్యవసాయ శాఖ నివేదిక..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంటల సాగు రికార్డులు బద్దలు కొడుతోంది. తెలంగాణ చరిత్రలోనే ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో పంటల సాగు కొత్త రికార్డులు నమోదు చేసింది. కొన్నేళ్లుగా సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం, విస్తారంగా కురిసిన వానలతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటలన్నీ నిండిపోవడం, భూగర్భ జలమట్టాలు పెరగడంతో.. ప్రస్తుత యాసంగి మొత్తం పంటల సాగులో, వరి సాగులో ఆల్‌టైమ్ రికార్డులను నమోదు చేసింది. ఇంతకుముందు యాసంగి సీజన్‌కు సంబంధించి అత్యధికంగా 2020–21లో 68.17 లక్షల ఎకరాల్లో పంటలు వేయగా.. ఈసారి యాసంగిలో 68.53 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని బుధవారం విడుదల చేసిన నివేదికలో వ్యవసాయశాఖ వెల్లడించింది. 2014–15 యాసంగిలో 28.18 లక్షల ఎకరాల్లోనే పంటలు పండించగా.. మరో 40.35 లక్షల ఎకరాల సాగు పెరగడం గమనార్హం.

వరి కూడా ఆల్‌టైమ్ రికార్డే...

మొత్తం పంటల సాగుతో మాత్రమేకాకుండా.. వరి సాగు విషయంలోనూ ఈ యాసంగి ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసింది. ప్రస్తుత యాసంగిలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో ఏకంగా 53.08 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. నాట్లు వేయడానికి మరో పదిరోజుల పాటు సమయం ఉండటంతో.. వరి విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. మొత్తంగా వానాకాలం సీజన్‌తో పోటీపడే స్థాయిలో యాసంగిలో వరి సాగు నమోదవుతోందని అంటున్నారు.

- 2014–15 యాసంగిలో 12.23 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా.. ప్రస్తుతం ఏకంగా 53.08 లక్షల ఎకరాలకు పెరగడం గమనార్హం. అంటే గత తొమ్మిదేళ్లలో యాసంగిలో వరిసాగు 40.85 లక్షల ఎకరాలు పెరిగింది.
- 2015–16 యాసంగిలో కేవలం 7.35 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు

మిగతా 2వ పేజీలో ▶

7 కోట్ల మెట్రిక్ టన్నులు దాటిన ధాన్యం సేకరణ

- పంజాబ్, ఛత్తీస్‌గఢ్ తర్వాత అత్యధిక సేకరణ తెలంగాణలోనే..
- కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ వెల్లడి

2 లో



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రీతి

ర్యాగింగ్, వేధింపులతో వైద్యవిద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- ట్రిమడాల్ ఇంజక్షన్ తీసుకున్న కేఎంసీ విద్యార్థిని ప్రీతి
- పరిస్థితి విషమం, నిమ్స్‌లో వెంటిలేటర్‌పై చికిత్స
- సీనియర్ విద్యార్థి వేధింపులతోనే ఘాతుకం: ప్రీతి తండ్రి నరేందర్
- కేసు నమోదుచేసిన పోలీసులు
- వరంగల్‌లో ఎంజీఎం ఆస్పత్రిలో ఘటన

- వివరాలు 2లో▶

ఈనాడు 'కొట్టు'కథ

రెండేళ్ల కిందటి ఫొటోలతో.. 'పట్టాభినీ కొట్టారు' అంటూ కట్టు కథనం

- గన్నవరం ఘటనలోనే పోలీసులు కొట్టినట్లుగా నమ్మించడానికి ప్రయత్నం
- 2021 ఫిబ్రవరి 3న తనపై దాడి జరిగిందంటూ పట్టాభి హైడ్రామా
- గుర్తు తెలియని వారు దాడి చేశారంటూ పార్టీలో సానుభూతి కోసం ఎత్తుగడ
- అప్పట్లో దాన్ని ప్రభుత్వ వైఫల్యమంటూ రెచ్చిపోయిన చంద్రబాబు, రామోజీ
- పేజీల కొద్దీ కథనాలు వండేసిన 'ఈనాడు'... ఇప్పుడూ అదే తీరు
- అలనాటి ఫొటోలతో... అదే తరహా కథనాలతో రెచ్చిపోయిన రామోజీ
- అవి పాత ఫొటోలని నిర్ధారించి.. ఉతికి ఆరేసిన సోషల్ మీడియా యాక్టివిస్టులు



టీడీపీ నేత పట్టాభిని కొట్టారంటూ రెండేళ్ల కిందటి ఫొటోలను తీసుకొచ్చి మంగళవారమే జరిగినట్టుగా ప్రచురించిన 'ఈనాడు'

10 లో

షాబాద్‌లో ఐటీ సెంటర్

1,200 మందికి ఉద్యోగాలు వస్తాయి: మంత్రి కేటీఆర్

- వెల్‌స్పన్ కంపెనీ సహకారంతో మహిళలు, యువకులకు శిక్షణ
- సీతారాంపూర్‌లో త్వరలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని వెల్లడి



షాబాద్: రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లిలో త్వరలో ఐటీ సెంటర్ ఏర్పాటు చేస్తామని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీ రామారావు తెలిపారు. ఐటీ సెంటర్ ఏర్పాటు వల్ల 1,200 మందికి ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. బుధవారం చందనవెల్లిలో వెల్‌స్పన్ పరిశ్రమ రెండో యూనిట్‌ను మంత్రి సబితారెడ్డి, ఎంపీ జి.రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులతో కలసి ఆయన ప్రారంభించారు. తర్వాత వెల్‌స్పన్ చైర్మన్ బీకే గోయెంకా తదితరులతో కలిసి కంపెనీలో కలియదిరిగి పరికరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. చందనవెల్లిలో ప్రస్తుతం

మిగతా 2వ పేజీలో ▶

కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్ భేటీ

క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలు, అనుసరించాల్సిన వ్యూహాల సమీక్ష

- రాష్ట్రంలో వివిధ రాజకీయ పార్టీల తీరుతెన్నులపై చర్చ
- జాతీయ స్థాయిలో పార్టీ విస్తరణ, ఇతర అంశాల పైనా సమాలోచనలు
- ఒకట్రెండు రోజుల్లో ఢిల్లీకి కేసీఆర్..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో, దేశంలో నెలకొన్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. జాతీయ స్థాయిలో బీఆర్‌ఎస్ విస్తరణ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఆయన మంత్రులు కె.తారకరామారావు, టి.హరీశ్‌రావులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇద్దరు మంత్రులు

మిగతా 2వ పేజీలో ▶

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

Eggs Retail Rate		
₹ 51 per dozen	Ex Farm Live Bird 97 kg	Dressed with Skin 173 kg
	Retail Live Bird 119 kg	Skin Less 196 kg

Issued in the interest of consumers

ఇదండీ సంగతి



పెళ్లి చేసుకోకుండా పిల్లలు కావాలనుకోవడం తప్పనుకుంటా సార్!



క్లుప్తంగా...

ఉమ్మడి సర్వే త్వరగా పూర్తి చేయండి

పోలవరం ముంపుపై ఏపీకి సీడబ్ల్యూసీ లేఖ

సాక్షి, హైదరాబాద్‌: పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణ రాష్ట్రంలో కలిగే ముంపుపై ఆ రాష్ట్రంతో కలిసి సత్వరమే ఉమ్మడి సర్వేను పూర్తి చేయాలని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ఏపీని కోరింది. ఈ మేరకు ఏపీ జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శికి బుధవారం లేఖ రాసింది. పోలవరం ప్రాజెక్టు ముంపు సమస్యపై సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు గత నెల 25న ఏపీ, తెలంగాణ, ఒడిశా, చత్తీస్‌గఢ్‌ రాష్ట్రాలతో సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించింది. 'తెలంగాణలో ముంపు ప్రభావంపై ఉమ్మడి సర్వే నిర్వహించడానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు సమ్మతి తెలిపాయి. సర్వేలో తేలిన ఫలితాల ఆధారంగా ముంపు నివారణకు ఏపీ/పోలవరం ప్రాజెక్టు అథారిటీ చర్యలు తీసుకుంటాయి'అని ఈ సమావేశపు మినిట్స్‌బుక్‌లో సీడబ్ల్యూసీ పేర్కొంది. అయితే ఉమ్మడి సర్వేకి ఏపీ ముందుకు రాకపోవడంతో ఇటీవల తెలంగాణ ప్రభుత్వం పోలవరం అథారిటీకి లేఖ రాసింది. మరోవైపు పోలవరం జలాశయం గరిష్ట నిల్వ మట్టం(ఎఫ్‌ఆర్‌ఎల్‌) 45.72 మీటర్ల మేరకు నీళ్లను నిల్వ చేస్తే బ్యాక్‌వాటర్‌ ఎంతవరకు ఉండనుందో సూచించే సర్వే రాళ్లను గుర్తించేందుకు మాత్రమే ఉమ్మడి సర్వేకి అంగీకరించామని ఏపీ జలవనరుల శాఖ అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. అయితే తెలంగాణ మాత్రం ముర్రెడు, కిన్నెరసాని వాగులతో పాటు మరో ఆరు వాగులపై ఉండనున్న ప్రభావంపై ఉమ్మడి సర్వే నిర్వహించాలని కోరుతోంది. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి సర్వే ముందుకు కదిలే పరిస్థితులు కనిపించడం లేదు.

6న నదుల అనుసంధానంపై టాస్క్‌ఫోర్స్‌ భేటీ

సాక్షి, హైదరాబాద్‌: నదుల అనుసంధానంపై కేంద్రం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్‌ మార్చి 6న హైదరాబాద్‌లోని జలసౌధలో సమావేశం కానుంది. గోదావరి–కావేరి నదుల అనుసంధానంపై ఈ సమావేశంలో మరోసారి చర్చించనున్నారు. నేషనల్‌ వాటర్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ (ఎన్‌డబ్ల్యూడీఏ) డైరెక్టర్‌ జనరల్‌, కేంద్ర జలశక్తి శాఖ సలహాదారుడు వెదిరె శ్రీరాం, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఏపీ, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

విద్యుత్‌ సంస్థల్లో సమ్మెలపై నిషేధం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ ట్రాన్స్‌కో, టీఎస్‌ఎస్పీడీసీఎల్‌, టీఎస్‌ఎన్పీడీసీఎల్‌ సంస్థలతో పాటుగా సింగరేణి బొగ్గు గనుల సంస్థల్లోనూ సమ్మెలపై నిషేధాన్ని మరోఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్‌ శర్మ ఈ నెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుత్‌ సంస్థల్లో ప్రస్తుతం అమల్లో ఉన్న నిషేధాన్ని ఫిబ్రవరి 25 నుంచి మరో ఆరు నెలల పాటు పొడిగించారు. తెలంగాణ ట్రాన్స్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు చేసిన విజ్ఞప్తి మేరకు విద్యుత్‌ సంస్థల్లో సమ్మె నిషేధం పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణిబొగ్గు గనుల సంస్థలో ప్రస్తుతం అమల్లో ఉన్న నిషేధం మార్చి10తో ముగియనుండగా, 11 నుంచి మరో ఆరు నెలల పాటు పొడిగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో తెలిపారు.

కేసీఆర్‌తో కేటీఆర్‌, హరీశ్‌ భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

తమ రోజువారీ కార్యకలాపాలను రద్దు చేసుకొని మరీ సీఎంతో నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా సమావేశం కావడం గమనార్హం. హరీశ్‌రావు తన ఆదిలాబాద్‌ జిల్లా పర్యటనను రద్దు చేసుకొని ప్రగతిభవన్‌కు రాగా.. రంగారెడ్డి జిల్లా చందనవల్లిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కేటీఆర్‌ అక్కడి నుంచి నేరుగా ప్రగతిభవన్‌కు చేరుకున్నారు.

అభివృద్ధి పనులు, ప్రచారంలో దూకుడు

కేసీఆర్‌, కేటీఆర్‌, హరీశ్‌రావుల భేటీలో జాతీయ, రాష్ట్రస్థాయి రాజకీయ అంశాలతోపాటు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే అంశంపై చర్చ జరిగినట్టు తెలిసింది. వివిధ వర్గాల సంక్షేమం కోసం రాష్ట్రంలో అమలవుతున్న పథకాల తీరుతెన్నులపై చర్చించిన సీఎం కేసీఆర్‌.. విస్తృత ప్రచారం ద్వారా బీఆర్‌ఎస్‌ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించినట్టు సమాచారం. జిల్లాల్లో ఇంకా ప్రారంభంకాని కొత్త కలెక్టరేట్లకు ముహూర్తాలు పెట్టుకోవాలని, ఆయా నియోజకవర్గాల్లో పూర్తిచేసిన పనులపై విస్తృత ప్రచారం చేసుకునేలా ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేయాలని చెప్పినట్టు తెలిసింది. రాష్ట్రంలో జిల్లాలు, నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యకలాపాల తీరును సమీక్షించి.. ఆయా చోట్ల అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేసినట్టు సమాచారం. ఇదే సమయంలో బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు ఇతర పార్టీలు చేపట్టిన కార్యక్రమాలపైనా ముగ్గురు నేతలు సమాలోచనలు జరిపినట్టు తెలిసింది.

ఒకట్రెండు రోజుల్లో ఢిల్లీకి కేసీఆర్‌

జాతీయ స్థాయిలో బీఆర్‌ఎస్‌ను విస్తరించే క్రమంలో అనుసరిస్తున్న వ్యూహాలపైనా సీఎం కేసీఆర్‌, మంత్రులు కేటీఆర్‌, హరీశ్‌రావు చర్చించినట్టు తెలిసింది. ఢిల్లీలో నిర్మిస్తున్న బీఆర్‌ఎస్‌ భవన్‌ నిర్మాణ పనులను పరిశీలించడంతోపాటు జాతీయ మీడియాతో సమావేశం అయ్యేందుకు ఒకట్రెండు రోజుల్లో సీఎం ఢిల్లీకి వెళ్లనున్నట్టు సమాచారం. ఇప్పటికే బీఆర్‌ఎస్‌ భవన్‌ పనుల పరిశీలన కోసం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారు. ఇక జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెసేతర పక్షాలలో కలిసి వచ్చే పార్టీల నేతలతో సమావేశాలపైనా సమావేశంలో చర్చించినట్టు తెలిసింది.

మురికిపోయి.. ముద్దుగా మారి..

మెగా చెస్‌ బోర్డు వ్యూ



అదో కాలువ.. దానికి అనుబంధంగా డ్రైనేజీలు, వానాకాలం వచ్చిందంటే ఉప్పొంగడం, రోడ్లన్నీ మురికినీటితో నిండిపోవడం, విషజ్వరాలు, తాగునీటి కాలుష్యం, దుర్వాసన.. ఇదంతా గతం..

ఇప్పుడు అదంతా అందాల హరివిల్లు. పచ్చదనం నిండిన పార్కులు, ఫౌంటెయిన్‌లు, ఓపెన్‌ జిమ్‌లు, వాకింగ్‌ ట్రాక్‌లు, ఆట స్థలాలతో ఆహ్లాదం పంచే ప్రదేశం..

రూ.100 కోట్లతో 10.6 కి.మీ. పొడవునా అభివృద్ధి

- గోళ్లపాడు చానల్‌ పునరుద్ధరణతో ఖమ్మం పట్టణానికి వన్నె
- ఆక్రమణలకు పాల్పడిన 862 మందికి పునరావాసం
- మంత్రి పువ్వాడ చొరవతో పనులు.. త్వరలో కేటీఆర్‌ చేతుల మీదుగా ప్రారంభోత్సవం

ఖమ్మం పట్టణంలోని గోళ్లపాడు చానెల్‌, దాని వెంట ఉన్న ప్రాంతాల్లో వచ్చిన అద్భుతమైన మార్పు ఇది. సీఎం కేసీఆర్‌ హామీ, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ చొరవ కలిసి రూ.100 కోట్ల ఖర్చుతో గోళ్లపాడు చానెల్‌ ప్రాజెక్టు అపూర్వంగా రూపుదిద్దుకుంది. సీఎం కేసీఆర్‌ ఈ అభివృద్ధి పనులకు కితాబివ్వగా.. త్వరలోనే మంత్రి కేటీఆర్‌ చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

- సాక్షి ప్రతినిధి, ఖమ్మం

సాగు కాల్వ.. మురికి కూపమై..

గోళ్లపాడు చానల్‌ ఖమ్మం నగరం మీదుగా వెళ్తూ.. శివారు ప్రాంతాల్లోని పంట పొలాలకు నీరందించేది. త్రీటౌన్‌ ప్రాంతంలో 10.6 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ కాల్వ కాలక్రమేణా నగరాభివృద్ధితో డ్రైనేజీగా మారింది. పంపింగ్‌ వెల్‌ రోడ్‌, సుందరయ్య నగర్‌, ప్రకాశ్‌నగర్‌ ప్రాంతాల్లో కాల్వకు ఇరువైపులా బస్తీలు వెలిశాయి. ఖమ్మం నగరంలోని 28 డివిజన్ల మురికినీరంతా ఈ కాల్వ నుంచే వెళ్లి మున్నేరులో కలుస్తుండటం, ఆక్రమణలు, సిల్ట్‌ తీయకపోవడంతో నాలుగు దశాబ్దాలుగా కాల్వ, పరిసర ప్రాంతాలు మురికి కూపంగా మారాయి. వానాకాలంలో ఈ డ్రైనేజీ పొంగి సమీప డివిజన్లలో మురికినీరు చేరడం, ఆ నీరు పైపులైన్లలో కలిసి తాగునీరు కలుషితం కావడం నిత్యకృత్యమైంది. దోమల స్వైర విహారంతో విషజ్వరాలు, వ్యాధుల విజృంభణ సాధారణమైంది.

రూ.100 కోట్లతో మారిన ముఖచిత్రం

సీఎం కేసీఆర్‌ రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లతోపాటు ఖమ్మం కార్పొరేషన్‌ అభివృద్ధికి 2018లో ప్రత్యేక నిధులు కేటాయించారు. అందులో భాగంగా రూ.100 కోట్ల నిధులతో గోళ్లపాడు చానల్‌ పునరుద్ధరణ, సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే 30ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారీ అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ, వాన నీరు వెళ్లేందుకు ఓపెన్‌ కాల్వ నిర్మించడంతోపాటు.. అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పైభాగంలో ఆహ్లాదం పంచేలా పార్కులను ఏర్పాటు చేశారు.



కొండా లక్ష్మణ్‌ బాపూజీ పార్కులో ఫౌంటెన్‌

అధునాతన సౌకర్యాలతో..

పది డివిజన్ల పరిధిలోని 50 వేల మంది ప్రజలకు ఆహ్లాదం పంచేలా గోళ్లపాడు చానల్‌ను అభివృద్ధి చేశారు. పిల్లలకు చెస్‌పై అవగాహన కల్పించేలా రష్యాలోని మాస్కో తరహాలో మెగా చెస్‌బోర్డులు, అధునాతనంగా స్కేటింగ్‌ రింక్‌లు, వాటర్‌ ఫౌంటెయిన్లు, బాస్కెట్‌బాల్‌, వాలీబాల్‌, షటిల్‌ కోర్టులు, వాకింగ్‌ ట్రాక్‌లు, ఓపెన్‌ జిమ్‌లు, బస్తీ దవాఖానా, యోగా వేదికలు, పంచతత్వ పార్కులు, 10 వేల ఔషధ, ఇతర మొక్కలతో మినీ పార్కులను ఏర్పాటు చేశారు. మొత్తం 32 ఎకరాల స్థలం ప్రజా అవసరాల దృష్ట్యా వినియోగంలోకి వచ్చింది. గోళ్లపాడు చానల్‌ ప్రాజెక్టు వ్యయం రూ.100 కోట్లు అయితే.. వినియోగంలోకి వచ్చిన భూమి విలువ రూ.300 కోట్లకు పైమాటేనని అంచనా వేశారు. సీఎం సూచనల మేరకు ఇటీవల నిజామాబాద్‌ కలెక్టర్‌, ఆ జిల్లా అధికారులు ఈ అభివృద్ధి పనులను సందర్శించారు కూడా.

గోళ్లపాడు చానల్‌పై నిర్మించిన పార్కులకు ప్రొఫెసర్‌ జయశంకర్‌, మంచికంటి రామకిషన్‌రావు, పుచ్చలపల్లి సుందరయ్య, కాళోజీ నారాయణరావు, కొండా లక్ష్మణ్‌ బాపూజీ, రజబ్‌ అలీ, వనజీవి రామయ్య తదితర ప్రముఖుల పేర్లను పెట్టారు.

గోళ్లపాడు చానల్‌ వెంట గతంలో గుడిసెలు, ఇతర తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్న 862 మంది పేదలకు ఖమ్మం అర్బన్‌ మండలం వెలుగుమట్లలో ఇళ్ల స్థలాలు ఇచ్చి, అన్ని వసతులతో కాలనీ ఏర్పాటు చేశారు.

మురికి పోయి.. వన్నె వచ్చింది



పువ్వాడ అజయ్‌ కుమార్‌, రవాణా శాఖ మంత్రి

సీఎం కేసీఆర్‌ రూ.100 కోట్లను గోళ్లపాడు చానల్‌కు కేటాయించడంతో నాలుగు దశాబ్దాల మురికి కూపం నుంచి విముక్తి కలిగింది. వన్నె వచ్చింది. ప్రత్యేకంగా త్రీటౌన్‌ ప్రాంతానికి ఆహ్లాదం పంచేలా గోళ్లపాడు చానల్‌ ముస్తాబైంది. విషజ్వరాలు, దుర్వాసనతో ఇబ్బందులు పడ్డ ప్రజలు నేడు ఆహ్లాదాన్ని ఆస్వాదిస్తున్నారు. సీఎం దార్శనికతకు ఇది నిదర్శనం.

అందరి కృషితో ఆహ్లాదం



వీపీ గౌతమ్‌, కలెక్టర్‌, ఖమ్మం

సీఎం కేసీఆర్‌, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌, అధికారులు, స్థానికుల సహకారంతో గోళ్లపాడు చానల్‌ సొబగులు అద్దుకుంది. ఆహ్లాదకరమైన పార్కులు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. మొత్తం పది వేల కుటుంబాలు ఆహ్లాదాన్ని ఆస్వాదించేలా తీర్చిదిద్దాం. గోళ్లపాడు చానల్‌ పార్కుల్లో ఇంకా కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తాం.

నూతన పద్ధతిలో ఆర్మీ రిక్రూట్‌మెంట్‌

దాబాగార్డెన్స్‌(విశాఖ దక్షిణ): ఆర్మీలో వివిధ పోస్టులకు నియామకాలకు నూతన పద్ధతిని ప్రవేశపెట్టారు. అగ్నివీర్‌లో భాగంగా జూనియర్‌ కమిషన్‌ ఆఫీసర్స్‌ నుంచి ఇతర ర్యాంకుల అధికారుల నియామకాలకు మార్చి నుంచి నూతన పద్ధతిని అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆర్మీ రిక్రూట్‌మెంట్‌ డైరెక్టర్‌ కల్నల్‌ వినయ్‌కుమార్‌ బుధవారం ఇక్కడ వివరించారు. ఆర్మీలో వివిధ పోస్టులకు ఈ నెల 16న నోటిఫికేషన్‌ విడుదలైందని, మార్చి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నూతన విధానం ప్రకారం తొలిసారిగా ఆన్‌లైన్‌ ద్వారా ఆర్మీలో వివిధ పోస్టులు/ర్యాంకులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులు రూ.250 ఫీజుతో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల స్క్రూటినీ అనంతరం ఆన్‌లైన్‌లోనే రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌ టెస్ట్‌ దేశంలో 176 ప్రాంతాల్లో నిర్వహిస్తామని, అభ్యర్థి ఎంచుకున్న ప్రాంతానికి వెళ్లి పరీక్ష రాసుకోవచ్చని చెప్పారు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్‌ ఫిట్‌నెస్‌, ఫిజికల్‌ ఎఫిషియెన్సీ టెస్ట్‌ నిర్వహిస్తామన్నారు. ఇందులో అర్హత సాధించిన వారిని వైద్య పరీక్షలకు పిలుస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు ఆర్మీ రిక్రూట్‌మెంట్‌ ర్యాలీ విశాఖపట్నంలో జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు www. joinindianarmy. nic.in వెబ్‌సైట్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు హెల్ప్‌డెస్క్‌ నెంబరు 7996157222 లో సంప్రదించవచ్చన్నారు.

ర్యాగింగ్‌, వేధింపులతో వైద్యవిద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ట్రెమడాల్‌ ఇంజక్షన్‌ తీసుకున్న కేఎంసీ విద్యార్థిని ప్రీతి

సాక్షి, వరంగల్‌/ఎంజీఎం: సీనియర్‌ విద్యార్థి ర్యాగింగ్‌, వేధింపులతో పీజీ వైద్య విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపుతోంది. వరంగల్‌ కాకతీయ మెడికల్‌ కళాశాల (కేఎంసీ)లో అనస్థీషియా విభాగంలో పీజీ ఫస్టియర్‌ చదువుతున్న ధరావత్‌ ప్రీతి (26) బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఎంజీఎం ఆస్పత్రిలో విధుల్లో ఉన్న ప్రీతి బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో తీవ్ర తలనొప్పి, అలసటగా ఉందని చెప్పి నర్సు వద్ద నుంచి ఓ ఇంజక్షన్‌ తీసుకుని వేసుకుంది. క్షణాల వ్యవధిలోనే తన గదిలో స్పృహ తప్పి పడిపోవడంతో ఆర్‌ఐసీయూలో చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. సీనియర్‌ విద్యార్థి సైఫ్‌ వేధింపులే దీనికి కారణమని ఆమె తండ్రి ఆరోపించారు. దీనిపై విచారణ జరుపుతున్నామని వైద్య విద్య సంచాలకులు డాక్టర్‌ రమేష్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఘటనపై మంత్రి హరీశ్‌రావు ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

హేళన చేస్తూ వేధించి..

జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గిర్ని తండాకు చెందిన ధరావత్‌ నరేందర్‌, శారద దంపతులకు ముగ్గురు కుమార్తెలు పూజా, ఉష, ప్రీతి, కుమారుడు వంశీ ఉన్నారు. నరేందర్‌ వరంగల్‌లోని ఆర్‌పీఎఫ్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్ల క్రితమే వీరి కుటుంబం హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు మకాం మార్చింది. పూజా, ఉషల పెళ్లిళ్లు అయ్యాయి. కుమారుడు వంశీ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఇంజనీరింగ్‌ కాలేజీలో బీటెక్‌ చదువుతున్నాడు. ఇంట్లో ఎప్పుడూ సరదాగా ఉండే ప్రీతి గాంధీ కళాశాలలో ఎంబీబీఎస్‌ పూర్తిచేసింది. కేఎంసీలో పీజీ అనస్థీషియా కోర్సు చదువుతున్న ప్రీతి ఎంజీఎం ఆస్పత్రిలో సీనియర్‌ విద్యార్థులతో కలిసి ఆపరేషన్‌ థియేటర్‌లో విధులు నిర్వర్తిస్తోంది. అక్కడ పరిచయమైన సీనియర్‌ విద్యార్థి సైఫ్‌ ర్యాగింగ్‌ చేస్తూ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించాడు. తక్కువ కులం అంటూ హేళన చేశాడు. దీనిపై ప్రిన్సిపాల్‌ ఆదేశానుసారం అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్‌ నాగార్జున రెడ్డి సైఫ్‌, ప్రీతిలకు మంగళవారం సాయంత్రం కౌన్సెలింగ్‌ నిర్వహించారు. తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే ప్రీతి ఆత్మహత్యకు యత్నించడంతో ఆమెకు వేధింపులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోందని విద్యార్థులు అంటున్నారు.



రోదిస్తున్న ప్రీతి తల్లి. (ఇన్‌సెట్లో) ప్రీతి

ఈఓటీలో ఏం జరిగిందంటే..:

విధుల్లో భాగంగా ఎంజీఎం ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ ఆపరేషన్‌ థియేటర్‌ (ఈఓటీ)లో మంగళవారం సాయంత్రం 4 గంటలకు విధులకు హాజరైన ప్రీతి తోటి వైద్యులతో కలిసి రాత్రి 12 గంటల వరకు రెండు శస్త్రచికిత్సలు చేసింది. తిరిగి బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో మరో శస్త్రచికిత్సకు సిద్ధమై ఆరు గంటలకల్లా పూర్తిచేసింది. ఈ క్రమంలో ప్రీతి తలనొప్పి, ఛాతీలో నొప్పిగా ఉందంటూ జోఫర్‌, ట్రెమడాల్‌ ఇంజక్షన్‌ కావాలని స్టాఫ్‌నర్సుకు చెప్పింది. శస్త్రచికిత్స పూర్తిచేసిన బాధితుడిని వార్డుకు తీసుకెళ్లి తిరిగి థియేటర్‌కు వచ్చిన తోటి వైద్యులు ప్రీతి ఎక్కడ ఉందని అక్కడున్న సిబ్బందిని అడిగారు. డాక్టర్స్‌ రూమ్‌లో ఉందని చెప్పగానే అక్కడికి వెళ్లిన వారికి ప్రీతి అపస్మారక స్థితిలో ఉండటం గమనించారు.

కార్డియాక్‌ అరెస్ట్‌తోనే...

కార్డియాక్‌ అరెస్టు రావడంతో వైద్య బృందంతో సీపీఆర్‌ ద్వారా చికిత్స చేసి ట్రీట్‌మెంట్‌ ఇచ్చామని ఎంజీఎం సూపరింటెండెంట్‌ చంద్రశేఖర్‌ చెప్పారు. గుండెకు సంబంధించి 28 శాతం ఎజెక్షన్‌ ఫ్రాక్షన్‌ ఆఫ్‌ హార్ట్‌, గ్లోబల్‌ హిపోకైనేషియా, పాంక్రియాటైటిస్‌, అసైటీస్‌, ఊపిరితిత్తుల సమస్య ఉన్నట్టు తేలిందన్నారు. ప్రీతి థైరాయిడ్‌, కీళ్లవాతానికి సంబంధించి మందులు వాడుతున్నట్టు తేలిందన్నారు.

సెల్‌ఫోన్‌లో అనస్థీషియాపై సెర్చ్‌

ప్రీతి ఆత్మహత్యకు యత్నించకముందు బుధవారం తెల్లవారుజామున తన సెల్‌ఫోన్‌లో గూగుల్‌ సెర్చ్‌లో సాధారణ వ్యక్తి అనస్థీషియా తీసుకుంటే ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయో చూసినట్లు విద్యార్థులు చర్చించుకుంటున్నారు. అయితే ప్రీతి ట్రెమడాల్‌ తీసుకుందని కొందరు, అనస్థీషియా తీసుకుందని మరి కొందరు చెబుతున్నారు.

వద్దు డాడీ అంది... ఇప్పుడింత పనైంది

'కాలేజీ, ఆస్పత్రిలో ర్యాగింగ్‌ చేస్తూ వేధిస్తున్న సైఫ్‌పై ప్రిన్స్‌పాల్‌కు ఫిర్యాదు చేస్తా అంటే వద్దు డాడీ అంటూ నివారించింది. ప్రిన్సిపల్‌ కక్ష సాధింపు చర్యలకు దిగి మార్కులు తక్కువ వేస్తారంటూ భయపడేది. సైఫ్‌ అరాచకంపై ఏసీపీ కిషన్‌కు చెప్పాను. ఆ తర్వాత కేఎంసీ ప్రిన్సిపల్‌ మోహన్‌దాసు ఆదేశాల మేరకు డాక్టర్‌ నాగార్జునరెడ్డి మంగళవారం సాయంత్రం అతడిని మందలించారు. నాపై ఫిర్యాదు చేస్తావా అంటూ సైఫ్‌ మరోసారి నా బిడ్డను బెదిరించగా మనస్తాపానికి లోనై ఆత్మహత్యకు యత్నించింది' అని తండ్రి నరేందర్‌ కన్నీళ్లపర్యంతమయ్యారు. నరేందర్‌ ఫిర్యాదుమేరకు సైఫ్‌పై వేధింపులు, ర్యాగింగ్‌, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద మట్టెవాడ పోలీసులు కేసులు నమోదు చేశారు. వరంగల్‌ ఏసీపీ కిషన్‌ దర్యాప్తు చేస్తున్నారు.

'రింగు'పై జంగ్‌!

రీజనల్‌ రింగు రోడ్డు భూసేకరణ నిధుల విషయంలో వివాదం

- రాష్ట్ర వాటా చెల్లించాలంటూ డిసెంబర్‌ నుంచి ఎన్‌హెచ్‌ఏఐ లేఖలు
- తుది గెజిట్‌ విడుదల చేసి భూమిని స్వాధీనం చేసుకుంటామంటూ మరో లేఖ
- భారీ ప్రాజెక్టు టెండర్ల దశకు చేరుకున్న తరుణంలో వివాదం
- జాప్యం జరిగితే అంచనా వ్యయం భారీగా పెరిగే అవకాశం

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్‌ రీజనల్‌ రింగ్‌ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్‌) విషయంలో గందరగోళం ఏర్పడింది. ప్రాజెక్టులో ఉత్తరభాగానికి సంబంధించి అన్ని సర్వేలు, అలైన్‌మెంట్‌ గుర్తింపు పూర్తయి భూసేకరణ చేయాల్సిన తరుణంలో.. ప్రాజెక్టు పెండింగ్‌లో పడేలా కనిపిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం భారత్‌మాల పరియోజన ప్రాజెక్టులో భాగంగా రీజనల్‌ రింగ్‌ రోడ్డును జాతీయ రహదారిగా నిర్మించనుంది. అయితే దీనికి అయ్యే భూసేకరణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం సగం భరించాల్సి ఉంది. ఈ మేరకు వాటా నిధులను రాష్ట్ర ప్రభుత్వం 'జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)'కు డిపాజిట్‌ చేయకపోవటంతో వివాదం మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు ఇస్తే.. భూసేకరణకు సంబంధించిన గెజిట్‌ నోటిఫికేషన్‌ (3డీ) విడుదల చేసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధమైంది. నిధులను డిపాజిట్‌ చేయాలంటూ గత డిసెంబర్‌ నుంచి పలుమార్లు లేఖలు రాసింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌ సంతోష్‌కుమార్‌ యాదవ్‌ తాజాగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఘాటుగా లేఖ రాయటంతో ఈ అంశం మరింతగా ముదురుతున్నట్టు కనిపిస్తోంది.



రూ.2,948 కోట్ల నిధుల కోసం..

రీజనల్‌ రింగ్‌ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి 162 కిలోమీటర్ల పొడవునా 2 వేల హెక్టార్ల భూమిని సమీకరించాల్సి ఉంది. ఇందుకు పరిహారంగా రూ.5,170 కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్‌ఏఐ లెక్కలేసుకుంది. ఇందులో 50 శాతం మొత్తం రూ.2,585 కోట్లతోపాటు విద్యుత్‌ స్తంభాలు వంటి వాటిని తరలించడం, ఇతర ఖర్చులకు మరో రూ.363.43 కోట్లు చెల్లించాలంటూ.. గత డిసెంబరులో ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఏఐ ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. తర్వాత ఆ విభాగం ప్రాంతీయ అధికారి కార్యాలయం నుంచి మరో మూడు లేఖలు, ఆ తర్వాత ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌ సంతోష్‌ కుమార్‌ యాదవ్‌ ఒక లేఖ రాయగా.. తాజాగా ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌ మరో లేఖ రాశారు. ''భూసేకరణకు సంబంధించి అవార్డు పాస్‌ చేసేందుకు అవసరమైన 3డీ గెజిట్‌ నోటిఫికేషన్‌ విడుదల చేయాల్సి ఉంది. ఈలోపే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు చెల్లించే విధానాన్ని స్పష్టం చేయాలి. నిధులు కూడా అందాలి. గెజిట్‌ నోటిఫికేషన్‌ విడుదలతో సంబంధిత భూములు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి వస్తాయి. అప్పుడు రాష్ట్ర నిధుల వాటా లేని పక్షంలో పరిహారం చెల్లింపులో న్యాయపరమైన చిక్కులు ఏర్పడుతాయి''అని అందులో స్పష్టం చేశారు.

జాప్యమైతే వ్యయం మోత!

తొలుత రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిపాదించినప్పుడు ఉత్తర భాగానికి రూ.9 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. కోవిడ్‌ వల్ల జరిగిన జాప్యం వల్ల ఇప్పటికే అంచనా వ్యయం రూ.15 వేల కోట్లకు చేరువైంది. ఇంకా జాప్యం జరిగితే ప్రామాణిక ధరల పట్టిక (ఎస్‌ఎస్‌ఆర్‌)లో మార్పులు వచ్చి అంచనా వ్యయం మరో రూ.2–3 వేల కోట్ల వరకు పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు చెప్తున్నాయి. రోడ్డు త్వరగా అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల్లో వాణిజ్యపరంగా పురోగతి ఉండటం, పెట్టుబడుల రాక, స్థానికుల ఉపాధి అవకాశాలు పెరిగే పరిస్థితితోపాటు హైదరాబాద్‌ నగరంపై ట్రాఫిక్‌ భారానికి కొంత పరిష్కారం లభిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఎన్‌హెచ్‌ఏఐ లేఖలపై వివరణ కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని సంప్రదించడానికి 'సాక్షి'ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

రికార్డు పంట!

▶ మొదటి పేజీ తరువాయి

జరిగింది. ఆ తర్వాతి నుంచి పెరుగుతూ వచ్చింది.

- వాస్తవానికి ప్రస్తుత వ్యవసాయ సీజన్‌ (2022–23)లోని వానాకాలంలో కూడా వరిసాగు ఆల్‌టైం రికార్డు నమోదైంది. ఇటీవలి వానాకాలంలో 64.54 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేయడం గమనార్హం. ఇంతకుముందు అత్యధికంగా 2021 వానాకాలంలో 61.94 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి.
- తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు 2013 వానాకాలంలో ఇక్కడ 29.16 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా.. ఇప్పుడది రెండింతలు దాటిపోవడం గమనార్హం.
- మొత్తంగా ఈసారి వానాకాలం, యాసంగి సీజన్లలో వరిసాగు ఆల్‌టైం రికార్డులను నమోదు చేసుకుంది.

కొన్నేళ్లుగా యాసంగి వరిసాగు తీరు (లక్షల ఎకరాల్లో)

ఏడాది	విస్తీర్ణం	ఏడాది	విస్తీర్ణం
2014–15	12.23	2019–20	39.31
2015–16	7.35	2020–21	52.80
2016–17	23.20	2021–22	35.84
2017–18	22.61	2022-23	53.08
2018–19	18.34		

ప్రభుత్వ నిర్ణయాలతోనే భారీగా సాగు



వానాకాలంలో చెరువులు నిండి పంటలు పండుతాయి. అలాంటిది యాసంగిలో కూడా రికార్డు స్థాయిలో పంటలు, వరి నాట్లు పడటం విశేషం. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులు, మరోవైపు రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ బోర్లకు 24 గంటల ఉచిత కరెంటు ఇవ్వడం వల్లే ఇది సాధ్యమైంది. ఉచిత కరెంటు కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్లే భారీగా సాగు సాధ్యమైంది. రైతులకు అండగా నిలిచిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. రికార్డు స్థాయిలో పంటలు పండించిన రైతులకు అభినందనలు తెలుపుతున్నాను.

–పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడు

7 కోట్ల మెట్రిక్‌ టన్నులు దాటిన ధాన్యం సేకరణ

- పంజాబ్‌, ఛత్తీస్‌గఢ్‌ తర్వాత అత్యధిక సేకరణ తెలంగాణలోనే
- రాష్ట్రంలో 64.92 లక్షల మెట్రిక్‌ టన్నుల సేకరణ: కేంద్రం వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ నాటికి ధాన్యం సేకరణ 7 కోట్ల మెట్రిక్‌ టన్నుల మార్కును దాటినట్లు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనికి సంబంధించి మొత్తంగా 96 లక్షల మంది రైతులకు రూ.1.45 లక్షల కోట్ల మొత్తాన్ని నేరుగా చెల్లింపులు చేసినట్లు పేర్కొంది. గత ఏడాది మొత్తంగా 7.49 కోట్ల మెట్రిక్‌ టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది 7.65 కోట్ల మెట్రిక్‌ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. నిర్ణీత లక్ష్యాన్ని మార్చి నాటికి చేరుకుంటామని స్పష్టం చేసింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా పంజాబ్‌లో 1.82 కోట్ల మెట్రిక్‌ టన్నుల ధాన్యం సేకరణ చేయగా, తర్వాతి స్థానంలో ఛత్తీస్‌గఢ్‌లో 92 లక్షల మెట్రిక్‌ టన్నుల సేకరణ జరగ్గా, 64.92 లక్షల మెట్రిక్‌ టన్నులతో తెలంగాణ మూడో స్థానంలో ఉంది. ఉత్తరప్రదేశ్‌లో 63.57 లక్షలు, హరియాణాలో 58.96 లక్షల మెట్రిక్‌ టన్నుల సేకరణ జరగ్గా, ఆంధ్రప్రదేశ్‌లో 32 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపింది. కాగా, రబీ ధాన్యం సేకరణకు సంబంధించిన ప్రణాళికను మార్చి ఒకటవ తేదీన నిర్వహించే రాష్ట్రాల కార్యదర్శుల భేటీలో ఖరారు చేయనున్నట్లు వెల్లడించింది. రబీలో సుమారు 2 కోట్ల మెట్రిక్‌ టన్నుల ధాన్యం సేకరణ జరిపే అవకాశాలున్నాయని ఆహార శాఖ పేర్కొంది.

షాబాద్‌లో ఐటీ సెంటర్‌

▶ మొదటి పేజీ తరువాయి

వెల్‌స్పన్‌ కంపెనీతోపాటు ఐటీఈఎస్‌ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కేంద్రంలో మహిళలు, యువకులకు శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పించే బాధ్యతను కంపెనీ తీసుకుందని చెప్పారు. ఐటీ సెంటర్‌ ఏర్పాటుతో మరిన్ని చిన్న, మధ్య తరహా కంపెనీలు ఈ ప్రాంతం వైపు దృష్టి సారిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో సీతారాంపూర్‌లో ఎలక్ట్రిక్‌ వాహనాల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌, రంగారెడ్డి జిల్లాల్లో ఐటీని మరింతగా విస్తరిస్తామని ప్రకటించారు.



'వెల్‌స్పన్‌' రెండో యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్‌. చిత్రంలో సబిత, రంజిత్‌ రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు

40 నుంచి 50 పరిశ్రమల ఏర్పాటుకు కృషి

వెల్‌స్పన్‌లో కార్యక్రమం అనంతరం రంగారెడ్డి జిల్లా షాబాద్‌ మండలం హైతాబాద్‌ చౌరస్తాలో బీఆర్‌ఎస్‌ జెండాను మంత్రి కేటీఆర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. చందనవెల్లి, సీతారాంపూర్‌కు పరిశ్రమలు తెచ్చి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని.. ఇక్కడి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్‌ పారిశ్రామిక హబ్‌ ఏర్పాటు చేశారని చెప్పారు. ఇక్కడ 40 నుంచి 50 పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హైతాబాద్‌, చందనవెల్లి, మాచనపల్లి గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు హెచ్‌ఎండీఏ ప్లాట్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

త్వరలో పాలమూరు పూర్తి చేస్తాం

కాళేశ్వరం ప్రాజెక్టు తరహాలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తిచేసి షాబాద్‌ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని కేటీఆర్‌ చెప్పారు. రైతులకు సాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, శంభీపూర్‌ రాజు, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు సాదర స్వాగతం

స్వాగతం పలికిన ఏపీ సీఎం జగన్

సాక్షి, అమరావతి/విమానాశ్రయం (గన్నవరం): ఏపీ నూతన గవర్నర్‌గా నియమితులైన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాదర స్వాగతం పలికారు. జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి 8.15కి ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను సీఎం జగన్ శాలువాతో సత్కరించారు.



గవర్నర్‌కు సీఎం జగన్ ఆత్మీయ వీడ్కోలు

సాక్షి, అమరావతి/విమానాశ్రయం(గన్నవరం): ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీపై వెళ్తున్న విశ్వభూషణ్ హరిచందన్‌కు సీఎం వైఎస్ జగన్ బుధవారం గన్నవరం విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు. విజయవాడ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న విశ్వభూషణ్, సుప్రవ దంపతులను సీఎం జగన్ సత్కరించారు. విధి నిర్వహణలో సహకరించిన సీఎం జగన్‌కు, రాష్ట్ర ప్రజలకు హరిచందన్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనకు పోలీసు బలగాలు గౌరవవందనం సమర్పించాయి. గవర్నర్ దంపతులను సీఎం జగన్ ప్రత్యేక విమానం వరకు తోడ్కొని వెళ్లారు. విశ్వభూషణ్ పాదాలకు జగన్ నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు.

క్లుప్తంగా...

నేడు భూపాలపల్లిలో కేటీఆర్ పర్యటన



భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గురువారం ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారు. కేటీఆర్‌తో పాటు మంత్రులు సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి వెళ్లనున్నారు. గణపురం తహసీల్దార్ కార్యాలయం, గాంధీనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే సింగరేణి కార్మికుల కోసం నిర్మించిన క్వార్టర్లు, దివ్యాంగుల కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తారు. భాస్కరగడ్డలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను, మినీ స్టేడియం పనుల్ని ప్రారంభిస్తారు. సాయంత్రం భూపాలపల్లిలో బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. బహిరంగ సభ ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు పరిశీలించారు.

పాలన చేతకాకే దాడులు: వైఎస్ షర్మిల



పవన్‌ను పరామర్శిస్తున్న వైఎస్ షర్మిల

రాంగోపాల్‌పేట్: బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలను పాలించడం చేతకాక ప్రతిపక్షాలు, ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడుతుందని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. హనుమకొండలో బీఆర్‌ఎస్ నాయకుల చేతిలో గాయపడి సికింద్రాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ కుమార్‌ను బుధవారం ఆమె పరామర్శించారు. పవన్ తల్లితో మాట్లాడి అండగా ఉంటామని చెప్పారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని రాష్ట్రపతి పాలన విధించాలని గవర్నర్‌ను కలిసి కోరతానని తెలిపారు. పోలీసులు దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో తాను చేసిన వ్యా ఖ్యలు హిజ్రా అక్కాచెల్లెళ్ల మనసు నొప్పించి ఉంటే బేషరతుగా క్షమాపణ చెబుతున్నానని షర్మిల తెలిపారు.

అతిథులు వస్తున్నారు!



కరోనా తర్వాత తెలంగాణకు పెరుగుతున్న టూరిస్టుల సంఖ్య

2021-22లో 3.2 కోట్ల మంది, 2022-23లో 6.07 కోట్ల మంది స్వదేశీ పర్యాటకుల రాక


5,917 నుంచి 68,401కి చేరిన విదేశీ పర్యాటకుల సంఖ్య

2014-15లో సందర్శించిన 7.2 కోట్ల మందితో పోలిస్తే ఇంకా వెనుకబాటే

సాక్షి, హైదరాబాద్: కరోనా మహమ్మారికి కుదేలైన తెలంగాణ పర్యాటకం క్రమంగా పుంజుకుంటోంది. స్వదేశీ, విదేశీ పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. కరోనా కంటే ముందున్న స్థాయిలో కాకున్నా చాలావరకు మెరుగుపడింది. తెలంగాణ సామాజిక ఆర్థిక సర్వే-2023 ప్రకారం ఈ ఏడాది (2022-23)లో 68 వేల మందికిపైగా విదేశీ పర్యాటకులు, 6 కోట్ల మందికిపైగా స్వదేశీయులు (వివిధ రాష్ట్రాలకు చెందినవారు) తెలంగాణ ఆధ్యాత్మిక, పర్యాటక సొబగులను ఆస్వాదించేందుకు వచ్చారు. యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం సహా కొలనుపాక, తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదాద్రి, భద్రాద్రికి సందర్శకులు పోటెత్తుతున్నారు. కేవలం తీర్థయాత్రలేగాకుండా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, చార్మినార్, గోల్కొండ వంటి చారిత్రక కట్టడాలతోపాటు గతేడాది అట్టహాసంగా ప్రారంభమైన ముచ్చింతల్‌లోని శ్రీరామనగరానికి కూడా వివిధ రాష్ట్రాల నుంచి సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. విదేశీ టూరిస్టుల్లో మాత్రం అగ్రభాగం వైద్యసేవలు పొందేందుకే వస్తున్నారు. వారిలో ఎక్కువ శాతం మంది ఆఫ్రికా దేశాల నుంచి వస్తుండగా యూరప్, అమెరికా తదితర దేశాల నుంచి సందర్శకులు, ఐటీ నిపుణులు భాగ్యనగరానికి అత్యధికంగా వచ్చిన వారిలో ఉన్నారు.

మహమ్మారి వ్యాప్తికి ముందు 9 కోట్లకు పైనే

2020లో కరోనా మహమ్మారి వ్యాప్తితో ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం కుదేలైంది. లాక్‌డౌన్లు, కరోనా ఆంక్షల కారణంగా జనజీవనం దాదాపుగా స్తంభించింది. ఆ తర్వాత ప్రజల్లో రోగనిరోధక శక్తి పెరగడం, టీకాలు అందుబాటులోకి రావడం, ఆంక్షలను సడలించడంతో క్రమంగా పర్యాటకం ఊపందుకుంటోంది. కరోనా వ్యాప్తికి ముందు 2016-17లో అత్యధికంగా 9.5 కోట్ల మందికిపైగా స్వదేశీ, 1.6 లక్షల మందికిపైగా విదేశీ పర్యాటకులు రాష్ట్రానికి వచ్చారు. కరోనా తాకిడి తర్వాత అత్యల్పంగా 2021-22లో 3.2 కోట్ల మంది స్వదేశీ పర్యాటకులు, 5,917 మంది అంతర్జాతీయ పర్యాటకులు వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక ఆ మరుసటి ఏడాదిలోనే ఈ సంఖ్యలో 89.84% (స్వదేశీ పర్యాటకులు), 1,056.01% (విదేశీ పర్యాటకులు) వృద్ధి నమోదు కావడం విశేషం.



ఆలయ పర్యాటకం పెరిగింది..



రాష్ట్రంలోని దేవాలయాలకు ముఖ్యంగా రామప్ప ఆలయం, వేయి స్తంభాల గుడి వంటి చోట్లకు టెంపుల్ టూరిజం అనూహ్యంగా అభివృద్ధి చెందింది. హైదరాబాద్‌లో హోటళ్ల ఆక్యుపెన్సీ రేటు 50-60 శాతం నుంచి ఇప్పుడు సుమారు 80 శాతానికి చేరింది.

– మనోహర్, తెలంగాణ పర్యాటక శాఖ ఎండీ

గోల్కొండ కోట బాగుంది..



హైదరాబాద్‌లో అనేక పర్యాటకప్రాంతాలను సందర్శించాం. అందులో గోల్కొండ కోట బాగా నచ్చింది. తాజ్ మహల్ తర్వాత అంత బాగున్న చారిత్రక కట్టడ మిదే. హైదరాబాద్‌లో చార్మినార్ చూడముచ్చటగా ఉంది. చారిత్రక, వారసత్వ సంపదను కాపాడుకోవడం మంచి సంకల్పం. లాడ్‌బజార్‌లో గాజులు కూడా కొనుగోలు చేశాం.

– హేలీ, గ్రేసియా, ఇంగ్లాండ్

డర్టీ డజన్ ఎమ్మెల్యేలు..

కాంగ్రెస్‌ను వీడిన ఎమ్మెల్యేలపై సంచలన వ్యాఖ్యలు.. మోసం చేసిన కోవర్టులకే మంత్రి పదవులా?

నాడు వైఎస్ హయాంలోనే ఇళ్లు.. మళ్లీ లేవు.. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

భూపాలపల్లి/మొగుళ్లపల్లి: 'మేం గెలిపిస్తే.. మా గుండెల మీద తన్ని, ఆస్తుల సంపాదన కోసం కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన డర్టీ డజన్ ఎమ్మెల్యేలు ప్రస్తుతం దొరగాని దొడ్లో పశువులుగా మారారు'అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్‌నుద్దేశించి ''నక్సలైట్ ఎజెండా అంటివి ఏమైంది? మోసం చేసిన కోవర్టులకే మంత్రి పదవులా..'అంటూ ఘాటు విమర్శలు చేశారు. రేవంత్ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొనసాగింది. రాత్రి మొగుళపల్లి మండల కేంద్రంలో జరిగిన సభలో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు ధరణితో దందాలు చేస్తున్నారని, భూకబ్జాలకు పాల్పడుతూ పేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు, ఉపాధి లభించక, కనిపెంచిన తల్లిదండ్రుల బాధలు చూడలేక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్ ఒక్క ఇల్లూ ఇవ్వలేదు..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, ముదనష్టపోడు కేసీఆర్ ఒక్క ఇల్లు ఇవ్వలేదన్నారు. పసిపిల్లాడిని కుక్కలు పీక్కొని తింటే పట్టించుకోని దుర్మార్గ ప్రభుత్వం ఇదని రేవంత్ ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌కు రెండుసార్లు అధికారం ఇచ్చారని, తెలంగాణ ఇచ్చిన పార్టీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే రూ. 500కే గ్యాస్ సిలిండర్, రూ. 2 లక్షల రైతు రుణ మాఫీ, సొంతింటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు, 2 లక్షల కొలువులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.



రేవంత్‌రెడ్డితో కలిసి నడుస్తున్న వృద్ధురాలు

గండ్ర ఆస్తి మొత్తం కాంగ్రెస్‌దే

స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. గండ్ర ఆస్తి మొత్తం కాంగ్రెస్‌దేనని అన్నారు. ఆయనను ఎమ్మెల్యేను, చీఫ్‌విప్‌ను చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. ఈ విషయాలపై మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం సాక్షిగా విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు.

కుక్కలకు ఉన్న విలువ మనుషులకు లేదా?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రశ్న



తాండూరు: సీఎం కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లోని కుక్కలకు ఇస్తున్న విలువ మనుషులకు ఇవ్వడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ విమర్శించారు. బుధవారం తాండూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుక్కల దాడిలో బాలుడు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కుక్కలు వీరవిహారం చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని, ప్రజలను కుక్కల దాడి నుంచి కూడా కాపాడలేరా అని నిలదీశారు. ఎమ్మెల్యేల ఎర కేసు ఓ ఫాల్తు కేసని కోర్టు చెప్పిందన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో కేసీఆర్ కూతురు కవిత పేరు ఉందనేది నిజమన్నారు. ''దొంగ చాలా పవర్‌ఫుల్ ఉంది.. తప్పించుకోకుండా ఉండటానికే పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తున్నారు''అని సంజయ్ వ్యాఖ్యానించారు. బీజేపీ నాయకులపై దాడులు పెరిగాయని, ఇప్పటికే 30 శాతం పార్టీ నాయకులపై కేసులు నమోదు చేశారన్నారు. ఎంత మందిపై, ఎన్ని కేసులు నమోదు చేసినా భయపడబోమని సంజయ్ స్పష్టం చేశారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణపై దాడి చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పోలీసు శాఖ అధ్వానంగా మారిందని, నిజాయితీ అధికారులంతా లూప్‌లైన్‌లో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. మీడియా సమావేశంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సదానంద రెడ్డి తదితరులు ఉన్నారు.

బెల్గాం ఎక్స్‌ప్రెస్ రైలుకు బాంబు బెదిరింపు!

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నుంచి బల్లారి వెళ్లాల్సిన బెల్గాం ఎక్స్‌ప్రెస్ రైలుకు బుధవారం రాత్రి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అరగంట పాటు రైలును నిలిపి వేసి, తనిఖీ చేశారు. అయితే అది ఫేక్‌కాల్ అని నిర్ధారించుకున్న తర్వాత రైలును అక్కడి నుంచి పంపించేశారు. నగరంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఓ వ్యక్తి పోలీసులపై కోపంతో రైల్వే స్టేషన్‌కు బాంబు బెదిరింపు కాల్ చేసినట్లు తెలిసింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

బీజేపీ వ్యతిరేకులకు మద్దతు

- కాంగ్రెస్ పార్టీ శత్రువు కాదు...
- బీఆర్‌ఎస్‌కు రాం రాం చెప్పలేదు
- అదానీకి ఆఫ్ఘనిస్తాన్ డ్రగ్ మాఫియాతో సంబంధాలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి తమకు శత్రువులేమీ కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వ్యాఖ్యానించారు. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరొచ్చినా తాము మద్దతిస్తామన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీకి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికన పనిచేయాలని తాము నిర్ణయించుకున్నామని చెప్పారు. ఆ పద్ధతిలోనే తెలంగాణలో ఒక రాజకీయ విధానంతో ముందుకు పోతున్నామని నారాయణ వివరించారు.

మేమేమీ సన్యాసులం కాదు..: తామేమీ సన్యాసులం, సర్వ సంఘ పరిత్యాగులం కాదని నారాయణ వ్యాఖ్యానించారు. తమకు అధికారం రాకున్నా, ఎంపీలు, ఎంఎల్‌ఏలు ఉండాలని అనుకుంటామని, అందుకనుగుణంగానే వ్యవహరిస్తామన్నారు.

అదానీ వ్యవహారంపై విచారణ జరపాలి: ఇటీవల వీధి కుక్కలపై గోల ఎక్కువైందని, అంతకుమించి దేశానికి ప్రమాదకారిగా మారిన అదానీ గురించి దృష్టి సారించాలని నారాయణ వ్యాఖ్యానించారు. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీకి ఆఫ్ఘనిస్తాన్ డ్రగ్స్ మాఫియాతో సంబంధాలున్నాయని ఆరోపించారు. తాలిబాన్లు పండించే గంజాయిని అదానీకి చెందిన ముంద్రా పోర్టు ద్వారా దిగుమతి చేసుకొని దేశమంతా సరఫరా చేస్తారని, అందుకు వీలుగానే గంగవరం, కృష్ణపట్నం, మచిలీపట్నం తదితర పోర్టులను అదానీకి కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం సహకరించిందని ఆరోపించారు. అదానీ, ఆయన కుమారుడిపై డ్రగ్స్ కేసులున్నాయన్నారు. ఈ నెల 25 నుంచి 27 వరకు పాండిచ్చేరిలో జరిగే తమ పార్టీ జాతీయ సమితి సమావేశాల్లో దేశంలోని రాజకీయ పరిస్థితులు, ఎన్నికలపై చర్చిస్తామని నారాయణ వెల్లడించారు.

'పోలింగ్ బూత్ సశక్తికరణ్'కు సంసిద్ధం!

బూత్ స్థాయిలో పార్టీ పటిష్టత, కార్యక్రమాల నిర్వహణపై బీజేపీ దృష్టి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పోలింగ్ బూత్‌స్థాయి నుంచి పార్టీ పటిష్టం చేయడంపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా 'పోలింగ్ బూత్ సశక్తికరణ్'కు సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో 'పోలింగ్ బూత్ సశక్తికరణ్'కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేలా రాష్ట్ర పార్టీకి దిశానిర్దేశం చేసేందుకు గురువారం బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శులు సునీల్ బన్సల్, తరుణ్‌ఛుగ్, కార్యదర్శి అర్వింద్ మీనన్ ఇక్కడకు వస్తున్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దీనిపై సమీక్షతోపాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జీలకు శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. 24న 119 అసెంబ్లీ నియోజకవర్గ విస్తారక్‌లకు శిక్షణా కార్యక్రమం కూడా ఇక్కడే నిర్వహించనున్నట్టు సమాచారం. అన్నిబూత్ కమిటీల సభ్యులు 'సరళ్'(సంఘటన్ రిపోర్టింగ్ అండ్ అనాలిసిస్) మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, దానిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంపై దృష్టి కేంద్రీకరించారు. సశక్తికరణ్ కార్యక్రమ పటిష్ట నిర్వహణకు రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో నలుగురేసి సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేసినట్టు సమాచారం. తాజాగా ఢిల్లీ నుంచి అగ్ర నాయకత్వం జూమ్ కాన్ఫరెన్స్‌ల ద్వారా వివిధ జోన్లకు సంబంధించి పర్యవేక్షించింది. అందులో భాగంగానే తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్, అర్వింద్ మీనన్ రెండేసి జిల్లాల చొప్పున సమీక్షలు నిర్వహించారు.



అవసరాలను తీర్చేలా విద్య

- ఉన్నత విద్యలో సరికొత్త మార్పులు అవసరం
- వచ్చే ఏడాది నుంచి నూతన బోధన ప్రణాళిక
- మేధకు పదును పెట్టే పరీక్ష విధానం
- బోధన ప్రణాళిక అభివృద్ధి ప్రాజెక్టు సదస్సులో వక్తలు



సదస్సులో జ్యోతిప్రజ్వలన చేస్తున్న నవీన్ మిత్తల్ తదితరులు


సాక్షి, హైదరాబాద్: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్యను తీర్చిదిద్దాలని తెలంగాణ బోధన ప్రణాళిక అభివృద్ధి ప్రాజెక్టుపై జరిగిన సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ ప్రక్రియలో రాష్ట్రం ముందుందని చెప్పారు. బెంగళూరుకు చెందిన అబెరిస్టిత్ యూనివర్సిటీ, సౌత్ ఇండియా బ్రిటిష్ కౌన్సిల్ సౌజన్యంతో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి.. సెంటర్ ఫర్ ఎకనమిక్, సోషల్ స్టడీస్ (సెస్)లో రెండ్రోజుల వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి ప్రారంభోపన్యాసం చేస్తూ, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ఉన్నత విద్య బోధన ప్రణాళికను రూపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో విదేశీ విశ్వవిద్యాలయాల తోడ్పాటు ఆహ్వానించదగ్గ పరిణామమని తెలిపారు. ఉస్మానియా, కాకతీయ వర్సిటీల పరిధిలో చరిత్ర, వాణిజ్య, ఆర్థిక, రాజనీతి శాస్త్రాల్లో వచ్చే ఏడాది నుంచి కొత్త పాఠ్య ప్రణాళిక అమల్లోకి వస్తుందని చెప్పారు.

మేధకు పదును పెట్టాలి: నవీన్ మిత్తల్

చదువు తర్వాత విద్యార్థులు సులువుగా ఉపాధి పొందేలా విద్యావిధానం ఉండాలని కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ చెప్పారు. సాధించే డిగ్రీలు వాస్తవ విజ్ఞానానికి కొలమానం కావడం లేదని, అసలైన సృజనాత్మక విధానంతో విద్యార్థులను పరీక్షించాలన్నారు. ప్రస్తుత పరీక్ష విధానం విద్యార్థుల్లో దాగున్న అసలైన ప్రతిభను వెలికితీయడం లేదని చెప్పారు. అనలికల్, క్రిటికల్ ఆలోచన విధానం ఉండటంలేదని, దీనివల్ల ప్రాక్టికల్ నాలెడ్జ్ కొరవడి మారుతున్న కాలంతో పోటీ పడలేని స్థితి ఏర్పడిందని వివరించారు. విద్యార్థుల్లోని జ్ఞాపకశక్తికి పదును పెడితే విభిన్న కోణాల్లో ఆలోచన విధానం మెరుగుపడుతుందని, ఈ దిశగా బోధన విధానాన్ని తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆ దేశాలతో పోటీ: వాకాటి కరుణ

యూకే, యూఎస్ వంటి అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా రాష్ట్ర ఉన్నత విద్యలో మార్పులు మంచి పరిణామమని విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. ఆలోచనాత్మక విద్యాబోధన దిశగా సాగుతున్న ప్రయత్నానికి అన్ని విధాలా సహకరిస్తామని ఉస్మానియా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో బంగోర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జనకపుష్పనాథన్, బ్రిటీష్ కౌన్సిల్‌కు చెందిన ప్రొఫెసర్ ఉషాకిరణ్, సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.





మీకు ఒక స్నేహితుడు ఉంటే, అతడి కోసం యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉండాలి. యుద్ధం చేయాలంటే, మరొకరికి శత్రువుగా ఉండగలిగే సమర్థత ఉండాలి.

– జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, ఫిబ్రవరి, 23

కులజాడ్యానికి కళ్లెం!

భారత్‌లో శతాబ్దాలుగా వేళ్లూనుకున్న ‘కులం’ ఖండాంతరాలు దాటిందని, అది తమ దేశంలో ప్రవేశించి ఏపుగా ఎదుగుతున్నదని అమెరికా నగరాల్లో ఒకటైన సియాటల్ నగర కౌన్సిల్ గుర్తించింది. కుల వివక్షను శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తూ మంగళవారం ఆర్డినెన్సు జారీచేసింది. దీని ప్రకారం ఉపాధి, హౌసింగ్, రీటెయిల్, ప్రజా రవాణా తదితర రంగాల్లో కుల వివక్ష ప్రదర్శించినట్టు తేలితే శిక్షలుంటాయి. అంతక్రితం మాటేమోగానీ సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు రావటం మొదలయ్యాక మన దేశంనుంచి దళితులు పెద్ద సంఖ్యలో అమెరికాకు వెళ్లటం మొదలైంది. ఆ తర్వాతే కుల వివక్ష గురించిన ఆరోపణలు వెల్లువెత్తాయి. అదంతా నిజం కాదని, హిందూమతాన్ని కించపరచటం కోసం ఈ ప్రచారం చేస్తున్నారని ఆక్రోశించేవారూ లేకపోలేదు. ఈ సందర్భంలో అసాధారణ ప్రతిభావంతుడైన శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు సంబంధించిన ఒక ఉదంతాన్ని గుర్తు తెచ్చుకోవాలి. జర్మనీలో హిట్లర్ అధికారం పీఠం ఎక్కడానికి నెలముందు...అంటే 1932 డిసెంబర్‌లో ఆయన అమెరికా వచ్చేశాడు. అయితే తాను ఒక యూదుగా ఇన్నేళ్లూ జర్మనీలో చవిచూసిన వివక్షే అక్కడి ఆఫ్రికన్ అమెరికన్లు కూడా ఎదుర్కొనటం చూసి నిర్ఘాంతపోయాడు. వివక్ష ఎదుర్కొనటంలో ఆయనకున్న అనుభవమే అమెరికాలో దాన్ని గుర్తించేలా చేసింది. బహుశా మన దేశంనుంచి వెళ్లిన దళితులు, ఇతర అట్టడుగు కులాలవారూ అలాంటి కారణం చేతనే కుల వివక్ష గురించి ఆరోపణలు చేసే పరిస్థితి ఏర్పడివుండొచ్చు. కాలిఫోర్నియాలోని ఈక్విటీ లాబ్స్ సంస్థ 2018లో ఒక నివేదిక వెలువరించింది. దాని ప్రకారం 67 శాతంమంది దళితులు పని ప్రదేశాల్లో తమను అనుచితంగా చూస్తున్నారని ఆరోపించారు. కులం కారణంగా దాడులు, దుర్భాషలు ఎదుర్కొన్నామని 25 శాతం మంది చెప్పారు. తమ కులాన్ని ఎత్తిచూపుతారని నిరంతరం భయపడుతుంటామని 50 శాతం మంది దళితులు తెలియజేశారు. 1,500మందిని సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. సిస్కో సిస్టమ్స్ సంస్థలో కుల వివక్ష కారణంగా తనకు న్యాయబద్ధంగా రావలసిన పదోన్నతులనూ, వేతన పెంపునూ అడ్డుకున్నారని రెండేళ్లక్రితం ఒక యువతి కోర్టుకెక్కటం అందరికీ తెలుసు. ఆధిపత్య కులానికి చెందిన ఇద్దరు మేనేజర్లు తనను అనేకరకాలుగా వేధించారని ఆమె ఆరోపించారు. ఆ తర్వాత కొన్ని విశ్వవిద్యాలయాలు, యాపిల్ సంస్థ, డెమాక్రటిక్ పార్టీ వంటివి తమ వివక్ష వ్యతిరేక విధానంలో కుల వివక్షను కూడా చేర్చాయి. ఈ పరిణామాలన్నీ అమెరికాలో కులవివక్ష పెరగటాన్నీ, దాన్ని అరికట్టే ప్రయత్నాలనూ పట్టిచూపుతున్నాయి. ఒక్క అమెరికా అనేమిటి...మన దేశ పౌరులు, మరి కొన్ని దక్షిణాసియా దేశాల పౌరులు వెళ్లిన ప్రతి దేశంలోనూ కులవివక్ష ఆరోపణలు తరచు వినబడుతూనే ఉన్నాయి.

ఏ దేశానికైనా పోవాలంటే ఎన్నో అవరోధాలుంటాయి. ముఖ్యంగా అమెరికా వెళ్లేందుకు వీసా రావాలంటే సవాలక్ష ప్రశ్నలకు జవాబివ్వాలి. ఇక ఆ గడ్డపై అడుగుపెట్టాక ఎదుర్కొనాల్సిన తనిఖీల గురించి చెప్పనవసరం లేదు. అయితే ఈ క్రమంలో ఎక్కడా కనబడనిదీ, ఎవరికీ దొరకనిదీ కుల తత్వం. మన దేశంలో ఈ కులతత్వం కనబడని చోటంటూ ఉండదు. ఇదొక నిచ్చెనమెట్ల వ్యవస్థ. ప్రతి కులమూ వివక్షను ఎదుర్కొంటూనే తాను అణచడానికి కింద మరో కులం ఉందని తృప్తిపడుతుంటుంది. కింది కులాల శ్రమను దోచుకోవటానికి పనికొస్తుంది గనుక రాచరిక, భూస్వామ్య వ్యవస్థలు ఆ కుల వ్యవస్థను చెక్కుచెదరకుండా కాపాడాయి. ఆ తర్వాత వచ్చిన బ్రిటిష్ పాలకులు ‘విభజించు పాలించు’ అనే తమ సిద్ధాంతానికి అక్కరకొస్తుందని గ్రహించి దీని జోలికి పోలేదు. నిజానికి వలసపోయిన భారతీయుల్లోని కుల వివక్షను గుర్తించి దాన్ని కూకటివేళ్లతో పెకిలించటానికి రెండు దశాబ్దాలనాడే దళిత సంఘాల నాయకులు, మేధావులు గట్టి ప్రయత్నం చేశారు. జాత్యహంకారానికి వ్యతిరేకంగా 2001లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ సదస్సులో కుల వివక్షను కూడా జాతివివక్షతో సమానంగా పరిగణించాలని వారు డిమాండ్ చేశారు. కానీ కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వం దాన్ని అడ్డుకో గలిగింది.

అమెరికాలోని భారతీయులనూ, భారతీయ అమెరికన్లనూ ‘ఆదర్శనీయ మైనారిటీ’గా అభివర్ణిస్తుంటారు. ఎందుకంటే ఇతర దేశాలనుంచి అక్కడికి వలసవచ్చినవారితో పోలిస్తే ఈ ‘ఆదర్శనీయ మైనారిటీ’లో ఉన్నత చదువులు చదువుకునేవారూ, ఉన్నత స్థానాల్లో స్థిరపడినవారూ, రెండు చేతలా సంపాదించేవారూ, క్రమం తప్పకుండా ఆరోగ్య బీమా తీసుకునే స్తోమత గలవారూ అధికం. అనేక బహుళజాతి సంస్థల సారథులు భారతీయులే. ‘స్టెమ్’(సైన్సు, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమేటిక్స్) విభాగాల్లో ఇతర గ్రూపులతో పోలిస్తే వీరి హవా ఎక్కువ. ఈమధ్యకాలంలో రాజకీయాల్లో సైతం సత్తా చాటే స్థితికి చేరుకున్నారు. అయితే అంతా బాగానే ఉందిగానీ... ఎవరూ వేలెత్తి చూపక ముందే అమెరికాలోని హిందూ మత సంస్థలు మేల్కొని కులవివక్షను రూపుమాపేందుకు తగిన కార్యాచరణకు పూనుకొనివుంటే ఈ ప్రతిష్ట మరింత ఇనుమడించేది. అందుకు బదులు బుకాయింపులే వారి ఆయుధాలయ్యాయి. ఎంతకాలం ఈ నాటకం రక్తికడుతుంది? ఇవాళ సియాటల్ ఆలోచించినట్టే రేపన్నరోజున మరిన్ని నగరాలు, రాష్ట్రాలు కూడా చర్యలు తీసుకోవచ్చు. వేరే దేశాలకూ విస్తరించవచ్చు. వివక్ష ఉన్నచోటల్లా ఎవరి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా దానికి ప్రతిఘటన సాగుతూనే ఉంటుంది. పరిణతితో ఆలోచిస్తేనే ఏ సమస్యకైనా పరిష్కారం దొరుకుతుంది.

హిందూమతం పురోగమించాలంటే...



మల్లెపల్లి లక్ష్మయ్య

మహాశివరాత్రి పూజల కోసం దేవాలయానికి వెళ్లిన ఒక దళిత మహిళను మధ్యప్రదేశ్‌లో ఆధిపత్య కులాల జనం అడ్డుకున్నారు. ఇలాంటి వార్తల్లోకొచ్చే ఘటనలతో పాటు, రానివి ఎన్నో దేశంలో చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కులానికి కాలం చెల్లిందని మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. హిందూ ధార్మిక పీఠాధిపతులు వీటిని సహించలేక పోయారు. హిందూ ధార్మిక వ్యవస్థలో బ్రాహ్మణ పూజారి వర్గం ఆధిపత్యం ఎట్లా కొనసాగుతోందో దీనితో మనకు అర్థం కాగలదు. ఆర్‌ఎస్‌ఎస్ లాంటి సంస్థలకు కులనిర్మూలన మీద చిత్తశుద్ధి ఉంటే, ఈ బెదిరింపులకు భయపడకూడదు. అంబేడ్కర్ చెప్పినట్టు కుల నిర్మూలనకు పూనుకోకుండా, హిందూమతం పురోగమించడం అసాధ్యం.

మధ్యప్రదేశ్ లోని కర్‌గోవ్ గ్రామంలో మహాశివరాత్రి రోజు పూజలు చేయడానికి దేవాలయానికి వెళ్లిన బలాయి కులానికి చెందిన దళిత మహిళను గ్రామంలోని ఆధిపత్య కులాల జనం అడ్డుకున్నారు. దళితులు దానిని ప్రతిఘటించడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దాదాపు పన్నెండు మంది గాయపడ్డారు. ఇరువర్గాలు తలపడటంతో పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మరో గ్రామమైన ఛోటా కర్సవాడలో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. పోలీసులు రెండు వర్గాల మీద కేసులు నమోదు చేశారు. ఇది కొన్ని జాతీయ దినపత్రికల్లో అచ్చయినందు వల్ల మనకు తెలిసింది. అసలు వార్తల్లోకి రాని ఎన్ని గ్రామాల్లో ఇటువంటి సంఘటనలు జరిగాయో తెలియదు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. చాలా గ్రామాల్లో దళితులు గ్రామంలోని దేవాలయంలోకి వెళ్లడానికి ఇష్టపడరు. ఒకవేళ పోవడానికి ప్రయత్నిస్తే ఇటువంటి సంఘటనలు జరుగుతాయని భయపడి ఊరుకుంటారు. ఇటీవల జరిగిన ఎన్నో సంఘటనలు దీన్ని రుజువు చేస్తాయి.

ఈ నేపథ్యంలో ఇటీవల హిందూ ప్రముఖుల మధ్య జరిగిన వివాదం గురించి చెప్పాల్సి ఉంది. ఈ నెల 6వ తేదీన ముంబయిలో సంత్ రవిదాసు జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని రేపాయి. ‘‘కులవ్యవస్థకు కాలం చెల్లింది. కుల వ్యవస్థను భగవంతుడు సృష్టించాడనడం అబద్ధం. కొంతమంది పండితులు తప్పుదోవ పట్టించారు. దీనిని మనం పక్కన పెట్టాలి’’ అంటూ ఆ సభలో వ్యాఖ్యానించారు. సంత్ రవి దాస్ ఈ దేశంలోని కులవ్యవస్థను నిరసించిన తాత్వికులలో ఒకరు. రవిదాస్ బోధనలు ఎంతో మందిని ప్రభావితం చేశాయి. దానినే మోహన్ భాగవత్ పునరుద్ఘాటించారు. అది నిజానికి కొంతలో కొంత సత్యం. కానీ హిందూ ధార్మిక పీఠాధిపతులు దానిని సహించలేక పోయారు. వెంటనే భాగవత్ మీద విరుచుకుపడ్డారు. పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి ఈ వ్యాఖ్యలను ఖండించడమే కాకుండా, కుల వ్యవస్థను సంపూర్ణంగా సమర్థించారు. అంతే కాకుండా, పండితులైన బ్రాహ్మణులను, వారి చర్యలను కొనియాడారు.

‘‘బ్రాహ్మణులు ప్రపంచంలోనే అత్యంత మేధోశక్తి కలిగినవాళ్ళు. కుల వ్యవస్థ ఈ దేశానికి మేలు చేసింది. విద్య, వైద్యం, రక్షణ రంగాల్లో ప్రపంచానికి మార్గదర్శనం చేసింది’’ అంటూ ఆర్‌ఎస్‌ఎస్‌ను తీవ్రంగా విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కూడా సంపూర్ణంగా భాగవత్‌ను సమర్థించలేకపోయారు. పండితులంటే బ్రాహ్మణులు కారనీ, అది కులాన్ని దృష్టిలో పెట్టుకొని అనలేదనీ వివరణ ఇచ్చారు. పూరీ శంకరాచార్యకు సంజాయిషీ ఇచ్చుకునే వరకు వెళ్ళారు.

కొత్త కోణం



కులవ్యవస్థను నిర్మూలించాలనే లక్ష్యంలో పనిచేయాలనుకుంటున్నామని ఒక వైపు ప్రకటిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, రెండోవైపు పీఠాధిపతుల విమర్శలకు భయపడిపోయింది. దాదాపు పది సంవత్సరాల క్రితం 2014 మార్చ్ 7న భాగవత్‌ను నాగపూర్ ఆర్‌ఎస్‌ఎస్ కేంద్ర కార్యాలయంలో కలిశాం. నాతో పాటు సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి కూడా ఉన్నారు. సబ్ ప్లాన్ అమలు విషయంలో చట్టం చేయాలని అన్ని పార్టీలను, సంస్థలను కలిసే ప్రక్రియలో భాగంగా ఆయన్ని కూడా కలిశాం. అప్పుడు కులం, అంటరానితనం, హిందూ మతంలో సమస్యలపై దాదాపు మూడు గంటలపాటు చర్చ జరిగింది. ‘‘అందరూ హిందువులని మీరు భావిస్తే అంటరానితనం, కులవివక్ష కొనసాగకుండా ఎందుకు మీరు కార్యక్రమాలు తీవ్రతరం చేయరు?’’ అని అడిగినప్పుడు, ‘‘ఇది నెమ్మదిగా జరగాలి. చాలామంది హిందూ ధార్మికకర్తలు ఇప్పటికీ కులవ్యవస్థను సమర్థిస్తున్నారు’’ అంటూ సమాధానం ఇచ్చారు. హిందూ ధార్మిక వ్యవస్థలో బ్రాహ్మణ పూజారి వర్గం ఆధిపత్యం ఎట్లా కొనసాగుతోందో దీనితో మనకు అర్థం కాగలదు.

ఈ వ్యాసం మొదట్లో పేర్కొన్న మధ్యప్రదేశ్ సంఘటనలకు కారణం, హిందూ పూజారి వర్గం ఆధిపత్య స్వభావం. కులవ్యవస్థ నశిస్తే పూజారి వ్యవస్థ, దానితో పాటు బ్రాహ్మణిజపు ఆధిపత్యం కుప్పకూలిపోతుందని వారి భయం. ఇక్కడనే మనం అసలు సమస్యకు వద్దాం. కులవ్యవస్థను సమర్థిస్తున్నవాళ్ళ గురించి చర్చ అనవసరం. కులం పోవాలనీ, కులవ్యవస్థకు కాలం చెల్లిందనీ మాట్లాడుతున్నవాళ్ళకు కూడా, ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ లాంటి సంస్థలకు కులనిర్మూలన మీద చిత్తశుద్ధిలేదు. హిందువులంతా ఒక్కటేననీ, కులం లేదనీ భావిస్తే, శంకరాచార్య బెదిరింపులకు భయపడే వాళ్ళుకాదు.

అందుకే కులవ్యవస్థకు పునాది ఏమిటి? ఎవరు దీనిని పెంచి పోషించారు? అనే ప్రశ్నలు వేసుకోవాలి. దానికి తగ్గట్టుగా కార్యాచరణకు పూనుకోవాలి. దీనికి ఇప్పుడు పెద్దగా శ్రమపడాల్సిన అవసరం లేదు. బాబాసాహెబ్ అంబేడ్కర్ అందుకు తన జీవితాన్ని ధారపోశారు. కులం పుట్టుక నుంచి కుల నిర్మూలన వరకు శాస్త్రీయ పరిశోధన చేసి మన ముందు సమగ్రమైన పరిష్కారాలను ఉంచారు. కులవ్యవస్థకు, కులాల పుట్టుకకు బ్రాహ్మణ పూజారి వర్గమే మొదటగా బీజాలు వేసిందనీ, దానిని పెంచి పోషించిందనీ ఎన్నో దృష్టాంతాలతో రుజువు చేశారు. 1916 మే 9న కొలంబియా విశ్వవిద్యాలయంలో జరిగిన సెమినార్‌లో ‘‘భారత దేశంలో కులాల పుట్టుక, పనితీరు, అభివృద్ధి’’ అనే అంశంపై సశాస్త్రీయంగా ప్రసంగించారు. అప్పటివరకు కులం విషయంలో పరిశోధన చేసిన సెనార్ట్ నెస్‌ఫీల్డ్, సర్ హెచ్.హెచ్. రిస్‌లీ, డాక్టర్ కేడ్కర్‌ల అభిప్రాయాలను పూర్వపక్షం చేశారు. ‘‘కులం ఏకైక లక్షణం అంతర్ వివాహం. కులం మూలకారణం అదే అని నా ఉద్దేశం’’ అంటూ కులం పుట్టుకకు అంతర్ వివాహమే ప్రధాన కారణం అని చెప్పారు. కులం అనేది మొదటగా బ్రాహ్మణవర్గం తన గుంపును ఒక్క దగ్గర చేర్చి కంచె వేసుకున్నదనీ, దాని తర్వాత మిగతా వర్గాలు కంచెలు వేసుకున్నాయనీ అన్నారు. అందుకు గాను అనేక శాస్త్రాలను రూపొందించారనీ, అందులో బ్రాహ్మణవర్గం ఆధిపత్యాన్ని నిలబెట్టడానికి ఎన్నో కథలను సృష్టించారనీ అభిప్రాయపడ్డారు.

కులం పుట్టుక మీద ఆధారపడ్డ కులనిర్మూలన గ్రంథాన్ని రాసి, దేశానికి ఒక బృహత్తరమైన కార్యాచరణను రూపొందించారు అంబేడ్కర్. ఒక వేళ హిందూమతం తనను తాను సంస్కరించుకోవాలనుకుంటే రెండు మూడు ప్రతిపాదనలు చేశారు. హిందువులందరు ఒక్కటేనని చెప్పినప్పుడు, పూజారి వ్యవస్థను బ్రాహ్మణుల నుంచి విముక్తం చేసి, ఏ కులంవారైనా అర్హతను బట్టి పూజారులుగా నియమితులు కావాలన్నారు. కులవ్యవస్థను సమర్థిస్తున్న హిందూ గ్రంథాలలోని అంశాలను తొలగించాలని కూడా ప్రతిపాదించారు. నిజానికి ఈ రోజు హిందూ మతంగా చెప్పుకొంటున్న ఒక వ్యవస్థ, వేదాల కాలంలో ఉన్నట్టుగా లేదు. వేదాల కాలంలో యజ్ఞయాగాలలో ఉన్న ఆహారం, పద్ధతులన్నీ, బౌద్ధం తిరుగుబాటులో మార్చుకొని శాకాహారులుగా మారారు. ఇది వాస్తవం. అదే రీతిలో ఎన్నో జాతులను, కులాలను తమలో కలుపుకొన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీల ఇండ్లలోనికే వెళ్ళి పూజలు, పెళ్ళిళ్ళు చేయని పూజారులు ఇప్పుడు వెళుతున్నారు. ఇది ఒక మార్పే. అయితే ఇది సరిపోదు. బాబాసాహెబ్ చెప్పినట్టు కుల నిర్మూలనకు పూనుకోకుండా, హిందూమతం పురోగమించడం అసాధ్యం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్: 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

మూడు దశాబ్దాల ప్రేమ



ఇదే రోజున (ఫిబ్రవరి 22) నువ్వు 1995లో నీ ప్రేమను ఒప్పుకొని, నాకు ప్రపోజ్ చేశావు. కన్నార్పకుండా నేను అవునన్నాను. ఇప్పుడు 28 ఏళ్ల తర్వాత కూడా నీ కళ్లల్లోకి చూసినప్పుడు నేను నవ్వుతూ ఉంటానని గ్రహించాను. నీకు అవునని చెప్పడం నా జీవితంలో అత్యుత్తమ నిర్ణయం. లవ్యూ(సుందర్)!

– ఖుష్బూ సుందర్, నటి

అందరి కోసం



క్రైస్తవులందరికీ ప్రార్థనాయుత, శాంతిమయ లెంట్‌ను కోరుకుంటాను. ఈ భస్మ బుధవారంతో ఈ కాలాన్ని ప్రారంభిస్తున్నప్పుడు, ఇది మన అనిత్యతనూ, పశ్చాత్తాపాన్నీ, దేవుడి ప్రేమపూరిత కరుణనూ గుర్తు చేయాలి. అందరికీ శాంతి, న్యాయాలు ఉండే ప్రపంచం కోసం ప్రార్థించడం కొనసాగిద్దాం.

– సమియా సులుహు, టాంజానియా అధ్యక్షురాలు

ఒప్పుకుందాం!



ఇండియాలో కేవలం 5 పెద్ద ప్రైవేటు వ్యాపార సంస్థలు 400 బిలియన్ డాలర్లకు పైగా ఆస్తులను కలిగి వున్నాయి. ప్రభుత్వం దగ్గర సుమారు 600 బిలియన్ డాలర్లున్నాయి. పాకిస్తాన్‌లో మొత్తం ప్రకటిత వ్యాపారాల విలువ 50 బిలియన్లను దాటదు. ప్రభుత్వం దగ్గర 3 బిలియన్‌లున్నాయి. కానీ మన అహంకారం చూడండి!

– సయ్యద్ షబ్బార్ జైదీ, పాక్ ఆర్థికవేత్త


డిజిటల్లో టాప్



నేననుకోవడం, ఇండియా డిజిటల్ పేమెంట్ మౌలిక వ్యవస్థ ఎంత బలంగా ఉందో ప్రపంచం ఇంకా గుర్తించలేదు. ఇండియా డిజిటల్ పేమెంట్స్‌లో (ఫుట్‌బాల్ దిగ్గజం) లియోనల్ మెస్సీ లాంటిది. చాలా ముందుంది!

– పర్మిందర్ సింగ్, గూగుల్ మాజీ ఎండీ

ప్రతిదీ భిన్నమే



వేలకొలదీ చెట్లున్న అడవిలో, ఏ రెండు ఆకులూ ఒకలా ఉండవు. అలాగే అదే దారిలో చేసే రెండు ప్రయాణాలూ ఒకలా ఉండవు.

– పాలో కొయిలో, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

రామానుజుడే తిరుపతి నిర్మాత!

సందర్భం



ప్రొ॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

తిరుమల ఆలయంలో క్రీ.శ. పన్నెండవ శతాబ్ది నాటికి అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులను చక్కదిద్దడానికి తిరుమలను సందర్శించి, అక్కడ వాడుకలో ఉండిన వైఖానస ఆగమ సంప్రదాయ రీతికి తగినట్లు ఆధ్యాత్మిక రాజ్యాంగంగా పిలువదగిన ఒక నియమ, నిబంధనల పట్టికను రామానుజాచార్యులు రూపొందించారు.

‘వేంగడం’ కొండల్లోని వేంకటేశ్వరుడు అందరి దైవమనీ; కుల, తెగ, జాతి, భాష, మత భేద భావాలు లేని రీతిలో మానవులందరూ ఆయనను దర్శించుకోవడం, ఆరాధించుకోవడం; నైవేద్యం, ప్రసాదాలు, తీర్థం, కడకు శఠగోపం పొందే రీతిలో ఆలయ కార్యక్రమాలు నడవాలని రామానుజులు నిర్ధారించి ‘సమతా’ భావజాలానికీ, దాని విశ్వవ్యాప్తికీ బీజం వేయడం తిరుమల ఆలయంలోనే జరిగింది. ‘తిరుమల’ కొండలని పిలుస్తున్న కొండలు వేంకటేశ్వరునివేననీ, అక్కడ ఆయన మాత్రమే దైవంగా స్థానం కలిగి ఉండాలనీ, ఇతర దేవతా ఆలయాలు నిర్మించరాదనీ, ఆలయ కార్యక్రమాలు నిర్వహించేవారు తిరుమలలో నివాస గృహాలు నిర్మించుకోకూడదనీ, తిరుపతిలో ఏర్పరచబోవు అగ్రహారంలో నివసిస్తూ రోజూ తిరుమల వెళ్ళి ఆలయ కార్యక్రమాలు నిర్వహించాలనీ రామానుజాచార్యులు నిర్ణయించారు.



ఈ నిర్ణయానికి కొనసాగింపుగా నేటి తిరుపతిలోని కపిల తీర్థం రోడ్డుకు ఆనుకొని ఉండిన కొత్తూరు అనే, ‘బోయ కొట్టం’గా పిలువదగిన కోటవూరుకు అర కిలోమీటరు దూరంలో దక్షిణ దిశలో బహుశా, ఒక సెలయేటి ఒడ్డున రామానుజుల కాలానికి ఉండిన చిన్నస్థాయి పార్థసారథి గుడికి నాలుగు వైపులా ఒక బ్రాహ్మణ అగ్రహారాన్ని ఏర్పరచాలనీ, తిరుచుకనూరు అనబడే నేటి తిరుచానూరు నుండి తిరుమల ఆలయంలో సేవలు చేయడానికి నిత్యం సుదూర ప్రయాణం చేయాల్సి వస్తోన్న వారు ఈ అగ్రహారంలో నివసించేట్లు చేయాలనీ రామానుజులు భావించడం జరిగింది. ఈ ఆలోచన కలిగిన దశలోనే తిరుపతిలోని పార్థసారథి గుడి ప్రక్కనే చిదంబరం నుండి గోవిందరాజ ప్రతిమను తెచ్చి ప్రతిష్ఠాపన చేయగలిగితే అగ్రహారానికి ఒక పరిపూర్ణ హంగు ఏర్పడుతుందని రామానుజులు భావించారు. ఆ రెండు విషయాలను నేటి తిరుపతి, దాని పరిసర విశాల ప్రాంతాలను... నేటి నారాయణవనంను రాజధానిగా చేసుకుని పరిపాలిస్తున్న ‘సామంత’ యాదవ రాయలు ఘట్టిదేవకు తెలుపడంతో ఆయన ఆ రెండు కార్యాలకు అవసరమైన ఏర్పాట్లు చేశాడు. కడకు, ఫిబ్రవరి 24, 1130వ తేదిన గోవిందరాజ ప్రతిమా ప్రతిష్ఠాపన చేయడంతో బాటు, తిరుపతి అగ్రహార నిర్మాణ కార్యక్రమాన్ని కూడా రామానుజులు ఆరంభించారు.

తిరుపతి పేరు క్రీ.శ.1234 నాటికి ఒక శాసనంలో తొలిసారిగా కనిపిస్తుంది. గోవిందరాజ ప్రతిమ ప్రతిష్ఠాపన జరిపి, ఆ తరువాత అగ్రహార నిర్మాణ ఆరంభ కార్యక్రమాన్ని రామానుజులవారు జరిపినట్లు గోవిందరాజ నిత్యపూజా కార్యక్రమంలో ఉచ్చరించబడు మంత్ర పుష్పంలోని ఒక భాగం నందలి మాటలను బట్టి తెలుస్తోంది. తిరుపతి గోవిందరాజ ప్రతిమా ప్రతిష్ఠాపన ఫల్గుణ పౌర్ణమి, ఉత్తరానక్షత్రం, సోమవారం నాడు జరిగిందని మంత్ర పుష్పం తెలుపుతోంది. రామానుజులు జీవిత కాలంలో ఫల్గుణ నెల, పౌర్ణమి తిథి, ఉత్తరా నక్షత్రం, సోమవారం రోజు ... ఆంగ్ల కాలమానంలో 1130 ఫిబ్రవరి 24తో మాత్రమే సరిపోలుతోంది. అంటే తిరుపతి నిర్మాణం తోపాటూ గోవిందరాజ ఆలయ నిర్మాణం ఈ తేదీనే ప్రారంభమయ్యిందని స్పష్టమవుతోంది. రామానుజుల వారిని స్మరించుకొనే రీతిలో 2022 ఫిబ్రవరి 24న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తిరుపతిలో ఒక పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయం.

వ్యాసకర్త ప్రొఫెసర్, ఎస్వీ యూనివర్సిటీ । 98495 84324

(తిరుపతి పట్టణానికి, గోవిందరాజ ఆలయానికీ శంకుస్థాపనలు జరిగి రేపటికి 893 ఏళ్లు)

సుస్థిర వ్యవసాయంతోనే రాబడి

విశ్లేషణ



డా॥ పి. పృథ్వీకర్ రెడ్డి

రసాయనాలు వాడకం వలన ఇండియాలో వ్యవసాయం, ఒక జీవనోపాధి దశనుండి మిగులు ఉత్పత్తి దిశగా పయనించిన మాట వాస్తవం. అయితే రైతులు మోతాదు మించి రసాయనాలు వాడటం వల్ల భూమి నిస్సారమై, పర్యావరణం కలుషితమయ్యింది. కనుక పర్యావరణ అనుకూలమైన, రైతుకు మెరుగైన ఆదాయ అవకాశాలను అందించే ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతి తక్షణావసరం. ప్రకృతి వ్యవసాయ పద్ధతి చాలా ఉత్తమమైన ప్రత్యామ్నాయంగా రుజువవుతున్నది. ఈ పద్ధతిలో రసాయనాలు వాడకం పూర్తిగా నిషిద్ధం. పశువుల మీద, స్థానికంగా లభించే వనరుల మీద ఈ పద్ధతి ఆధారపడి ఉన్నది. దీని విస్తరణకు భారత ప్రభుత్వం కూడా ప్రోత్సాహాన్ని ఇస్తుందనడానికి 2023–24 సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలే నిదర్శనం.

ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందంజలో ఉంది. రైతు సాధికారక సంస్థ ద్వారా ఏపీలో సహజ వ్యవసాయాన్ని అన్ని జిల్లాలలోనూ ప్రోత్సహిస్తున్నది. పంట పండించడానికి అయ్యే ఖర్చులు తగ్గించడం, పంట దిగుబడి పెంచడం; వ్యవసాయ శాస్త్ర సూత్రాలూ, పద్ధతులనూ ప్రోత్సహించడం ద్వారా వాతావరణ మార్పుల అనిశ్చితి నుండి రైతులను రక్షించడం ఏపీలో ప్రకృతి వ్యవసాయం ముఖ్య ఉద్దేశ్యాలుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతి ప్రభావాన్ని అంచనా వేయడానికి... రైతు సాధికారక సంస్థ... విశాఖలో ఉన్న ఐడీఎస్ ఏపీకి అప్పగించారు. 2018–19 నుండి ఈ అంచనా ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో నేను కూడా పాల్గొంటున్నాను. ప్రతి సంవత్సరం రాష్ట్రం నుండి 2,000కు పైచిలుకు రైతుల నుండి సమాచారం సేకరించి అంచనా వేస్తున్నాం. ఈ అంచనాయే ఈ వ్యాసానికి ఆధారం.

ప్రకృతి వ్యవసాయ ఫలితాలు అన్ని పంటలలోనూ చాలా ఆశాజనకంగా ఉన్నాయి. ఉదాహరణ కు, ప్రధాన పంటలయిన వరి, వేరుశెనగ, పత్తి, మొక్కజొన్నల దిగుబడి బాగుంటోంది. 2018–19 నుండి నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వచ్చే దిగుబడి, రసాయనాలు వాడిన పద్ధతి వల్ల వచ్చిన దిగుబడితో పోలిస్తే ఎక్కువగా ఉంది. అంతే కాక ఒక క్వింటాల్ (100 కిలోలు) దిగుబడి కొరకు అయ్యే ఖర్చు... రసాయనాలు వాడిన పద్ధతితో పోలిస్తే, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చాలా తక్కువ అని రుజువయింది.

2018–19లో ఒక క్వింటాల్ వరి పండించడానికి రసాయన పద్ధతితో పోలిస్తే సహజ వ్యవసాయం ద్వారా పండించిన పంటకు రూ.79 తక్కువ ఖర్చు అయ్యింది. అది 2021–22 నాటికి రూ. 498కు తగ్గింది. ఈ తగ్గుదల పత్తి పంటలో చాలా ఎక్కువగా ఉంది. దీనికి ప్రధాన కారణం... దిగుబడి స్థాయి తగ్గకుండా ఉండడం, రసాయనాలకు



వెచ్చించే ఖర్చులతో పోలిస్తే, ప్రకృతి వ్యవసాయ (సహజ) పద్ధతిలో పంట ఎదుగుదలకూ, సస్యరక్షణకూ ఖర్చులు చాలా తక్కువగా ఉండడం.

గత నాలుగేళ్ల డాటాను పరిశీలించినట్లయితే... ప్రకృతి వ్యవసాయ (సహజ) పద్ధతిలో వాడే వనరులు అనగా జీవామృతం, కషాయాలు, అస్త్రాలు వంటివాటి ఖర్చు వాటా... వరి, పత్తి పంటలకయ్యే ఖర్చులో 11 నుండి 15 శాతం ఉండగా; రసాయనాల ఖర్చు వాటా 21 నుండి 35 శాతం ఉన్నది.

సహజ పద్ధతిలో పండించిన ఈ రెండు పంటల నికర ఆదాయం రసాయన పద్ధతిలో పండించిన పంట కంటే చాలా ఎక్కువగా ఉంది. వరి పంట నికర ఆదాయం, రసాయన పద్ధతిలో పండించిన పంట కంటే, సహజ పద్ధతిలో హెక్టారుకు 2018–19 లో రూ. 3460 అధికంగా ఉండగా, 2019–20 లో రూ. 20,395, 2020–21 లో రూ. 19,288, 2021–22 లో రూ. 22,607 అధికంగా ఉంది. పత్తి పంట సహజ పద్ధతిలో పండించిన ఆదాయం, రసాయన పద్ధతిలో పండించిన దానికంటే హెక్టారుకు 2018–19లో రూ. 8,683, 2019–20లో రూ. 23,396, 2020–21లో రూ. 21,314, 2021–22లో రూ. 23,036 అధికంగా ఉంది.

గడచిన నాలుగేళ్ల సగటును చూసినట్లయితే, సహజ పద్ధతిలో వాడిన ఇన్‌పుట్స్ ఖర్చు, ప్రతి రూపాయి ఖర్చుకీ వరిలో రూ. 9.20 రాబడి (దిగుబడి రూపంలో), పత్తిలో రూ. 6.65 రూపాయలు వచ్చింది. అదే విధంగా, రసాయన పద్ధతిలో రసాయనాల కొరకు వెచ్చించిన ప్రతి రూపాయి ఖర్చుకీ వరిలో రూ. 2.36 రాబడి, పత్తిలో రూ. 0.86 మాత్రమే వచ్చింది. ఇది ఈ రెండు పంటలకే పరిమితం కాలేదు. అన్ని పంటలలోనూ ఇదే విధంగా ఉంది. రైతులు సహజ వ్యవసాయ శాస్త్ర సూత్రాలు, పద్ధతులు పూర్తిగా వారికున్న మొత్తం భూమిలో పాటించినట్లయితే వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయం రెట్టింపు చేసుకోవడం సులభతరం అవుతుంది.

సహజ వ్యవసాయ పద్ధతిలో పంట పండించడానికి అయ్యే ఖర్చు తగ్గడం మూలాన, రైతు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా రక్షించబడుతున్నాడు. అలాగే తనకున్న భూమిలో బహుళ పంటలు అన్ని సీజన్లలో వేయడం మూలాన, భూమి ఉత్పత్తి సామర్థ్యం పెరిగి, తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకొనుటలో మెరుగుపడి, పర్యావరణ సమతుల్యానికి దోహద పడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న సహజ వ్యవసాయ పద్ధతి, దేశమంతటా పాటించినట్లయితే, స్థిరమైన సమతుల్య వ్యవసాయ అభివృద్ధికి ఎంతోకాలం పట్టదు.

వ్యాసకర్త ఆర్థికవేత్త
ఈ–మెయిల్: prudhvikar@cess.ac.in

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణమాసం, తిథి: శు.తదియ ఉ.7.42 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.9.04 వరకు, తదుపరి రేవతి, వర్జ్యం: రా.8.44 నుండి 10.17 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.17 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 6.27, సూర్యాస్తమయం: 6.00.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 425 9899

వెల్‌డన్ పీటీఓ

పాత వస్తువులతో కొత్త ఫర్నిచర్

- పోలీసు ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో ప్రయోగాలు
- ఆకట్టుకుంటున్న డీజిల్ ట్యాంక్‌తో సోఫా, కారు సీట్లతో రివాల్వింగ్ చైర్
- సిబ్బందిలోని ప్రతిభకు అధికారుల ప్రోత్సాహం
- ఆకస్మిక పర్యటనలో ప్రశంసించిన డీజీపీ అంజనీకుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీసు విభాగాన్ని 'నడిపించే' పోలీసు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ (పీటీఓ) గురించి చాలా మందికి తెలియదు. డిపార్ట్‌మెంట్‌లో వినియోగించే వాహనాల నిర్వహణ, మరమ్మతులు దీని ప్రధాన బాధ్యత. హైదరాబాద్‌లోని పేట్లబుర్జు కేంద్రంగా పని చేసే ఈ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది తమ సృజనాత్మకత చూపిస్తున్నారు. స్క్రాప్‌గా మారే వాహనాలు, వస్తువులకు కొత్త రూపు ఇస్తున్నారు. మంగళవారం ఈ విభాగాన్ని ఆకస్మికంగా పర్యటించిన రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ వీటిని చూసి మంత్రముగ్ధులయ్యారు. అక్కడి అధికారులు, సిబ్బందికి కితాబిచ్చారు.

పువ్వుతో మొదలైన ప్రయోగం...

తెలంగాణ పీటీఓ ప్రధాన కార్యాలయం సైతం చాన్నాళ్ల పాటు ఓ మెకానిక్ షెడ్ మాదిరిగానే ఉండేది. ఇక్కడ పని చేస్తున్న మెకానిక్స్, డ్రైవర్స్‌లోని సృజనాత్మకత బయటకు తీసుకురావాలని ఏ అధికారీ భావించలేదు. ఎ.రాజేష్ ఈ విభాగానికి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాతే ఈ ప్రయోగాలు మొదలయ్యాయి. ఇక్కడ పని చేసే సిబ్బంది తొలుత నట్లు, స్క్రూలు, బోల్టులను వినియోగించి ఓ పువ్వు తయారు చేశారు. దీనికి ఆకర్షణీయమైన రంగులు వేశారు. ఎస్పీ కార్యాలయంలోని టీపాయ్ పైకి చేరిన ఈ పుష్పం అందరి దృష్టినీ ఆకర్షించింది. పీటీఓ సిబ్బంది ప్రయత్నం, ప్రయోగం అనేక మందికి ఆకట్టుకోవడంతో అధికారుల ఆలోచనలు ఆ కోణంలో సాగాయి. ఫలితంగానే జీపు ముందు భాగంతో సోఫా, డీసీఎం డీజిల్ ట్యాంక్‌తో సోఫా, కారు సీట్లతో రివాల్వింగ్ చైర్.. ఇలా అనేకం రూపొందాయి.

పొదుపు మార్గంలోనూ ముందుకు...

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సంచరించే పోలీసు వాహనాలకు కొన్నిసార్లు భారీ మరమ్మతులు అవసరమవుతుంది. వీటిలో కొన్నింటి స్పేర్ పార్ట్స్ కోసం ఎక్కువ మొత్తం వెచ్చించాల్సి ఉంటుంది. ఫలితంగా బడ్జెట్ నానాటికీ పెరిగిపోవడంతో పాటు ఇతర సమస్యలు తలెత్తేవి. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న పీటీఓ అధికారులు కొత్త ప్రయోగాలకు నాంది పలికారు. ప్లాస్టిక్ వెల్డింగ్ విధానంతో విరిగిన బంపర్లను కొత్తవాటిగా మారుస్తున్నారు. దీని కారణంగా భారీ మొత్తం ఆదా అవుతోంది. సాధారణంగా ఇన్నోవా వాహనం బంపర్ విరిగిపోతే కొత్తది వేయడానికి రూ.22 వేల వరకు ఖర్చవుతుంది. అయితే ప్లాస్టిక్ వెల్డింగ్ విధానంలో మరమ్మతు చేయడానికి కేవలం రూ.640 ఖర్చవుతోంది. ఇలానే మూలపడిన లేథ్ మిషన్‌ను వినియోగంలోకి తీసుకురావడం ద్వారా పీటీఓ ఒక్కో రిమ్‌పై రూ.6 వేల వరకు పొదుపు చేస్తోంది. ఈ విషయాలు, సంస్థ నిర్వహణ విషయం తెలుసుకున్న డీజీపీ అంజనీకుమార్ అధికారులు, సిబ్బందిని అభినందించారు.


ఎస్పీ టేబుల్‌గా మారిన జీపు ముందు భాగం


స్కూటర్ టేబుల్


కారు సీట్లతో రివాల్వింగ్ సోఫా..
కారు రిమ్, డీసీఎం స్ప్రింగ్‌తో టీపాయ్

అంతర్గత ప్రతిభను గుర్తిస్తూ ముందుకు..

పీటీఓలో పని చేస్తున్న అధికారులు తమ వద్ద ఉన్న సిబ్బందిలో అంతర్గతంగా ఉన్న ప్రతిభను గుర్తించి ఆ కోణంలో ప్రోత్సహిస్తున్నారు. కేవలం సృజనాత్మక వస్తువుల తయారీలో మాత్రమే కాదు.. వారికి జీవనోపాధి కల్పించడంలోనూ ఇది దోహదపడుతోంది. పీటీఓలో డ్రైవర్‌గా పని చేసే ఓ ఉద్యోగి అనారోగ్యానికి గురై వైద్యుల సలహాతో డ్రైవింగ్‌కు దూరమవ్వాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు ఆయనకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కుట్టు పని వచ్చిన ఆయనకు డీసీఎం టార్పాలిన్స్ కుట్టే బాధ్యతలు అప్పగించారు. దీన్ని సమర్థంగా చేసిన ఆయన ప్రస్తుతం ప్లాస్టిక్ వెల్డింగ్ విభాగాన్నీ నిర్వహిస్తున్నారు. రికార్డుల నిర్వహణ, మరమ్మతులు, పరిసరాలను ఆకర్షణీయంగా తయారు చేయడం తదితర అంశాల్లోనూ పీటీఓ తన మార్కు చూపిస్తూ అందరి మన్ననలు పొందుతోంది.

యాదాద్రిలో వైభవంగా ధ్వజారోహణం


ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో శ్రీస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజైన బుధవారం ఉదయం శ్రీస్వామి వారి ప్రథమ ప్రాకార ఉత్తర మండపంలో అగ్ని ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలోని ధ్వజ స్తంభం వద్ద ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద మంత్రాలు, బాజాభజంత్రీలతో గరుత్మంతుడిని చిత్రీకరించిన పటాన్ని ధ్వజస్తంభానికి కట్టి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ప్రత్యేకంగా తయారు చేసిన గరుడ ముద్దలను ధ్వజ స్తంభం పైకి ఎగురవేసే పూజలు నిర్వహించారు. ఇక రాత్రికి ఆలయంలో భేరీ పూజ చేశారు. అనంతరం ఉత్సవాలకు ముప్పైమూడు కోట్ల దేవతలను మంత్రపూర్వకంగా ఆహ్వానించే పూజ చేసి ఆహ్వానించారు. ఈ వేడుకల్లో యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో గీతారెడ్డి, డీఈవో దోర్బాల భాస్కర్‌శర్మ, అధికారులు, ఆచార్యులు, రుత్వికులు పాల్గొన్నారు.

నేటి నుంచి అలంకార సేవలు..

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి విశేష పర్వాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టనున్నారు. అలంకార ప్రియుడైన యాదాద్రీశుడికి అలంకార, వాహన సేవలు జరిపించేందుకు ఆచార్యులు సర్వం సిద్ధం చేశారు. ఉత్తర రాజగోపురం నుంచి బయల్దేరే అలంకార, వాహన సేవలను తూర్పు రాజగోపురం ముందు ఏర్పాటు చేసే వేదికపై వేంచేపు చేస్తారు. అక్కడే పారాయణికులు, ఆచార్యులు, రుత్వికులు అలంకార సేవకు పారాయణాలు పఠిస్తారు.

క్లుప్తంగా...

వీధి కుక్కదాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు


సిద్ధార్థ రావణ్

కొణిజర్ల: హైదరాబాద్‌లోని బాగ్ అంబర్‌పేటలో వీధికుక్కల దాడిలో చిన్నారి మృతి చెందిన ఘటన మరువకముందే ఖమ్మం జిల్లాలో ఇలాంటి ఘటనే బుధవారం చోటుచేసుకుంది. అయితే చిన్నారి తల్లి వెంటనే కుక్కను వెళ్లగొట్టడంతో ప్రాణాపాయం తప్పింది. ఆ చిన్నారికి మాత్రం తీవ్ర గాయాలయ్యాయి. కొణిజర్ల మండలం పెద్దగోపతికి చెందిన ఊటుకూరి గణేశ్– రమాదేవి దంపతుల ఏడాదిన్నర కుమారుడు సిద్ధార్థ రావణ్‌కు బుధవారం మధ్యాహ్నం తల్లి ఇంటి బయట భోజనం తినిపిస్తూ మధ్యలో తాగు నీటి కోసం లోపలకు వెళ్లింది. ఆ సమయాన అక్కడకు వచ్చిన వీధికుక్క భోజనం గిన్నెను నోట కరుచుకునే యత్నం చేస్తుండగా బాలుడు కుక్కను పట్టుకోవడంతో ముఖంపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రమాదేవి అదిలిస్తూ కుక్కను వెళ్లగొట్టింది. సిద్ధార్థకు ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోక్సో కేసులో నిందితుడికి 25 ఏళ్ల జైలు శిక్ష

కొత్తగూడెం టౌన్: చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగార జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ కొత్తగూడెం అదనపు జిల్లా సెషన్స్ జడ్జి, పోక్సో స్పెషల్ జడ్జి శ్యాంశ్రీ బుధవారం తీర్పునిచ్చారు. 2018 జూన్ 24న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం తూరుబాకకు చెందిన వివాహిత తన 16 నెలల కుమార్తెతో ఓ వేడుకకు వెళ్లింది. అదే ఫంక్షన్‌కు వెళ్లిన తూరుబాకకే చెందిన అజ్మీరా సాయికిరణ్ చిన్నారిని తీసుకెళ్లి కాసేపటికి తిరిగి తీసుకొచ్చాడు. అయితే, చిన్నారి ఏడుస్తుండటంతో తల్లి బంధువులకు చెప్పగా సాయికిరణ్ అత్యాచారానికి పాల్పడినట్లు గుర్తించి దుమ్ముగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఏఎస్పీ సంగ్రాంసింగ్ పాటిల్ నేతృత్వంలో సీఐ బి.బాలకృష్ణ పోక్సో కేసు నమోదు చేసి సాయికిరణ్‌పై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన తర్వాత సాయికిరణ్‌పై నేరం రుజువైందని కోర్టు నిర్ధారించింది. వాదనల అనంతరం సాయికిరణ్‌కు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీడీలక్ష్మి వాదించారు.

వీధికుక్కల బెడద నివారణకు తక్షణ చర్యలు

- కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్లపై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్‌లో స్టెరిలైజేషన్ వల్ల తగ్గిన వీధికుక్కల సంఖ్య
- ప్రజలను, సంఘాలను భాగస్వాములను చేస్తూ ముందుకు..
- అధికారుల సమీక్ష సమావేశంలో స్పెషల్ సీఎస్ అర్వింద్ కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వీధికుక్కల వల్ల సామాన్య ప్రజానీకం సమస్యలు ఎదుర్కోకుండా అన్ని నగరాలు, మున్సిపాలిటీల్లో అధికార యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఆదేశించారు. జీహెచ్ఎంసీ, హైదరాబాద్ చుట్టుపక్కలున్న పురపాలికలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వీధికుక్కలు మనుషుల జోలికి రాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో ఓ నాలుగేళ్ల బాలుడిపై వీధికుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి ప్రాణాలు తీసిన సంఘటన సంచలనం సృష్టించిన నేపథ్యంలో బుధవారం ఆయన మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. మున్సిపల్ శాఖ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్, మున్సిపల్ పరిపాలన డైరెక్టర్ సత్యనారాయణ, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు, జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీధికుక్కల బెడదను నివారించడానికి వాటికి సంతానం కలగకుండా శస్త్రచికిత్సలు నిర్వహించాలని సూచించారు. అలాగే కుక్కలకు వీధుల్లో, రోడ్లపైన ఆహారం లభించకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎక్కువగా కుక్కకాటు కేసులు నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఆయా ప్రాంతాలకు వెటర్నరీ విభాగం బృందాలను తరలించి కుక్కలను కట్టడి చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని, మూసీ పరీవాహక ప్రాంతంలో కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో గతంలో 8.5 లక్షల వీధికుక్కలు ఉంటే.. స్టెరిలైజేషన్ ఆపరేషన్ల కారణంగా వాటి సంఖ్య ఐదున్నర లక్షలకు తగ్గిందని తెలిపారు. ఈ సంఖ్యను మరింత నియంత్రించడానికి అవసరమైన చోట్లలో వాటికి యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కింద స్టెరిలైజేషన్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న హోటల్స్, రెస్టారెంట్స్, ఫంక్షన్ హాల్స్, చికెన్, మటన్ సెంటర్లు వ్యర్థపదార్థాలను వీధుల్లో వేయకుండా కట్టడి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థులకు పెంపుడు జంతువులు, వీధికుక్కలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అర్వింద్ కుమార్ సూచించారు. దీనికి సంబంధించిన కరపత్రాలు, హోర్డింగ్స్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలను భాగస్వాములను చేయండి

జీహెచ్ఎంసీతో పాటు రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధుల్లో వీధికుక్కల సమస్యను అధిగమించడానికి స్థానిక ప్రజలను, అసోసియేషన్లను భాగస్వాములను చేయాలని అర్వింద్ కుమార్ అధికారులకు సూచించారు. మురికివాడల అభివృద్ధి సమాఖ్య, పట్టణాభివృద్ధి సమాఖ్యలు, కాలనీల సంక్షేమ సంఘాల సహకారంతో వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే మెప్మా స్వయం సహాయక బృందాల సేవలను కూడా వినియోగించుకోవాలని ఆదేశించారు.


సమీక్ష సమావేశంలో అర్వింద్ కుమార్

పెంపుడు జంతువుల నమోదు కోసం యాప్

పెంపుడు జంతువుల నమోదు గురించి ప్రత్యేకంగా ఓ మొబైల్ యాప్‌ను సిద్ధం చేయాలని అర్వింద్ కుమార్ అధికారులకు సూచించారు. వీటికి సంబంధించిన ఫిర్యాదులను జీహెచ్ఎంసీ పరిధిలో 'మై జీహెచ్ఎంసీ' యాప్ ద్వారా 040- 21111111 ఫోన్ నంబర్ ద్వారా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అలాగే ఇతర కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో పెంపుడు కుక్కల సంఖ్యను గుర్తించడానికి త్వరలో మొబైల్ యాప్‌ను రూపొందించి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఆ యాప్‌లో సంబంధిత యజమానులు వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, వారికి గుర్తింపు కార్డును కూడా మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

'కుక్కల దాడిలో బాలుడి మృతి'పై హైకోర్టు విచారణ

- సుమోటో పిల్‌గా స్వీకరించిన ఉన్నత న్యాయస్థానం
- నేడు విచారణ జరపనున్న సీజే ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: కుక్కల దాడిలో బాలుడి మృతి ఘటనపై హైకోర్టు నేడు విచారణ చేపట్టనుంది. ఓ పత్రికలో ప్రచురితమైన వార్తను సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీనిపై గురువారం ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారణ జరపనుంది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, అంబర్‌పేట్(జీహెచ్ఎంసీ) డిప్యూటీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చింది. నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలానికి చెందిన గంగాధర్.. నాలుగేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి అంబర్‌పేటలో నివాసముంటున్నారు. అంబర్‌పేటలోని ఓ కారు సర్వీసింగ్ సెంటర్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. గత ఆదివారం గంగాధర్ తన ఆరేళ్ల కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు ప్రదీప్‌తో కలసి తాను పని చేస్తున్న సర్వీస్ సెంటర్‌కు వెళ్లారు. కుమారుడిని సర్వీస్ సెంటర్ లోపల ఉంచి తాను పనిచేసుకుంటున్నారు. ప్రదీప్ ఆడుకుంటూ అక్క కోసం కేబిన్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో చిన్నారి తల, కడుపు భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన బాలుడి తండ్రి అక్కడికి వచ్చే లోపే చిన్నారి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన హైకోర్టు పిల్‌గా విచారణకు స్వీకరించింది.

పీఆర్‌టీయూ అభ్యర్థిగా జనార్దన్ రెడ్డి నామినేషన్


నామినేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న జనార్దన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి పీఆర్‌టీయూ మద్దతునిస్తున్న అభ్యర్థి కాటేపల్లి జనార్దన్ రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన మద్దతుదారులతో కలిసి ఆయన రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లారు. అంతకుముందు జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసిన తను టీచర్ల అభ్యున్నతికి కృషి చేశానన్నారు. మరోసారి అవకాశం ఇస్తే సమస్యల పరిష్కారం కోసం పోరాడతానని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి సహా సంఘం నేతలు అబ్దుల్లా, మణిపాల్‌రెడ్డి, వివి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఐకమత్యంతోనే ఆరె కుల హక్కుల్ని సాధించుకుంటాం'

అంబర్‌పేట (హైదరాబాద్): ఆరె కుల హక్కులు, అభివృద్ధిని ఐకమత్యంతో సాధించుకుంటామని ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టిపల్లి శివాజీ తెలిపారు. ఆరె కుల ఐక్యతతోనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆత్మగౌరవ భవనాన్ని సాధించుకున్నామని ఇదే ఐక్యతతో ఓబీసీ సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆరె సంఘం ఐక్యతను దెబ్బతీసేందుకు సంఘం స్టీరింగ్ కమిటీ మాజీ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు కుట్రపన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నామని, దీనిపై తప్పుదారిపట్టించేలా కిషన్‌రావ్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 24న కిషన్‌రావు చేపట్టే సమావేశానికి తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

సీఎంఆర్ రికవరీ గడువు మరోసారి పొడిగింపు

- మొండికేస్తున్న 118 డిఫాల్టర్ మిల్లులు

సాక్షి, హైదరాబాద్: ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఎఫ్‌సీఐకి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వకుండా ఎగ్గొట్టిన 118 మిల్లుల నుంచి బియ్యం రికవరీ చేసే గడువును పౌరసరఫరాల శాఖ మరోసారి పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019–20 యాసంగి సీజన్‌లో ధాన్యం తీసుకున్న మిల్లర్లలో 118 మంది మిల్లర్లు 1,00,427 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు అప్పగించకుండా మాయం చేశారు. సుమారు రూ. 230 కోట్ల విలువైన ఈ బియ్యాన్ని అప్పగించాలని సదరు మిల్లర్లకు పలుమార్లు ఆదేశించినా ప్రయోజనం లేకుండా పోయింది. బియ్యం రికవరీకి రెండేళ్లుగా ఎప్పటికప్పుడు గడువు ఇస్తూ వచ్చిన పౌరసరఫరాల శాఖ 2022 నవంబర్ 30వ తేదీ వరకు తుది గడువుగా పేర్కొంటూ స్వాహా చేసిన బియ్యానికి 25 శాతం అదనంగా ఇవ్వాలని, బియ్యం విలువపై 12 శాతం వడ్డీని చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చింది. అయినా 118 మంది మిల్లర్లు పౌరసరఫరాల శాఖ ఆదేశాలను పాటించలేదు. ఈ నేపథ్యంలో డిసెంబర్ నెలాఖరు వరకు తొలుత గడువు ఇచ్చిన అధికారులు తరువాత గుట్టు చప్పుడు కాకుండా ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకు గడువు పెంచారు. అయినప్పటికీ మిల్లర్ల నుంచి స్పందన రాకపోవడంతో ఈసారి ఏకంగా మార్చి 31వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ బుధవారం ప్రభుత్వ ఎక్స్ అఫీషియో కార్యదర్శి హోదాలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ వి.అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

మున్సిపల్ కౌన్సిల్ అమీన్‌పూర్, సంగారెడ్డి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
No. Engg-MCA/E1/NIT/38/2022-2023, తేది : 23.02.2023
పనుల సంఖ్య : 02. అంచనా కాంట్రాక్ట్ విలువ : రూ.1.44 కోట్లు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది : 23.02.2023 ఉ.10.30 గం. బిడ్ల స్వీకరణకు చివరి తేది : 03.03.2023 ఉ.10.30 గం. ధర బిడ్ తెరుచు తేది: 03.03.2023 ఉ.11.00 గం. సంబంధిత అధికారి చిరునామా: కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ. తదుపరి వివరాలను www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- కమిషనర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీ
DIPR RO No. 12726PP/CL/Advt/1/2022-23, Dt: 22.02.2023

తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
3వ అంతస్తు, DM & HS క్యాంపస్, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్-95,
ఫోన్ నం.040-40032888, ఇ-మెయిల్: tsmsidc.ce@gmail.com.
టెండరు నోటీస్ నం.32/TSMSIDC/Tech/2022-23 తేది: 22-02-2023
దిగువ తెలిపిన పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుతున్నవి: (1) నిజామాబాద్ జిల్లాలో వర్ని వద్ద 30 పడకల హాస్పిటల్ నిర్మాణం (4వ పిలుపు), (2) వరంగల్ జిల్లాలో DH నర్సంపేట్‌లో అదనపు సదుపాయాల ఏర్పాటు, (3) NIMS, హైదరాబాద్‌లో స్పెషాలిటీ బ్లాక్ నుండి కోర్ బ్లాక్ వరకు కనెక్టింగ్ కారిడార్ నిర్మాణం. ఇతర వివరాలను మా వెబ్‌సైట్ http://www.tsmsidc.telangana.gov.in మరియు https://tender.telangana.gov.in లో చూడవచ్చును.
DIPR RO No.12737-PP/CL/Advt/1/2022-23, Dt. 22.02.2023 సం/- మేనేజింగ్ డైరెక్టర్

hmda — హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్
HMDA చట్టం 2008లోని సెక్షన్ 15(3) క్రింద బహిరంగ ప్రకటన
(Lr. No. SML0240039116323/CLU/Plg/TS-iPASS/HMDA/2023, తేది: 10.02.2023)
HMDA చట్టం 2008లోని సెక్షన్ 15 యొక్క ఉపసెక్షన్ (3) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, G.O.Ms.No.33, MA&UD, తేది: 24.01.2013 ప్రకారం ప్రకటిత మాస్టర్ ప్లాన్ MDP-2031లో భూ ఉపయోగానికి దిగువ తెలిపిన మార్పులు చేయుటకు ప్రతిపాదించడమైనది. G.O.Ms.No.33, MA&UD తేది: 24.01.2013 ప్రకారం ప్రకటిత MDP-2031లో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం [illegible] గ్రామం పరిధిలో సర్వే నం.274/Bలో 21319.19 చ.మీటర్ల విస్తీర్ణం గల సైట్, ప్రస్తుతం [illegible] ఉపయోగ జోన్ కోసం కేటాయించబడినది. అది ఇప్పుడు 'అదనపు' కేటగిరి క్రింద అల్యూమినియం బిల్లెట్ మరియు అల్యూమినియం ప్రొఫైల్స్ తయారీ కోసం యూనిట్ నెలకొల్పుటకు మాన్యుఫ్యాక్చరింగ్ ఉపయోగ జోన్‌గా నిర్దేశించుటకు ప్రతిపాదించడమైనది. పైన తెలిపిన వివరాలు http://gazette.telangana.gov.in/ మరియు http://hmda.gov.in/ వెబ్‌సైట్లలో లభిస్తాయి. సదరు ప్రతిపాదనలకు ఎవరేని వ్యక్తి లేదా సంస్థ నుండి అభ్యంతరాలు/ సూచనలు పరిశీలించబడతాయి. వారు లిఖితపూర్వక అభ్యంతరాలను/ సూచనలను M.C. HMDA వారికి లేదా Spl. Chief Secretary to Government, MA & UD Dept., Telangana Secretariat, Hyderabad వారికి ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏడు (7) రోజులలోగా దాఖలు చేయగలరు.
సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, ప్లానింగ్, HMDA
DIPR RO No.12734-PP/CL/Advt/1/2022-23, Dt. 22.02.2023

airtel


మా వినియోగదారుల నుండి మా సర్వీస్ గురించి ఏవైనా సందేహాలు మరియు ఫిర్యాదులు ఉన్నట్లయితే వాటి గురించి మేము తెలుసుకోవాలనుకుంటున్నాము. సాధారణ సందేహాలు, [illegible] 121కి మరియు ఏవైనా సర్వీస్ విఘ్నాలు లేదా ఫిర్యాదులు ఉంటే వాటి కొరకు మా వినియోగదారులు 198కి కాల్ చేయాల్సిందిగా కోరుతున్నాము.

[illegible]

		మొబైల్ వినియోగదార్ల కోసం	ఫిక్స్‌డ్ లైన్ మరియు బ్రాడ్‌బ్యాండ్ వినియోగదార్ల కోసం
కస్టమర్ కేర్ (24X7)	సాధారణ సమాచారం సంఖ్య	121 లేదా 9849012345 (పోస్ట్‌పెయిడ్) 121 లేదా 9849098490 (ప్రీపెయిడ్)	121 లేదా 040-44444121
	కస్టమర్ కేర్ సంఖ్య	198 లేదా 9849012345 (పోస్ట్‌పెయిడ్) 198 లేదా 9849098490 (ప్రీపెయిడ్)	198 లేదా 040-44444198
	ఇ-మెయిల్	121@in.airtel.com	
	వెబ్‌సైట్	www.airtel.in	
అప్పిలేట్ అథారిటీ [illegible]	పేరు	సుందర్ పాండియన్	
	కాంటాక్ట్ నంబర్	9959444865	040-40000222
	ఇ-మెయిల్	appellate.andhra@in.airtel.com	appellate.southbbts@in.airtel.com
	చిరునామా	భారతి ఎయిర్‌టెల్ లి., [illegible] బేగంపేట్, హైదరాబాద్-500016.	

ఫిర్యాదు నమోదు చేయడానికి, సందర్శించండి https://www.airtel.in/contact-us
మీ ఫిర్యాదు ఏ స్థితిలో ఉందో చెక్ చేసుకోవడానికి, సందర్శించండి https://www.airtel.in/s/selfcare/track-request

[illegible]



క్లుప్తంగా...

ఒకటో తరగతికి ఆరేళ్లు
కనీస వయసుపై కేంద్రం సూచన

న్యూఢిల్లీ: ఒకటో తరగతిలో ప్రవేశాలకు కనీస వయసును ఆరేళ్లుగా నిర్ధారించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) ప్రకారం బాలలందరికీ 3 నుంచి ఎనిమిదేళ్ల వయసు దాకా ఐదేళ్ల మౌలిక విద్యాభ్యాస సమయం. ఇందులో తొలి మూడేళ్లు ప్రీ స్కూల్ స్థాయి బోధన, అనంతరం ఒకటి, రెండో తరగతి ఉండాలి. ఈ ఐదేళ్లూ వారికి అంగన్‌వాడీలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ ప్రీ స్కూళ్లలో నాణ్యతతో కూడిన బోధన అందాలన్నది లక్ష్యమని కేంద్ర విద్యా శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ మౌలిక స్థాయిలో అర్హులైన ఉపాధ్యాయుల లభ్యతే కీలకమని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం వారికి రెండేళ్ల డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సును రూపొందించి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర విద్యా శాఖ సలహా ఇచ్చింది.

హిజాబ్‌తో పరీక్షలు రాస్తాం
సుప్రీంను అభ్యర్థించిన కర్ణాటక విద్యార్థినులు

న్యూఢిల్లీ: వచ్చే నెలలో పరీక్షలకు హాజరయ్యేటపుడు హిజాబ్‌ను అనుమతించాలని కర్ణాటక ముస్లిం విద్యార్థినులు సుప్రీంకోర్టుకు విన్నవించుకున్నారు. 'విద్యాసంస్థల్లో హిజాబ్ ధారణపై సుప్రీంకోర్టులో జడ్జీలు భిన్న తీర్పులు వెలువర్చిన నేపథ్యంలో ఆ అంశం జోలికి వెళ్లకుండా కేవలం ఎగ్జామ్ హాల్‌లోకి హిజాబ్‌తో ప్రవేశానికి అనుమతి కోరుతూ కోర్టును ఆశ్రయించాం. సోమవారం లేదా శుక్రవారం ఈ అంశాన్ని కోర్టు విచారణకు చేపడుతుందని భావిస్తున్నాం' అని విద్యార్థినుల తరఫు లాయర్ షాదన్ ఫరాసత్ చెప్పారు. దీనిపై నిర్ణయం తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం పేర్కొంది.

మోర్బీ వంతెన మృతులకు... రూ. పది లక్షల పరిహారం

అహ్మదాబాద్: మోర్బీ వేలాడే వంతెనను నిర్వహించిన గడియారాల తయారీ సంస్థ ఓరెవా గ్రూపు (అజంతా గడియారాలు) బాధిత కుటుంబాలకు పరిహారమివ్వాలని గుజరాత్ హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. మృతుల కుటుంబాలకు రూ పది లక్షలు, క్షతగాత్రులు రూ. రెండు లక్షల చొప్పున నాలుగు వారాల్లోగా చెల్లించాలని ఆదేశించింది. గత ఏడాది అక్టోబరు 30న సామర్థ్యానికి మించి జనాలను అనుమతించడంతో ఈ పురాతన వంతెన కూలిపోయి.. మొత్తం 135 మంది మరణించిన విషయం తెలిసిందే. మృతులు కుటుంబాలను ఐదేసి లక్షలు, క్షతగాత్రులకు రూ. లక్ష చొప్పున చెల్లిస్తామని ఓరెవా గ్రూపు ముందుకు రాగా.. తోసిపుచ్చిన హైకోర్టు 10 లక్షలను పరహారంగా నిర్ణయించింది.

ఒక దురాక్రమణకు తలవంచని తెగువకు ఏడాది

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి దిగి రేపటికి ఏడాది ● మరుభూమిగా మారినా మడమ తిప్పని ఉక్రెయిన్

- ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన రష్యా
- అయినా యుద్ధాన్ని ముగించేందుకు ససేమిరా
- ఆర్థికంగా ప్రపంచ దేశాలు అతలలాకుతలం



ఏడాది క్రితం..

2022 ఫిబ్రవరి 24...

ప్రపంచం ఎన్నటికీ మర్చిపోలేని రోజు. పొరుగు దేశం ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగిన రోజు. రష్యా అపార సాయుధ సంపత్తి ముందు ఉక్రెయిన్ నిలవలేదని, దాని ఓటమితో రోజుల వ్యవధిలోనే యుద్ధం ముగుస్తుందని అంతా భావించారు.

దాదాపు ఏడాది గడిచాక...

పసికూనగా భావించిన ఉక్రెయిన్ పట్టువీడకుండా తెగించి పోరాడుతూనే ఉంది. పాశ్చాత్య దేశాల సాయుధ, ఆర్థిక సాయం దన్నుతో రష్యాను దీటుగా ఎదిరిస్తోంది. పలు ఆక్రమిత ప్రాంతాల నుంచి రష్యా సేనలను తరిమికొడుతూ మరిచిపోలేని పరాభవాలను పుతిన్‌కు రుచి చూపిస్తోంది. ఈ నేపథ్యంలో యుద్ధం ఇప్పుడప్పుడే ముగిసే సూచనలు ఏమాత్రం కన్పించడం లేదు. ఎంతకాలమైనా ఉక్రెయిన్‌కు మద్దతిస్తూనే ఉంటామని అమెరికా అధ్యక్షుడు బైడెన్, రష్యా ఉనికిని కాపాడుకోవడమే లక్ష్యంగా ఎంత దూరమైనా వెళ్తామంటూ పుతిన్ చేసుకున్న తాజా హెచ్చరికలు దీన్ని మరింత బలపరుస్తున్నాయి. ఉక్రెయిన్, రష్యాలనే గాక ప్రపంచ దేశాలన్నింటినీ యుద్ధం తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఐరోపా ఖండంలో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరుగుతున్న అతిపెద్ద ఘర్షణ కూడా ఇదే.

తొలిసారేమీ కాదు..

ఉక్రెయిన్, రష్యా మధ్య ఘర్షణలు ఇదే తొలిసారేమీ కాదు. వెయ్యేళ్ల చరిత్ర, 4.4 కోట్ల జనాభా ఉన్న ఉక్రెయిన్ ఒకప్పుడు సోవియట్ యూనియన్(యూఎస్ఎస్ఆర్)లో అంతర్భాగమే. సోవియట్ పతనానంతరం 1990ల్లో స్వతంత్ర దేశంగా అవతరించింది. పశ్చిమ దేశాల కుట్రల వల్లే ఉక్రెయిన్ తమకు దూరమైందని రష్యా ద్వేషం పెంచుకుంది. పాశ్చాత్య దేశాల చేతుల్లో ఉక్రెయిన్ కీలుబొమ్మ అని పుతిన్ తరచుగా విమర్శిస్తుంటారు. ఉక్రెయిన్ కృత్రిమంగా ఏర్పడ్డ దేశమని, నిజానికి అది, రష్యా ఒకే తల్లి బిడ్డలని ఆయన వాదిస్తుంటారు. రెండు దేశాలను ఎలాగైనా ఒక్కటి చేయాలన్నదే పుతిన్ ఆశయం. అందులో భాగంగానే 2014లో ఉక్రెయిన్‌కు చెందిన క్రిమియా ద్వీపకల్పాన్ని రష్యా ఆక్రమించింది. ఆ ఘర్షణలో ఇరువైపులా వేలాది మంది మరణించారు. మరోవైపు ఉక్రెయిన్‌లో గణనీయంగా ఉన్న రష్యన్ మాట్లాడే ప్రజలు రష్యాకు మద్దతుగా తిరుగుబాటుకు దిగారు. పరిస్థితి చెయ్యి దాటిపోతుండడం, రష్యా నుంచి ముప్పు పెరుగుతుండటంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పశ్చిమ దేశాల సాయం కోరారు. రష్యా బారినుంచి కాపాడేందుకు తమను తక్షణం నాటో కూటమిలో చేర్చుకోవాలన్న ఆయన విజ్ఞప్తికి సానుకూలత వ్యక్తమైంది. అదే జరిగితే నాటో సేనలు ఏకంగా రష్యా సరిహద్దుల్లో తిష్టవేసే ఆస్కారముండటం అధ్యక్షుడు పుతిన్‌కు ఆగ్రహం కలిగించింది. వెంటనే రంగంలోకి దిగి 2021 నవంబర్ నాటికే ఉక్రెయిన్ సరిహద్దులకు భారీగా సైన్యాన్ని తరలించారు. 2022 ఫిబ్రవరికల్లా దాన్ని లక్షకు పెంచి తీవ్ర ఉద్రిక్తతలకు తెర తీశారు. ఉక్రెయిన్‌పై దాడి తప్పదన్న వార్తల నడుమ, తీవ్ర పరిణామాలు, కఠిన ఆంక్షలు తప్పవని అమెరికా హెచ్చరించింది. తమకలాంటి ఉద్దేశం లేనే లేదంటూనే ఫిబ్రవరి 24న ఉక్రెయిన్‌పై పుతిన్ సైన్యం మూడువైపుల నుంచీ విరుచుకుపడింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

శిథిల చిత్రంగా ఉక్రెయిన్

రష్యా దాడుల ధాటికి ఉక్రెయిన్ సర్వం కోల్పోయి శిథిలచిత్రంగా మిగిలింది. ఎక్కడ చూసినా కూలిన భవనాలు, మృతదేహాలతో మరుభూమిని తలపించింది. ఐక్యరాజ్యసమితికి శరణార్థుల హై కమిషనర్ విడుదల చేసిన గణాంకాల ప్రకారమే 2023 జనవరి 15 నాటికి రష్యా దాడుల్లో 7,000కు పైగా ఉక్రెయిన్ పౌరులు మరణించారు. 11 వేలకు పైగా క్షతగాత్రులయ్యారు. వాస్తవానికి కనీసం 50 వేల మందికి పైగా అమాయక పౌరులు యుద్ధానికి బలయ్యారని, లక్షలాది మంది గాయపడ్డారని అంచనా. 80 లక్షల మందికిపైగా ఉక్రెయిన్ పౌరులు శరణార్థులుగా ఇతర దేశాలకు వలసవెళ్లారు. వారంతా కట్టుబట్టలతో ఇల్లూ వాకిలీ వదిలి తరలిపోతున్న దృశ్యాలు మానవతకే తీరని మచ్చగా మిగిలాయి. మరో 60 లక్షల మంది స్వదేశంలోనే నిరాశ్రయులయ్యారు.

రష్యా అతలాకుతలం

రష్యా కూడా ఉక్రెయిన్ చేతిలో అవమానకర ఎదురుదెబ్బలు మినహా ఇప్పటిదాకా ఇప్పటిదాకా బావుకున్నదేమీ లేదు. పైపెచ్చు యుద్ధం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థ ఎన్నడూ లేనంతగా దిగజారింది. అమెరికా, పాశ్చాత్య దేశాల తీవ్ర ఆర్థిక ఆంక్షలతో పూర్తిగా స్తంభించి కుదేలైంది. ఆర్థిక వృద్ధి నేలచూపులు చూస్తోంది. అంతర్జాతీయ సంస్థలన్నీ దేశం వీడాయి. చమురు మినహా ఎగుమతులు, దిగుమతులు పూర్తిగా పడకేశాయి. ద్రవ్యోల్బణం, నిత్యావసరాల ధరలు చుక్కలనంటి సామాన్యుల బతుకు దుర్భరంగా మారింది. దాంతో యుద్ధంపై రష్యాలోనే తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఎన్నడూ లేని రీతిలో పౌరులు బాహాటంగానే ప్రభుత్వంపై విమర్శలకు దిగారు. వేలాదిగా అరెస్టులు జరిగినా వెరవకుండా ఆందోళనలు చేశారు.

యుద్ధంతో వాటిల్లిన నష్టం

	రష్యా	ఉక్రెయిన్
సైనికులు	2 లక్షలకు పైగా	1 లక్షకు పైగా
ప్రధాన యుద్ధ ట్యాంక్‌లు	3,334	7,960
ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్స్	243	405
యుద్ధ విమానాలు	299	386
హెలికాప్టర్లు	287	210
వాహనాలు/ఇంధన ట్యాంకులు	5,212	8,472
యుద్ధ నౌకలు/పడవలు	18	..
డ్రోన్‌లు	2,026	3,203

దేశాల్లో ఆకలి కేకలు

గోధుమలు, మొక్కజొన్న ఎగుమతిలో అగ్రస్థానాన ఉన్న రష్యా, ఉక్రెయిన్ నుంచి యుద్ధం కారణంగా తిండి గింజల సరఫరా పూర్తిగా నిలిచిపోయి 50కి పై చిలుకు దేశాలు తీవ్ర ఆహార కొరత బారిన పడి అల్లాడుతున్నాయి. అంతేగాక అటు సంపన్న, ఇటు భారత్ వంటి వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలు యుద్ధం వల్ల ఎంతగానో దెబ్బ తిన్నాయి.

సాహసి... జెలెన్‌స్కీ

రష్యాకు ఎదురొడ్డి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మొక్కవోని ధైర్య సాహసాలు ప్రదర్శించారు. తనను హతమార్చేందుకు జరిగిన ప్రయత్నాలను కాచుకున్నారు. సురక్షితంగా తప్పిస్తామంటూ అమెరికా ముందుకొచ్చినా కాదన్నారు. సైన్యంతో కలివిడిగా తిరుగుతూ వారిలో స్థైర్యం నింపారు. ప్రపంచ దేశాలను సాయం కోరుతూ ప్రతి అంతర్జాతీయ వేదిక మీదా రష్యాను దునుమాడుతూ సాగారు. పూర్వాశ్రమంలో సినిమాల్లో కమేడియన్‌గా చేసినా నిజ జీవితంలో మాత్రం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో తిరుగులేని నాయకత్వ లక్షణాలు ప్రదర్శించి హీరో అనిపించుకున్నారు.

ఎవరికెంత నష్టం?

యుద్ధంలో విజేతలు ఎవరో ఇప్పటిదాకా తేలకపోయినా ఇరు దేశాలు మాత్రం కనీవినీ ఎరుగని స్థాయిలో నష్టాన్ని చవి చూశాయి. లక్షల సంఖ్యలో సైనికులను, వేల సంఖ్యలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, యుద్ధ ట్యాంకులు, నౌకలను కోల్పోయాయి.

ఏ దేశం ఎవరి వైపు...

అమెరికా బ్రిటన్ సహా 30 నాటో సభ్య దేశాలు యుద్ధంలో ఉక్రెయిన్‌కు పూర్తిగా వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. భారీగా ఆయుధ, ఆర్థిక సాయం చేస్తూ వస్తున్నాయి. వీటితో పాటు మరెన్నో దేశాలు రష్యా దాడిని ఖండించి ఉక్రెయిన్‌కు నైతిక మద్దతు ప్రకటించాయి. ఇక రష్యాకు ప్రధానంగా పొరుగు దేశమైన బెలారస్ తొలినుంచీ గట్టి మద్దతుదారుగా ఉంది. చైనాతో పాటు ఉత్తర కొరియా, క్యూబా, వెనెజువెలా, ఇరాన్, సిరియా, కిర్గిస్తాన్ కూడా రష్యాకు మద్దతు ప్రకటించాయి. యూఏఈ, సౌదీ అరేబియా తటస్థంగా నిలిచినా రష్యా దాడిని ఖండించేందుకు తిరస్కరించాయి. యుద్ధానికి తక్షణం ముగింపు పలికి చర్చలు, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలన్నది తొలినుంచీ భారత్ వైఖరిగా ఉంది.

యుద్ధంలో కీలక మలుపులు

ఫిబ్రవరి: 24న యుద్ధం ప్రారంభం. ఉక్రెయిన్ నిస్సైనికీకరణకు సైనిక చర్య ముసుగులో తూర్పు, ఉత్తర, దక్షిణాల నుంచి రష్యా ముప్పేట దాడి.
మార్చి: ఖెర్సన్ నగరం స్వాధీనమైందన్న రష్యా. యూరప్‌లోకెల్లా పెద్దదైన జపోరిజియా అణు విద్యుత్కేంద్రం ఆక్రమణ. కీవ్ శివార్లలో ఉక్రెయిన్ డ్రోన్ల దాడిలో అపార నష్టం ధాటికి రష్యా సేనల పలాయనం. రష్యాపై అమెరికా, యూరప్ దేశాల భారీ ఆర్థిక, తదితర ఆంక్షలు.
ఏప్రిల్: కీవ్, బుచాల్లో వందలాది పౌరులను రష్యా సైన్యం చిత్రహింసల పాలు చేసి చంపినట్టు వెల్లడి. రష్యాపై యుద్ధ నేరాల అభియోగాలు మోపాలంటూ ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు. ఉక్రెయిన్ సైన్యం ఎదురుదాడి. రష్యా యుద్ధ నౌక మాస్క్‌వాను క్షిపణి దాడితో నల్లసముద్రంలో ముంచి సంబరాలు చేసుకున్న ఉక్రెయిన్.
మే: మారియుపోల్‌ను పూర్తిగా ఆక్రమించుకున్న రష్యా. రష్యా దూకుడు పట్ల ఆందోళనతో నాటోలో చేరుతామంటూ దరఖాస్తు చేసుకుని పుతిన్‌కు షాకిచ్చిన ఫిన్లండ్, స్వీడన్.
జూన్: ఉక్రెయిన్ దాడుల దెబ్బకు యుద్ధం మొదట్లో నల్లసముద్రంలో ఆక్రమించిన స్నేక్ ఐలాండ్ నుంచి వైదొలిగిన రష్యా సేనలు.
జూలై: ప్రపంచ ఆహార భద్రత దృష్ట్యా ఉక్రెయిన్ రేవు పట్టణాల నుంచి ఆహార ధాన్యాల సరఫరా.
ఆగస్టు: క్రిమియాపై ఉక్రెయిన్ దాడుల్లో తీవ్రంగా దెబ్బ తిన్న రష్యా వైమానిక స్థావరాలు, ఆయుధాగారాలు.
సెప్టెంబర్: ఖర్కీవ్‌లో ఆకస్మిక దాడులతో రష్యా దళాలను తరిమికొట్టిన ఉక్రెయిన్ సైన్యం. రిఫరెండం ముసుగులో డొనెట్స్క్, లుహాన్స్క్, ఖెర్సన్, జపోరిజియా ప్రాంతాలను రష్యాలో విలీనం చేసుకుంటున్నట్టు పుతిన్ ప్రకటన.
అక్టోబర్: క్రిమియాను రష్యాతో కలిపే కీలక బ్రిడ్జిని పేల్చేసిన ఉక్రెయిన్.
నవంబర్: రష్యాకు పరాభవం. దాడులకు తాళలేక ఖెర్సన్ నగరం నుంచి పుతిన్ సేనల పలాయనం.
డిసెంబర్: రష్యాలోని సరిహద్దు ప్రాంతాలు, పట్టణాలు, నగరాలపై దాడులు, భారీ నష్టం.
2023 జనవరి: మకీవ్కాలో క్షిపణి దాడులతో వందలాది మంది రష్యా సైనికులను మట్టుబెట్టామన్న ఉక్రెయిన్. 89 మంది మరణించారన్న రష్యా.

ఢిల్లీ మేయర్ పీఠం ఆప్‌దే

మేయర్‌గా షెల్లీ ఒబెరాయ్, డిప్యూటీ మేయర్‌గా ఇక్బాల్ ఎన్నిక



షెల్లీ, ఇక్బాల్ విజయానందం

న్యూఢిల్లీ: గతంలో పలుమార్లు వాగ్వాదాలు, వాయిదాలతో అర్ధంతరంగా ముగిసి సుప్రీంకోర్టుదాకా వెళ్లిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) మేయర్ ఎన్నిక ఘట్టం ఎట్టకేలకు బుధవారం సజావుగా ముగిసింది. బీజేపీ అభ్యర్థి రేఖా గుప్తాపై ఆప్ మహిళా అభ్యర్థి షెల్లీ ఓబెరాయ్ 34 ఓట్ల తేడాతో నెగ్గి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. 266 ఓట్లు పోలవగా షెల్లీకి 150, గుప్తాకు 116 ఓట్లు దక్కాయి. నామినేటెడ్ సభ్యులకూ ఓటింగ్ హక్కు ఉందంటూ బీజేపీ కార్పొరేటర్లు వాదించడం, అందుకు ఒప్పుకునేది లేదంటూ మెజారిటీ సభ్యులైన ఆప్ కార్పొరేటర్లు వాగ్వాదానికి దిగడంతో ఢిల్లీలోని సివిక్ సెంటర్ భవనంలో మేయర్, డెప్యూటీ మేయర్, ఆరుగురు స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ప్రక్రియ గతంలో మూడుసార్లు అర్ధంతరంగా వాయిదాపడిన సంగతి తెల్సిందే. మేయర్ ఎన్నికలపై తేల్చాలంటూ ఆప్ అభ్యర్థి గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జీ) వీకే సక్సేనా నామినేట్ చేసిన సభ్యులకు ఓటింగ్ హక్కులు ఉండబోమని సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరి 17న తేల్చిచెప్పడంతో మేయర్ ఎన్నిక కోసం సభను సమావేశపరచాలని ఎల్‌జీ ఆదేశాలివ్వడం, ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి జయకేతనం ఎగరేయడం చకచకా జరిగిపోయాయి. డెప్యూటీ మేయర్‌గా ఆప్ అభ్యర్థి అలే మొహమ్మద్ ఇక్బాల్ గెలిచారు. 'అల్లరి మూక ఓడిపోయింది. ప్రజలే గెలిచారు' అని బీజేపీనుద్దేశిస్తూ ఎన్నికల తర్వాత ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా హిందీలో ట్వీట్‌చేశారు. ఎంసీడీ తొలి మేయర్‌గా ఎన్నికైన 39 ఏళ్ల షెల్లీ ఆప్ మహిళా అభ్యర్థిగా తూర్పు పటేల్‌నగర్ వార్డు నుంచి గెలిచారు. గతంలో ఈమె ఢిల్లీ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఇగ్నోలో డాక్టరేట్ చేశారు. ఇండియన్ కామర్స్ అసోసియేషన్(ఐసీఏ)లో బంగారు పతకం సాధించారు.

బీజేపీ, ఆప్ సభ్యుల బాహాబాహీ

స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికపై రగడ

మేయర్, డెప్యూటీ మేయర్ ఎన్నిక తర్వాత సభను చాలాసేపు వాయిదావేశారు. సాయంత్రం ఆరు గంటలు అవుతున్నా సభ మొదలుకాకపోవడంతో బీజేపీ సభ్యులు హనుమాన్ చాలీసా చదువుతూ గడిపారు. 6.15గంటలకు సభ మొదలై స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ప్రక్రియ మొదలుపెట్టారు. పోలింగ్ ప్రాంతానికి మొబైల్ ఫోన్లను మేయర్ అనుమతించడాన్ని బీజేపీ సభ్యులు తీవ్రంగా తప్పుపడుతూ వెల్‌లోకి దూసుకొచ్చారు. దీంతో ' సభా మర్యాదలు పాటించని వారికి బయటకు పంపిస్తాం' అని మేయర్ షెల్లీ గద్దించారు. మేయర్, డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో అనుమతించని ఫోన్లు, పెన్నులను ఇప్పుడెలా అనుమతిస్తారని బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సభను వాయిదావేస్తున్నట్లు 6.35గంటలకు మేయర్ ప్రకటించారు. అప్పటికే చాలా మంది తమ ఓటు వేశారు. స్టాండింగ్ కమిటీలో ఆరు స్థానాల కోసం ఏడుగురు బరిలో నిలిచారు. మళ్లీ 7.40 గంటలకు ఎవరెవరి దగ్గర బ్యాలెట్ పేపర్లు ఉన్నాయో వాటిని అన్నింటిని తిరిగి ఇచ్చేయాలని, అప్పుడు తన తదుపరి నిర్ణయం చెప్తానని మేయర్ అన్నారు. దీంతో బీజేపీ సభ్యులు పెద్దపెట్టున నినదాలతో నిరసన తెలుపుతూ వెల్‌లోకి దూసుకొచ్చారు. ఇరు పార్టీల సభ్యులు పరస్పరం తోపులాటకు దిగారు. వాటర్ బాటిళ్లు విసురుకున్నారు. దాంతో సభ వాయిదా పడింది. రాత్రి 9.30కి తిరిగి మొదలైనా గందరగోళం కొనసాగింది.

ఐపీఎస్ రూపా మౌద్గిల్‌ను కట్టడి చేయండి

కోర్టును ఆశ్రయించిన రోహిణి సింధూరి

బెంగళూరు: కర్ణాటకలో ఐపీఎస్ అధికారి రూపా మౌద్గిల్, ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి మధ్య సమరం కొనసాగుతోంది. సోషల్ మీడియాలో పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకోవడంతో వారిని ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఇద్దరికీ పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. తన గురించి తప్పుడు ప్రచారం చేయకుండా, సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టకుండా నిషేధం విధించాలని కోరుతూ రోహిణి సింధూరి బెంగళూరులోని సిటీ సివిల్, సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. ఆమె తన పిటిషన్‌లో రూపా మౌద్గిల్‌తోపాటు 60 మంది పేర్లను ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టింది. రూపా మౌద్గిల్‌ను, సోషల్ మీడియాను కట్టడి చేసేలా ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేయాలని రోహిణి తరఫు న్యాయవాది కోరారు. సర్వీసు రూల్స్ ప్రకారం రోహిణి ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారని, పోలీసులకు కూడా ఫిర్యాదు సమర్పించారని న్యాయస్థానం గుర్తుచేసింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

కులవివక్షను నిషేధించిన సియాటిల్

- తొలి అమెరికా నగరంగా ఘనత
- ఈ నిర్ణయంపై మిశ్రమ స్పందన



క్షమా సావంత్

వాషింగ్టన్: కులవివక్షను నిషేధిస్తూ అమెరికాలోని సియాటిల్ నగరం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అగ్ర రాజ్యంలో ఈ చర్య తీసుకున్న తొలి నగరంగా నిలిచింది. ఈ మేరకు భారత సంతతికి చెందిన నేత, ఆర్థికవేత్త క్షమా సావంత్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని స్థానిక కౌన్సిల్ భారీ మెజారిటీతో ఆమోదించింది. నగర వివక్ష వ్యతిరేక విధానంలో కులాన్ని కూడా జోడిస్తూ నిర్ణయం తీసుకుంది. అనంతరం సావంత్ మీడియాతో మాట్లాడారు. కులవివక్ష వ్యతిరేక తీర్మానం భారీ మద్దతుతో ఆమోదం పొందిందని హర్షాతిరేకాల నడుమ వెల్లడించారు. ''అమెరికాలో కుల వివక్షపై పోరాటంలో ఇదో కీలక ముందడుగు. ఇక దీన్ని దేశవ్యాప్తంగా విస్తరించేలా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరముంది'' అని ఆమె అభిప్రాయపడ్డారు. ఇది చరిత్మాత్మక నిర్ణయమని సియాటిల్ టైమ్స్ వార్తా పత్రిక కొనియాడింది. ''ఈ రోజు కోసం హత్య, అత్యాచార బెదిరింపులెన్నింటినో తట్టుకుంటూ ముందుకు సాగాం. అంతిమంగా ద్వేషంపై ప్రేమ గెలిచింది'' అని తాజా నిర్ణయం వెనక కీలకంగా వ్యవహరించిన ఈక్వాలిటీ ల్యాబ్స్ అనే స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. భారత్‌లో కులవివక్షను 1948లో నిషేధించారు. 1950లో రాజ్యాంగంలో పొందుపరిచారు.


పలు సంస్థల వ్యతిరేకత!

సియాటిల్ కౌన్సిల్ నిర్ణయాన్ని హిందూ అమెరికన్ ఫౌండేషన్ (హెచ్ఏఎఫ్) వంటి సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి! ''ఈ విషయంలో కేవలం దక్షిణాసియావాసులను మాత్రమే లక్ష్యం చేసుకున్నారు. ఇలా వివక్ష వ్యతిరేక విధానంలో కులాన్ని జోడించడం అసంబద్ధం'' అని హెచ్ఏఎఫ్ సహ వ్యవవస్థాపకుడు సుహాగ్ శుక్లా ఆరోపించారు. ''ఈ ముసుగులో దక్షిణాసియా, ఆగ్నేయాసియా, ఆఫ్రికావాసులతో మిగతా వారి కంటే భిన్నంగా వ్యవహరించనున్నారు. ఈ కుటిల యత్నాలకు ఈ ఓటింగ్ ద్వారా ఆమోదముద్ర పడింది'' అంటూ దుయ్యబట్టారు. ఇదో ప్రమాదకరమైన తప్పుడు చర్య అని సంస్థ ఎండీ సమీర్ కల్రా అభిప్రాయపడ్డారు. ఈ చర్య సియాటిల్‌లోని దళిత బహుజనులకు కచ్చితంగా హాని చేసేదేనని అంబేడ్కర్-పూలే నెట్‌వర్క్ ఆఫ్ అమెరికన్ దళిత్స్ అండ్ బహుజన్స్‌కు చెందిన టి.మధు ఆరోపించారు. ఇలా కులాన్ని విధాన నిర్ణయంలో భాగం చేయడం స్థానికుల్లో హిందువుల పట్ల ఉన్న భయాన్ని (హిందూఫోబియా)ను మరింత పెంచుతుందని అమెరికాలోని భారత సంతతివారు ఆందోళన చెందుతున్నారు. హిందువులను భయభ్రాంతులను చేసే యత్నాల్లో భాగంగా అమెరికాలో గత మూడేళ్లలో పది హిందూ ఆలయాలు, గాంధీ, శివాజీ వంటి ఐదు విగ్రహాల విధ్వంస చర్యలు చోటుచేసుకున్నాయి. 2018 అమెరికన్ కమ్యూనిటీ సర్వే ప్రకారం అక్కడ ఉంటున్న భారత సంతతి వ్యక్తుల సంఖ్య 42 లక్షల పై చిలుకే. అమెరికా ఎప్పుడూ కులవ్యవస్థను అధికారికంగా గుర్తించకపోయినా అక్కడి దక్షిణాసియావాసులు ఉన్నత విద్యా సంస్థల్లో, పనిచేసే చోట కులవివక్షను ఎదుర్కొన్న ఉదంతాలెన్నో ఉన్నాయి.

పర్యావరణ పరిరక్షణ మన విధి: మోదీ

న్యూఢిల్లీ: పర్యావరణ పరిరక్షణ అనేది భారత్‌కు అంకితభావంతో నిర్వర్తించే విధి తప్ప బలవంతంగా చేసే పని కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రకృతి, అభివృద్ధి అనేవి కలిసి ముందుకు సాగాలని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ అవసరాలను పునరుత్పాదక, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల నుంచి తీర్చుకోవాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ఇచ్చిన సందేశాన్ని ద ఎనర్జీ, రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్(టీఈఆర్ఐ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వరల్డ్ సస్టెనబుల్ డెవలప్‌మెంట్ సదస్సు(డబ్ల్యూఎస్‌డీఎస్)లో చదివి వినిపించారు. నగరాలు, పట్టణాలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఆధునిక సాంకేతికత, నవీన ఆవిష్కరణ ద్వారా పరిష్కార మార్గాలు కనుగొంటున్నట్లు ప్రధానమంత్రి తెలిపారు. భూమిని తల్లిగా, మనమంతా ఆ తల్లి బిడ్డలమని మన ప్రాచీన గ్రంథాలు అభివర్ణించాయని గుర్తుచేశారు. పర్యావరణ పరిరక్షణలో మన దేశం ముందంజలో నిలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు.





మేఘాలయలో సంప్రదాయ వస్త్రధారణతో ఎన్నికల ప్రచారంలో మమతా బెనర్జీ, రాహుల్‌గాంధీ

ఈసీ నిర్ణయంపై స్టే ఇవ్వలేం: సుప్రీం

ఉద్ధవ్ వర్గానికి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: శివసేన పార్టీలోని ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఏక్‌నాథ్ షిండే వర్గమే అసలైన శివసేన పార్టీ అంటూ కేంద్ర ఎన్నికల సంఘం వెలువర్చిన నిర్ణయం అమలుపై స్టే ఇవ్వడం కుదరదని బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తేల్చిచెప్పింది. పార్టీ స్థిరచరాస్తులు, బ్యాంక్ ఖాతాలను షిండే వర్గానికి దక్కకుండా నిలువరిస్తూ 'యథాతథ' స్థితి ఉత్తర్వులు ఇవ్వాలన్న ఠాక్రే వర్గం విజ్ఞప్తిని కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. అయితే, ఠాక్రే వర్గం ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటిస్తూ అసలైన పార్టీ హోదాలో షిండే వర్గం చేసే అనర్హత ప్రక్రియ/విప్ లాంటివి జరగకుండా చూస్తామని కోర్టు సూచనప్రాయంగా హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో ఫిబ్రవరి 26న జరిగే ఉప ఎన్నికల్లో ఠాక్రే వర్గం 'ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే' పేరును, ఎన్నికల గుర్తుగా 'వెలిగే కాగడా'ను వినియోగించుకునేందుకు అనుమతి ఇచ్చింది. పార్టీ, పార్టీ గుర్తు అయిన విల్లు, బాణం సైతం సీఎం షిండే వర్గానికే దక్కుతాయని ఈసీ నిర్ణయించడం తెల్సిందే.

అమెరికా అధ్యక్ష బరిలో వివేక్



వాషింగ్టన్: భారతీయ మూలాలున్న అమెరికన్ యువ పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామి ఆ దేశ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్నారు. నిక్కీ హేలీ తర్వాత రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం బరిలో నిలిచిన భారతీయ మూలాలున్న రెండో భారతీయుడు వివేక్ కావడం విశేషం. 37 ఏళ్ల వివేక్ తల్లిదండ్రులు గతంలో కేరళ నుంచి అమెరికాకు వలసవచ్చారు. డొనాల్డ్ ట్రంప్‌కు పోటీగా దక్షిణ కరోలినా మాజీ గవర్నర్, ఐరాసలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ ఇటీవలే పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్నట్లు ప్రకటించి ప్రచారం మొదలుపెట్టడం తెల్సిందే. 'అమెరికాను మళ్లీ అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషిచేస్తా. అంతకుముందు మనం అమెరికా గొప్పదనాన్ని మరోసారి పునశ్చరణ చేసుకుందాం. చైనా ఆధిపత్యం వంటి సవాళ్లను అమెరికా ఎదుర్కొంటోంది. అమెరికా సార్వభౌమత్వాన్ని చైనా ఉల్లంఘిస్తోంది. ఒక వేళ రష్యా నిఘా బెలూన్ వచ్చి ఉంటే కూల్చి వెంటనే ఆంక్షలు విధించేవాళ్లం. చైనా విషయంలో ఆంక్షలు ఎందుకు విధించలేకపోయాం?. ఎందుకంటే ఆధునిక ప్రపంచంలో ఉత్పత్తుల కోసం చైనాపై మనం అంతలా ఆధారపడ్డాం. ఆర్థికంగా ఇలా మరో దేశంపై ఆధారపడే పరిస్థితికి చరమగీతం పాడదాం' అని ఫాక్స్‌న్యూస్ ప్రైమ్‌టైమ్ షో సందర్భంగా వివేక్ వ్యాఖ్యానించారు. వివేక్ 2014లో రోవంట్ సైన్సెస్‌ను స్థాపించారు. హెల్త్‌కేర్, టెక్నాలజీ సంస్థలను స్థాపించి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. 2022లో స్ట్రైవ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థనూ నెలకొల్పారు. అధ్యక్ష అభ్యర్థిగా బరిలో దిగాలంటే ముందుగా వివేక్ రామస్వామి, నిక్కీ హేలీ, డొనాల్డ్ ట్రంప్‌లలో ఎవరో ఒకరు రిపబ్లిక్ పార్టీలో పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా ప్రైమరీ ఎన్నికల్లో నెగ్గాలి. వచ్చే ఏడాది జనవరిలో ఈ ప్రక్రియ మొదలుకానుంది. అధ్యక్ష ఎన్నికలు వచ్చే ఏడాది నవంబర్ ఐదో తేదీన జరుగుతాయి. 2016లో బాబీ జిందాల్, 2020లో కమలాహ్యారిస్, ఈసారి నిక్కీ హేలీ తర్వాత అధ్యక్ష ఎన్నికలకు దిగిన నాలుగో ఇండో-అమెరికన్ వివేక్ రామస్వామికావడం విశేషం.

మార్గమధ్యంలో ఆయిల్ లీకేజీ

స్టాక్‌హోమ్‌లో ఎయిర్‌ఇండియా విమానం అత్యవసర ల్యాండింగ్

న్యూఢిల్లీ: అమెరికాలోని నెవార్క్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన ఎయిర్‌ఇండియా విమానం.. ఇంజన్ నుంచి ఆయిల్ లీకేజీ ఘటనలో కొద్దిసేపు కలకలం రేపింది. వెంటనే విమానాన్ని స్టాక్‌హోమ్‌లోని విమానాశ్రయంలో అత్యవసరంగా దింపేశారు. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) తెలిపింది. ఎయిర్‌ఇండియాకు చెందిన బోయింగ్ 777-300 ఈఆర్ రకం విమానం 19 మంది సిబ్బందిసహా 311 మందితో నెవార్క్ నుంచి బయల్దేరింది. మార్గమధ్యంలో హఠాత్తుగా ఒక ఇంజిన్ నుంచి ఆయిల్ కారుతుండటంతో ఇంజిన్‌ను ఆపేశారు. మరొక ఇంజన్ మీదనే నడిపిస్తూ వెంటనే దగ్గర్లోని స్టాక్‌హోమ్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్‌చేశారు. సోమవారం సైతం ఎయిర్‌ఇండియాకు చెందిన విమానం న్యూయార్క్ నుంచి ఢిల్లీకి వస్తూ మార్గమధ్యంలో మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా లండన్‌లో ల్యాండ్ అయింది.

సిసోడియాను విచారించండి

రాజకీయ నిఘా కేసులో సీబీఐకి కేంద్ర హోం శాఖ అనుమతి

న్యూఢిల్లీ: ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ పరిధి(జీఎన్‌సీటీడీ)లోని శాఖలు, స్వతంత్ర సంస్థలు, విభాగాలు చేపట్టే పనుల్లో అవినీతిపై నిఘా, 'ట్రాప్' కేసుల కోసం ఉద్దేశించిన ఫీడ్‌బ్యాక్ యూనిట్(ఎఫ్‌బీయూ)ను దుర్వినియోగం చేశారని, ఆ ఉదంతంలో ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను విచారించాలంటూ సీబీఐని కేంద్ర హోం శాఖ ఆదేశించింది. ఈ మేరకు అవినీతి నిరోధక చట్టం, 1988 కింద కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయానికి దర్యాప్తు అనుమతుల ఉత్తర్వులు పంపింది. దీన్ని పిరికిపంద చర్యగా సిసోడియా అభివర్ణించారు.

సాక్షి హైదరాబాద్

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



ఖర్చు ఎక్కువైందని భార్యను వదిలేశాడు

తన భార్య చదువు ఆర్థిక భారంగా భావించిన ఓ ఎన్నారై.. విదేశాల్లో ఒంటరిగా వదిలేసి.. తాపీగా చేతులు దులుపేసుకున్నాడు. -8లో



వాచ్‌మన్ చేతిలో దొంగ హతం

కుషాయిగూడ పరిధిలో దొంగతనానికి వచ్చిన ఓ దుండగుడు వాచ్‌మన్ చేతిలో హతమైన ఘటన బుధవారం వెలుగుచూసింది. -8లో

పంచవటి పార్కులో మొక్కలు నాటిన కంగనా



శంషాబాద్: గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ బుధవారం శంషాబాద్‌లోని అటవీ శాఖకు చెందిన పంచవటీ పార్కులో మొక్కలు నాటారు.

న్యూస్‌రీల్

ఓయూలో రేపు పీహెచ్‌డీ అభ్యర్థుల సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆర్ట్స్ కాలేజీ వేదికగా శుక్రవారం ఉదయం 10 గంటలకు పీహెచ్‌డీ అభ్యర్థుల అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు బుధవారం ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు ఓయూ అధికారులు అర్హత మార్కుల విషయంలో అవలంబిస్తున్న విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూల్ ఆఫ్ రిజ్వరేషన్లు, బీసీ, ఓసీ విద్యార్థులకు కాకతీయ యూనివర్సిటీ మాదిరి అర్హత మార్కుల కుదింపు తదితర అంశాలపై జరగే సమావేశానికి అభ్యర్థులు ర్యాంకు కార్డులతో హాజరుకావాలని సూచించారు.

ప్రతిష్టాత్మక గోల్డెన్ పికాక్ అవార్డుకు 'ఎస్కీ' ఎంపిక

రాయదుర్గం: ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)కి ప్రతిష్టాత్మకమైన 'గోల్డెన్ పికాక్ అవార్డ్-2023' దక్కింది. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్య అధ్యక్షతన జరిగిన జ్యూరీ బృందం ఈ అవార్డుకు 'ఎస్కీ'ని ఎంపిక చేసింది. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాకు గోల్డెన్ పికాక్ అవార్డు ఎనిమిదోసారి దక్కడం విశేషం. మార్చి 15న దుబాయ్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో వ్యాపార, పరిశ్రమ ప్రముఖుల సమక్షంలో అవార్డు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. గోల్డెన్ పికాక్ అవార్డుకు ఎస్కీని ఎంపిక చేయడం పట్ల దీని డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర రావు, ఇతర అధికారులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

కీసర ఆదాయం రూ.1,03,38,622

కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానానికి రూ.1,03,38, 622 మేర ఆదాయం సమకూరింది. వివిధ ఆర్జిత సేవల టికెట్లు, ఆన్‌లైన్ పూజలు, దర్శనాలు, , హుండీ, డొనేషన్ల ద్వారా రూ.1,03,38,622 వచ్చాయని ఆలయ చైర్మన్ తటాకం రమేష్ శర్మ, ఈఓ సుధాకర్‌రెడ్డిలు తెలిపారు. ఈ మొత్తాన్ని స్వామివారి పేరిట కీసర ఎస్‌బీఐలో డిపాజిట్ చేయనున్నట్లు చెప్పారు. గత ఏడాది బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.83,74,632 ఆదాయం వచ్చిందని, ఈసారి అదనంగా రూ.19,63,990 మేర ఆదాయం వచ్చిందని వారు తెలిపారు.

మురిసి.. మైమరిచి..

- హెచ్‌పీఎస్‌లో సినీ నటుడు నాగార్జున



సనత్‌నగర్: 'మూడేళ్ల వయసులో బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో చేరి.. 15 ఏళ్ల పాటు చదువుకున్నాను.. ప్రపంచాన్ని ఎదుర్కొనేలా ఈ పాఠశాల నాలో ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్నీ నింపింది' అంటూ ప్రముఖ సినీనటుడు నాగార్జున అన్నారు. 'హెచ్‌పీఎస్' శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి నాగార్జునతో పాటు రాష్ట్ర ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున.. తన చిన్ననాటి రోజులను గుర్తు చేసుకున్నారు. హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీనోరియా, ప్రిన్సిపాల్ మాధవ్‌దేవ్ సరస్వత్, రఘురామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

పీర్జాదిగూడ పరిధి నందనవనంలో ఘటన

- అటవీ అధికారుల భద్రతా వైఫల్యమే కారణం





మేడిపల్లి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నందనవనం (జటాయువు) పార్కులో వీధి కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఓ జింక మృతి చెందింది. నందన వనంలోకి కుక్కలు ప్రవేశించడం వెనుక అటవీ శాఖ అధికారుల డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది. కాగా.. కొందరు వేటగాళ్లు సాయిప్రియ కాలనీలోంచి గుట్టు చప్పుడు కాకుండా పార్కులోకి ప్రవేశించి కుందేళ్లను వేటాడుతున్నా పట్టించుకునే వారే లేకుండాపోయారు. గతంలోనూ వేటగాళ్లు అక్కడ వేసిన వలలను వాకర్స్ తొలగించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం గమనార్హం. తాజాగా జింక పిల్లపై వీధి కుక్కలు దాడి చేసి చంపడం పట్ల వాకర్స్, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో పాటు వీధి కుక్కలను నివారించడంలో మున్సిపల్ అధికారులు విఫలమవుతున్నారంటూ ఆరోపిస్తున్నారు. జింక మృతికి కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ఆఫీసర్ మారితే.. పథకం పరార్

వీధి కుక్కల నియంత్రణకు 'మా ఇంటి నేస్తం'

- దోమల నివారణకు మస్కిటో యాప్
- అధికారులు మారగానే వీటి ఊసే లేదు
- వాటి స్థానంలో కొత్తవి ప్రవేశపెట్టని దైన్యం
- పట్టించుకోని బల్దియా పాలకవర్గం
- నిత్యం ఇబ్బందుల్లో నగర జనం



సాక్షి, సిటీబ్యూరో: బల్దియాలో సమస్యల పరిష్కారం కోసం ఒక అధికారి ప్రారంభించిన పథకాల్ని తర్వాత వచ్చిన వారు నిలిపివేయడంతో సదరు సమస్యలు పూర్తిగా పరిష్కారం కావడం లేదు. సగం వరకు విజయవంతంగా నడిచిన కార్యక్రమాలు కొత్తవారి రాకతో ఆగిపోతుండటంతో సమస్యలు మొదటికొస్తున్నాయి. ఇందుకు ఉదాహరణలు మా ఇంటినేస్తం, మస్కిటో యాప్, సీటీమార్, సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం తదితర కార్యక్రమాలు.

వీధి కుక్కల బెడదను తగ్గించడానికి..

నగరంలో వీధి కుక్కల బెడదను నివారించేందుకు అయిదేళ్ల క్రితం మా ఇంటినేస్తం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు దత్తత తీసుకోవడం ద్వారా వీధి కుక్కల్ని తగ్గించడం దీని ఉద్దేశం. కార్యక్రమాన్ని ప్రారంభించాక మూడువేల కుక్కల వరకు ప్రజలు దత్తత తీసుకున్నారు. అది నిరంతరాయంగా కొనసాగి ఉంటే వీధికుక్కల బెడద ఇప్పుడున్నంత తీవ్రంగా ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దోమల నివారణకు..

మస్కిటో యాప్ పేరిట ఒక యాప్‌ను ప్రారంభించి దోమలపై ప్రజలకు ఎంత అవగాహన ఉందో తెలుసుకునేందుకు ప్రశ్నావళి రూపొందించి, సరైన సమాధానాలు పంపిన వారికి బహుమతులందజేసేవారు. ఆ యాప్ వల్ల దోమల నివారణపై ప్రజలకు అవగాహన పెరిగి, తద్వారా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు తగ్గేందుకు ఉపకరించిందని కాలనీ సంఘాల ప్రజలు చెబుతున్నారు.

మూగబోయిన 'సీటీ మార్'..

- బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తే విజిల్ వేసేవారు. తద్వారా అందుకు వెనుకాడేవారు. దాన్నే సీటీమార్ కార్యక్రమంగా అమలు చేశారు. వాటితోపాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధించేవారు. ఇలా.. ఒక అధికారి హయాంలో యాభైశాతం వరకు ఫలితాలు సాధించిన కార్యక్రమాల్ని తర్వాత వచ్చిన వారు అమలు చేయకపోవడంతో సదరు సమస్యలు మళ్లీ మొదటికొస్తున్నాయి.
- కొత్తగా వచ్చిన వారు వాటిస్థానే వేరేవైనా ప్రారంభించారా అంటే అదీ లేదు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధం తదితర కార్యక్రమాలు ఇలాగే విఫలమయ్యాయి. ప్రస్తుతం వీధికుక్కల సమస్య వైరల్ కావడంతో దత్తత ఇచ్చే కార్యక్రమాన్ని చేపడతామని మేయర్ ప్రకటించారు. అయినప్పటికీ, అది ఏమాత్రం విజయవంతమవుతుందో చెప్పే పరిస్థితి లేదు. గతంలో కొనసాగిన కార్యక్రమాన్ని పూర్తిగా ఆపేసి మళ్లీ ప్రారంభించడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అవగాహన కూడా అవసరమే..

వీధికుక్కలు కనిపించినప్పుడు బెదిరిపోకుండా.. వాటిని కొట్టకుండా ఉండటం వంటి వాటిపై పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెబుతున్నారు. పరుగెత్తడం వంటివి చేయరాదని, కామ్‌గా ఉంటే కుక్కలు సైతం మనుషుల వద్దకు రావని, ఇలాంటి విషయాల గురించి అందరికీ అవగాహన అవసరమని సూచిస్తున్నారు. వీటితోపాటు కుక్కల సంతతి పెరగకుండా స్టెరిలైజేషన్ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో చేయడం అవసరమంటున్నారు.



సంజీవయ్య చిల్డ్రన్ పార్కులో బుధవారం కుక్కల స్వైర విహారం

కుక్క కాటు సమస్యలకు పరిష్కారమేదీ..?

- కుక్కలకు స్టెరిలైజేషన్ చేస్తున్నామని, యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేస్తున్నామని జీహెచ్ఎంసీ చెబుతోంది. వీటిపై కాకిలెక్కల సంగతి అలా ఉంచితే.. వాటి వల్లే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందా? అంటే కాదనే సమాధానమే వస్తోంది. అంబర్‌పేటలో కుక్కల దాడిలో మృతి చెందిన బాలుడి ఉదంతమే ఇందుకు ఉదాహరణ.
- యాంటీ రేబిస్, స్టెరిలైజేషన్ వల్ల ఇలాంటి ప్రమాదాలు తగ్గుతాయా? ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే వీధికుక్కలు పేట్రేగకుండా కొన్ని రోజులు మాత్రం వాటికి మాంసం, ఇతరత్రా ఆహార పదార్థాలు వేయకుండా నిలువరించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు.. ఇష్టం వచ్చినప్పుడు ఆయా ప్రాంతాల్లో ఆహారాన్ని ఉంచడం వంటి పనులు కూడా చేయరాదని వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు. మటన్, చికెన్ దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను బహిరంగంగా వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఎర్రబోడలో వెర్రెక్కిన కుక్కలు

- అయిదుగురు చిన్నారులకు గాయాలు



గాయపడ్డ చిన్నారులు



కుక్కల దాడిలో గాయపడ్డ పునీత్, పవన్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎర్రబోడ ప్రాంతంలో ఇంటి ముందు ఆడుకుంటున్న అయిదుగురు చిన్నారులపై వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. గాయాల పాలైన వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఎర్రబోడకు చెందిన ఎనిమిదేళ్ల వయసున్న పునీత్, పవన్, చేతన్, వెంకటేష్‌తో పాటు మరో బాలుడు మంగళవారం ఓ ఇంటి ముందు ఆడుకుంటున్నారు. మొదట ఓ వీధి కుక్క పునీత్‌ను కరిచి చేయిపట్టుకొని కిందపడేసింది. విషయం గమనించిన పవన్ దానిని రాయితో కొట్టేందుకు ప్రయత్నించగా అతడిని సైతం కరిచింది. స్థానికులు గమనించి కుక్కలను తరిమివేయడంతో ముందుకు వెళ్లిన కుక్కలు ఇదే బస్తీకి చెందిన చేతన్, వెంకటేష్‌తో పాటు మరో చిన్నారిని కరిచాయి. పునీత్, పవన్‌లకు కాళ్లు, చేతులు, తలకు గాయాలయ్యాయి. కుక్క నోటితో పట్టి పీకడంతో చేతి, కాలు మాంసం బయటకు వచ్చింది. వీరిని వారి తల్లిదండ్రులు హైదర్‌గూడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి ఇళ్లకు పంపించారు. కాగా.. 15 రోజుల క్రితం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో వీధి కుక్కల విషయమై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఎర్రబోడకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్ చేపడతాం

వీధి కుక్కల స్వైర విహారంపై దక్షిణ మండలం జీహెచ్ఎంసీ వెటర్నరీ అధికారి శ్రీకాంత్‌ను వివరణ కోరగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి కుక్కలను పట్టుకుంటామన్నారు. సంతాన నిరోధక శస్త్ర చికిత్స చేసి అనంతరం వాటిని అదే ప్రాంతంలో వదులుతామన్నారు. పిచ్చి కుక్కలు ఉంటే వాటిని అక్కడ నుంచి తరలిస్తామన్నారు.

బస్తీలో బంధించి.. బయట వదిలేసినా..

సాక్షి, సిటీబ్యూరో: వీధి కుక్కల నియంత్రణ కోసం జీహెచ్ఎంసీ ఏటా రూ.10 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. పునరుత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించే చికిత్సలను చేపడుతోంది. నగరంలో నిత్యం 30 వాహనాలు.. 390 మంది సిబ్బంది ఇదే పనిగా విధులు నిర్వహిస్తున్నారు. కుక్కల నియంత్రణలో భాగంగా ఎవరైనా అధికారి బంధించిన ఈ కుక్కలను చంపితే.. జంతు ప్రేమికుల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

కోర్టులను ఆశ్రయించి సిబ్బందిపై కేసులు నమోదు చేయిస్తున్న ఘటనలు లేకపోలేదు. స్థానికుల ఫిర్యాదు మేరకు బస్తీల్లో బంధించిన వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేసి, ఆ తర్వాత గుట్టుగా శివారులోని నిర్మానుష్య ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. అక్కడ వాటికి సరైన ఆహారం, నీళ్లు దొరక్కపోవడంతో మళ్లీ బస్తీలకు చేరుకుంటున్నాయి. ఒక ప్రాంతం నుంచి మరోప్రాంతానికి గుంపులు గుంపులుగా వచ్చి చేరుతున్నాయి. మండుతున్న ఎండలు.. ఆపై సరైన ఆహారం, నీరు లేకపోవడంతో పిచ్చిగా ప్రవర్తిస్తున్నాయి. చిన్నారులు, వాహనదారులపై దాడులు చేస్తున్నాయి.

చర్యలు శూన్యం: బీజేపీ

గన్‌ఫౌండ్రీ: వీధి కుక్కల కట్టడికి బల్దియా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని జీహెచ్ఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్ అన్నారు. బుధవారం అబిడ్స్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నగరంలో కుక్కల దాడులు, అగ్ని ప్రమాద ఘటనలు తరచూ జరుగుతున్నా జీహెచ్ఎంసీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వీధికుక్కల పట్టివేత, వాటి ఆపరేషన్ల ఖర్చు అంటూ ప్రతి యేటా రూ.15 కోట్ల బడ్జెట్ కేటాయిస్తున్నారని, ఆ సొమ్మంతా ఎటు పోతోందని ప్రశ్నించారు. జంతు ప్రేమి కురాలినని చెబుతున్న మేయర్‌కు మనుషుల ప్రాణాలంటే విలువ లేకుండా పోయిందన్నారు. సమావేశంలో బీజేపీ జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు రాధా ధీరజ్‌రెడ్డి, సురేఖ ఓంప్రకాష్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, చైతన్య, అమృత పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్పొరేటర్ల వినతిపత్రం

సాక్షి, సిటీబ్యూరో: వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిందిగా కాంగ్రెస్ కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు కుక్క బొమ్మలు తెచ్చి వాటికి సైతం వినతిపత్రాలు అందించారు. కుక్కల సంతతి నిరోధానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో, అంబర్‌పేట ఘటనకు బాధ్యులెవరో.. వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలన్నారు.

దాడికి పాల్పడిన కుక్కలు అబ్జర్వేషన్‌కు..



అంబర్‌పేట: అంబర్‌పేట చే నంబర్ చౌరస్తా పరిధిలో ఆదివారం దాడికి పాల్పడి నాలుగేళ్ల బాలుడి మృతికి కారణమైన వీధి కుక్కలను జీహెచ్ఎంసీ యంత్రాంగం పట్టుకుంది. నాలుగు కుక్క పిల్లలతో పాటు నాలుగు పెద్దవాటిని పట్టుకుని అంబర్‌పేటలోని జీహెచ్ఎంసీ కుక్కల ఆవాస కేంద్రానికి తరలించారు. వాటికి వ్యాధులేమైనా ఉన్నాయా? అనే విషయాన్ని పరిశీలించనున్నారు. ఘటన జరిగిన నాటి నుంచి అంబర్‌పేటలో ఇప్పటి వరకు 33 కుక్కలను పట్టుకున్నట్లు జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం అధికారి భూక్యా నాయక్ తెలిపారు. కార్ల సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్న సిబ్బంది బిస్కెట్లు, ఆహారం వేయడం వల్లే అక్కడ కుక్కలు గుంపుగా తిష్ట వేశాయి. ఆదివారం సెలవు కావడంతో వాటిని పట్టించుకునే వారు లేకపోవడంతో ఇష్టారీతిగా బాలుపై దాడి పాల్పడ్డాయని ఆయన పేర్కొన్నారు.

సెక్టార్ ఎస్ఐకి మెమో..

అంబర్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని గోల్నాక సెక్టార్ ఎస్ఐ విజయ్‌కి ఉన్నతాధికారులు మెమో జారీ చేశారు. కుక్కల దాడి ఘటనపై సరైన సమాచారం చేరవేయకపోవడం, ఘటనపై నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడంతోనే ఆయనకు మెమో జారీ చేశారని తెలుస్తోంది. ఘటనపై న్యాయ సలహా కోరగా.. ఇంకా స్పష్టత రాలేదని డీఐ ప్రభాకర్ పేర్కొన్నారు.



రాత్రికి రాత్రే కూల్చేశారు!

'అర్ధరాత్రి వేళ.. అందరూ నిద్రిస్తున్న సమయాన.. ఇళ్లమీద పడ్డారు. అసహాయులను చేశారు. నివాసాల్లోని సామగ్రిని బయటపడేశారు. కాళ్లావేళ్లా పడినా కనికరించలేదు. ఇళ్లన్నీ నేలమట్టం చేసి వీధుల్లోకి నెట్టిపడేశారు. ఏమిటీ ఘోరం? ఎందుకింత అమానుషం'? అంటూ ఎర్రమంజిల్ వాసులు అధికారులపై దుమ్మెత్తిపోశారు. ఎర్రమంజిల్ రవీంద్రనికేతన్ పాఠశాల సమీపంలో ఉన్న సుమారు 30 ఇళ్లను మంగళవారం అర్ధరాత్రి రెవెన్యూ, జీహెచ్ఎంసీ, పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులు మూకుమ్మడిగా వచ్చి కూల్చేయడంపై స్థానికుల నుంచి ఆగ్రహం వెల్లువెత్తుతోంది. బాధితులు బుధవారం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

- వివరాలు లోపలి పేజీలో

ఢిల్లీ టు సిటీ.. వయా కోల్‌కతా

చోరీ చేసిన కార్ల 'వివరాలు' మార్చి విక్రయం

- ఎన్ఓసీ తప్ప అన్నీ తయారు చేస్తున్న ముఠా
- అయిదుగురిని పట్టుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్
- రూ.2.45 కోట్ల విలువైన 18 కార్లు స్వాధీనం
- పరారీలో ఉన్న సూత్రధారి కోసం గాలింపు

సాక్షి, సిటీబ్యూరో: దేశ రాజధాని ఢిల్లీలో కార్లను దొంగిస్తారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో వాటి 'వివరాలు' మారుస్తారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు తరలించి తక్కువ ధరకు విక్రయిస్తారు. ఓ అంతర్రాష్ట్ర ముఠా కొన్నాళ్లుగా సాగిస్తున్న గుట్టును ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. అయిదుగురిని అరెస్టు చేసి రూ.2.45 కోట్ల విలువైన 18 హైఎండ్ కార్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సూత్రధారి సహా మరికొందరి కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు డీసీపీ సునీల్ దత్ పేర్కొన్నారు. డీసీపీ డాక్టర్ పి.శబరీష్‌తో కలిసి బుధవారం సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు.

బప్పా ఘోష్ నేతృత్వంలో..

కోల్‌కతాకు చెందిన బప్పా ఘోష్ దేశ వ్యాప్తంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నాడు. తేలికపాటి వాహనాలు చోరీ చేయడానికి, వాటి ఇంజిన్, చాసిస్ నంబర్లు మార్చి నకిలీ నంబర్ ప్లేట్లు తగిలించడానికి, ఇలా తయారైన సెకండ్ హ్యాండ్ కార్లను విక్రయించడానికి వేర్వేరుగా ముఠాలు నిర్వహిస్తున్నాడు. ప్రధాన ముఠా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌ల్లో హైఎండ్ కార్లను తస్కరిస్తుంది. వీటిని కోల్‌కతాకు తీసుకువెళ్లి బప్పా ఘోష్‌కు అప్పగిస్తుంది. అక్కడే మరో గ్యాంగ్ టైగర్ మార్కింగ్ విధానంలో వీటి ఇంజిన్, చాసిస్ నంబర్లు మార్చేస్తుంది. అప్పటికే ఉన్న నంబర్‌ను పూర్తిగా తుడిచేసి, అసలు దాన్ని తలదన్నేలా నకిలీ నంబర్ ముద్రించడాన్నే టైగర్ మార్కింగ్ అంటారు.

అక్కడ తిరిగే కార్ల వివరాలతోనే...

ఈ ముఠా వాహనానికి తగిలించే రిజిస్ట్రేషన్ నంబర్ విషయంలో ఘోష్ పక్కాగా వ్యవహరిస్తున్నాడు. తస్కరించిన కారు మోడల్, రంగుతో ముంబై, కోల్‌కతాల్లో సంచరిస్తున్న వాహనాలవే వీటికీ తగిలిస్తున్నాడు. ఈ వివరాలతోనే ఆర్సీలు తయారు చేస్తున్నాడు. ఒక రాష్ట్రానికి సంబంధించిన వాహనాలు మరో రాష్ట్రంలో రీ రిజిస్ట్రేషన్ కావాలంటే దానికి ఇతర పత్రాలతో పాటు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ) తప్పనిసరి. ప్రతి ఆర్టీఏ విభాగం తాము జారీ చేసిన ఎన్ఓసీల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తుంది. వీటిని మరో రాష్ట్రం ఆర్టీఏ అధికారులు చూడగలుగుతారు. ఇలా నకిలీ ఎన్ఓసీలను తేలిగ్గా గుర్తించవచ్చు. ఈ కారణంగానే ఘోష్ గ్యాంగ్ ఎన్ఓసీలను మాత్రం తయారు చేయట్లేదు.

విక్రయించిన ధర కంటే తక్కువకు...

ఘోష్‌కు దేశ వ్యాప్తంగా వివిధ నగరాలు, పట్టణాల్లోని కారు డీలర్లతో పరిచయాలు ఉన్నాయి. వీరికి స్థానికంగా ఉన్న డీలర్లతో సంబంధాలు ఉంటున్నాయి. అలాంటి వారిలో నగరానికి చెందిన శైలేందర్ సింగ్, అబ్దుల్ రహీం ఖాన్, షేక్ జావేద్, వరికుప్పల దశరథ్, షానవాజ్ అలీ ఖాన్, కందిమళ్ల పరిపూర్ణాచారి, ఖలీమ్ కీలక వ్యక్తులు. వీరి ద్వారా ఘోష్ నగరంలో 18 కార్లు విక్రయించాడు. అమాయకులను ఎంపిక చేసుకుని వాహనం వాస్తవ ధరకు సగానికే అమ్మడానికి ఒప్పందం కుదుర్చుకుంటారు. అడ్వాన్స్ తీసుకుని, వాహనం అప్పగించాక మిలిగిన మొత్తంలో రూ.లక్ష తక్కువ తీసుకుంటారు. ఎన్ఓసీ ఇచ్చాక ఆ డబ్బు ఇవ్వాలంటారు. వీళ్లు ఈ పత్రం ఇవ్వడం, వాళ్లు ఆ మొత్తం ఇవ్వడం జరగనే జరగదు.

చిలకలగూడ వ్యక్తి ఫిర్యాదుతో కేసు..

తూర్పు మండల పరిధిలోని చిలకలగూడ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి రహీం ఖాన్ నుంచి కారు ఖరీదు చేశాడు. ఎన్నాళ్లకూ ఎన్ఓసీ ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా.. చోరీ వాహనంగా తేలింది. దీంతో ఆయన ఈ నెల 17న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనాథ్‌రెడ్డి నేతృత్వంలో ఎస్సైలు బి.అశోక్‌రెడ్డి, కె.శ్రీకాంత్, ఎం.అనంతాచారి, బి.అర్వింద్ గౌడ్‌లతో కూడిన బృందం ఘోష్, పరిపూర్ణాచారి, ఖలీమ్ మినహా మిగిలిన వారిని అరెస్టు చేసింది. వీరిలో పరిపూర్ణాచారి గతేడాది ఫిబ్రవరిలో మరో ఇద్దరితో కలిసి మిర్యాలగూడ పోలీసులకు చిక్కాడు. ఆ కేసులోనూ ఘోష్ వాంటెడ్‌గానే ఉన్నాడు. ఇతగాడు చిక్కితే కీలక విషయాలు బయటపడే అవకాశం ఉండటంతో పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. స్వాధీనమైన 18 కార్లలో అన్నీ హైఎండ్ మోడల్సే కావడం గమనార్హం.



నిందితులను చూపిస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న కార్లు

వాచ్‌మెన్ చేతిలో దొంగ హతం

- ఆలయంలో చోరీకి వచ్చి రాళ్లతో దాడి
- కర్రతో ప్రతిదాడి చేసిన వాచ్‌మెన్
- సంఘటన స్థలంలోనే మృతిచెందిన దొంగ
- వాచ్‌మెన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు..





వాచ్‌మెచ్ చేతిలో హతమైన రాజు

కుషాయిగూడ: కుషాయిగూడలో పరిధిలోని ఓ ఆలయంలో దొంగతనానికి వచ్చిన దుండగుడు వాచ్‌మెన్ చేతిలో హతమైన సంఘటన బుధవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కామారెడ్డి జిల్లా, ఆరెపల్లికి చెందిన గంధం రాజు (23) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కొన్ని రోజుల పాటు కుషాయిగూడలోని తన అక్క ఇంట్లో ఉంటూ మార్కెట్‌లో అరటాకుల దుకాణంలో పని చేశాడు. ఆరు నెలల క్రితం ఇంట్లో వారికి తెలియకుండా ప్రేమ వివాహం చేసుకున్న రాజు వేరు కాపురం పెట్టాడు. మనస్పర్థల కారణంగా మూడు నెలల క్రితం అతడి భార్య వెళ్లిపోవడంతో ఒంటరిగానే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా సక్రమంగా పనిచేయడం లేదని షాపు యజమాని నెల రోజుల క్రితం రాజును పనిలోంచి తీసేయడంతో కూలీ పనిచేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి మద్యం మత్తులోనో..డబ్బుపై వ్యామోహంతోనో తెలియదు కాని..ఆలయంలో దొంగతనానికి పూనుకున్నాడు. కుషాయిగూడ వెంకటేశ్వర స్వామి ఆలయ గోడ దూకి లోనికి ప్రవేశించిన రాజు అక్కడున్న హుండీని పగులగొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అలికిడికి నిద్రలేచిన ఆలయ వాచ్‌మెన్ బంధం రంగయ్య (61) హుండీని పగులగొట్టేందుకు యత్నిస్తున్న రాజును చూశాడు. దొంగ దొంగ అంటూ అరవడంతో వాచ్‌మెన్‌పైకి రాళ్లు విసిరి దాడికి పాల్పడ్డాడు. దీంతో వాచ్‌మెన్ తన వద్ద ఉన్న కర్రతో ప్రతిదాడికి దిగాడు. అయినా రాజు రాళ్లదాడి ఆపకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసం కర్రతో దొంగ తలపై పలుమార్లు దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి వద్ద లభించిన ఫోన్‌లో లభ్యమైన ఆధారాలతో మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆలయ ఈఓ వీరేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపీసీ 234,304 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వాచ్‌మెన్ రంగయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఉదయం కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఆలయంలోని సీసీ కెమెరాలను పరిశీలించామని సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా రక్తం మరకలతో నిండిన ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు. సంప్రోక్షణ నిర్వహించి స్వామి వారికి పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

Union Bank of India — స్ట్రెస్డ్ అస్సెట్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్
3వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ బిల్డింగ్, సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్-500095. ఫోన్ నం. 040-24683303, 24683305. ఇ-మెయిల్: bm1204@unionbankofindia.com

22-02-2023న ప్రచురించబడిన 20-02-2023 తేది గల వేలం ప్రకటనకు అనుబంధం

22-02-2023న ఈ వార్తా పత్రికలో ప్రచురించబడిన రుణగ్రహీత **M/s. రామకృష్ణ ఎలక్ట్రానిక్స్** మరియు గ్రూప్ అకౌంట్స్‌కి చెందిన 20-02-2023 తేది గల వేలం ప్రకటనలో, వేలం తేది **28-03-2023**కి బదులుగా 23-02-2023 అని తప్పుగా పేర్కొనబడినది. కావున, వేలం తేదిని **28-03-2023** అని చదువుకోవలెను. ప్రచురించబడిన వేలం ప్రకటన యొక్క ఇతర నియమనిబంధనలు యధాతథంగా ఉంటాయి.

తేది: 22-02-2023 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

నగరం నుంచి బ్యాంకాక్‌కు నోక్ ఎయిర్ సర్వీసులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బ్యాంకాక్‌కు నోక్ ఎయిర్ విమాన సర్వీసులు బుధవారం ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి 12.40 గంటలకు ఇక్కడి నుంచి నోక్ ఎయిర్ విమాన సర్వీసు బ్యాంకాక్‌లోని డాన్ ముయాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరింది. నోక్ ఎయిర్‌లైన్స్ దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ నుంచి తన సర్వీసులను ప్రారంభించింది. వారంలో మూడు రోజుల పాటు ఇక్కడి నుంచి ముయాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 737 మాక్స్-8 విమానం రాకపోకలు సాగిస్తుంది. ప్రస్తుతం థాయ్ ఎయిర్‌లైన్స్ సర్వీసు మాత్రమే ఇక్కడి నుంచి బ్యాంకాక్‌లోని సువర్ణభూమి ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగిస్తోంది. బ్యాంకాక్‌కు వెళ్లే పర్యాటకులు, ప్రయాణికులకు దీంతో మరో సర్వీసు అందుబాటులోకి వచ్చిందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ తెలిపారు. అంతర్జాతీయంగా మరిన్ని గమ్యస్థానాలకు పెంచేందుకు హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సన్నద్ధంగా ఉందన్నారు.



నోక్ ఎయిర్ సర్వీసును ప్రారంభిస్తున్న సంస్థ, జీఎంఆర్ ప్రతినిధులు

సిరియా భూకంప బాధితులకు అండగా ఉందాం..

సాక్షి, సిటీబ్యూరో: సిరియా భూకంప బాధితులకు అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీవుల్లా ఖాన్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ భూకంపం కారణంగా సర్వం కోల్పోయిన సిరియన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకునేందుకు ముందుకు వచ్చి సామాగ్రి రూపంలో సహాయం అందించాలని కోరారు. అక్కడి జనం ఇళ్లు లేక గుడారాల్లో నివసిస్తూ తిండికి, నిత్యావసరాలకోసం అల్లాడుతున్నారని చెప్పారు. నగరంలో సిరియా రాయబార కార్యాలయం లేనందున హజ్ హౌజ్‌లో తాము సామాగ్రిని సేకరిస్తున్నామని చెప్పారు. అక్కడ చలి ఎక్కువగా ఉన్నందున వెచ్చని దుస్తులు, దుప్పట్లు, టెంట్లు, పిల్లలకు పాలడబ్బాలు అవసరం ఉందని, ప్రజలు వాటిని అందిస్తే బాధితులకు చేరవేస్తామని చెప్పారు. ఎవరైనా సామాగ్రి, వస్తువులు ఇవ్వాలనుకుంటే ఫ్లయిట్ ప్యాకింగ్ చేసి తీసకురావాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ సేకరించిన వస్తువులను డిల్లీలోని సిరియా రాయబార కార్యాలయానికి టాన్స్‌పోర్టు ద్వారా చేరవేస్తామన్నారు.

మా దేశానికి రండి..పెట్టుబడులు పెట్టండి

వాణిజ్యవేత్తలకు అఫ్గానిస్థాన్ రాయబారి ఫరీద్ పిలుపు

సాక్షి,సిటీబ్యూరో: అఫ్గానిస్థాన్‌లో అపార ఖనిజ నిల్వలు ఉన్నాయని, రూ.3 లక్షల డాలర్ల పెట్టుబడులను మైనింగ్ రంగంలో పెట్టాలని ఆ దేశ రాయబారి ఫరీద్ ముముండ్‌జే కోరారు. మైనింగ్ తవ్వకాలకు భారత్ సాయం కావాలని, ఈ పరిణామం ఉభయ తారకంగా పనిచేస్తుందని చెప్పారు. ఇరుదేశాల మధ్య ఉన్న సత్సంబంధాలతో వాణిజ్య, వైమానిక సేవలను విస్తరించుకునే దిశగా ముందడుగు వేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం హైదరాబాద్‌లో ఎఫ్‌టీసీసీఐ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అఫ్గాన్‌లో వ్యాపార అవకాశాలను అన్వేషించేందుకు ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. భారతదేశం తమకు సహజ వాణిజ్య గమ్యస్థానమని పేర్కొన్నారు. భారత్‌లో 60 వేల మంది అఫ్గాన్ విద్యార్థులు వివిధ వర్సిటీల్లో విద్యనభ్యసిస్తుండగా..అందులో 10 వేల మంది విద్యార్థులు తెలంగాణలో చదువుతున్నారని, విద్యార్థులకు ఉత్తమ ఎంపిక గమ్యస్థానం కావడంతో రెండో కాన్సులేట్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య రూ.12 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని, ఇందులో మా దేశం కంటే ఇక్కడి నుంచి దిగుమతి చేసుకునే వాణిజ్యమే ఎక్కువగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో అఫ్గానిస్తాన్ కాన్సులేట్ జనరల్ ఇబ్రహీం ఖిల్, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు అనిల్ ఆగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు నామినేషన్లు



సాక్షి, సిటీబ్యూరో: మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి బుధవారం ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. లింగిడి వెంకటేశ్వర్లు, ఎస్.విజయ్‌కుమార్, కాంటే సాయన్నలు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలాకు అందజేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.

ప్రచారంలో బిజీ..

హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జేఎన్టీయూ మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వినయ్ బాబును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఉపాధ్యక్షులు సురేందర్, సికింద్రాబాద్ మండల బాధ్యులు సురేష్ తదితరులు పాల్గొన్నారు

ఖర్చు ఎక్కువైందని భార్యను వదిలేశాడు..

- ఓ ఎన్‌ఆర్‌ఐ యువకుడి అరాచకం
- పెళ్లయ్యాక అమెరికా వెళ్లిన యువ జంట
- వర్జీనియాలోని వర్సిటీలో ఎంఎస్‌లో చేరిన భార్య
- ఖర్చు ఎక్కువైందని ఆమెను వదిలేసిన వైనం..
- గచ్చిబౌలి మహిళా ఠాణాలో తల్లిదండ్రుల ఫిర్యాదు

సాక్షి, సిటీబ్యూరో: 'ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు' అంటారు. కానీ, ఓ ప్రవాస ప్రబుద్ధుడు భార్య చదువు ఆర్థిక భారంగా భావించాడు. ఉన్నత చదువులు చదివి..మంచి ఉద్యోగం సంపాదించి భర్తకు చేదోడుగా నిలుద్దామనుకున్న ఆమె కలలను కల్లలు చేశాడు. విదేశాల్లో ఒంటరిగా వదిలేసి..తాపీగా చేతులు దులుపేసుకున్నాడు. అల్లుడికి నచ్చచెబుదామని పలుమార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవటంతో.. దిక్కుతోచని స్థితిలో బాధితురాలి తల్లిదండ్రులు గచ్చిబౌలిలోని మహిళా పోలీసులను ఆశ్రయించారు. పూర్తి వివరాలు ఇలా..

- మాదాపూర్ జోన్‌కు చెందిన కావ్య (పేరు మార్చాం) స్థానికంగా డిగ్రీ పూర్తి చేసింది. దాదాపు ఐదేళ్ల క్రితం తల్లిదండ్రులు మ్యాట్రిమోని సైట్ల ద్వారా పెళ్లి సంబంధం వెతికి అమెరికాలో స్థిరపడిన కిషోర్ (పేరు మార్చాం)కు ఇచ్చి పెళ్లి చేశారు.
- కిషోర్ యూఎస్‌లోని వర్జీనియాలో ఉద్యోగి కావటంతో.. పెళ్లి తర్వాత ఈ యువ జంట అక్కడికి వెళ్లింది. కొన్నాళ్లు అన్యోన్యంగానే ఉన్నారు. మధ్య లో ఆపేసిన చదువును పూర్తి చేద్దామని భావించిన కావ్య అక్కడే ఓ యూనివర్సిటీలో ఎంఎస్‌లో చేరింది. దీంతో భర్త అసలు రంగు బయటపడింది.
- భార్య చదువు ఆర్థిక భారంగా మారిందని కిషోర్ తనని దూరం పెట్టడం మొదలుపెట్టాడు. దీనిపై ఇద్దరి మధ్య తగాదాలు మొదలయ్యాయి. ఈ విషయాన్ని ఇండియాలో ఉన్న తల్లిదండ్రులకు వివరించింది కావ్య. దీంతో పలుమార్లు ఫోన్‌లో అల్లుడితో మాట్లాడేందుకు ప్రయత్నించగా పట్టించుకోలేదు. అల్లుడి తల్లిదండ్రులను కలిసి వారి కొడుక్కి సర్దిచెప్పమని చెబుదామని ప్రయత్నిస్తే వారి నుంచి కూడా స్పందన లేదు. దీంతో చేసేదిలేక గచ్చిబౌలిలోని మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- కేసు నమోదు చేసిన పోలీసులు కిషోర్ తల్లిదండ్రులను విచారించగా.. వాళ్లిద్దరి మధ్య అవగాహన సరిగా లేదని చెప్పి చేతులు దులిపేసుకున్నారు. దీంతో విదేశంలో కూతురు ఒంటరైపోయిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎన్నారై సంబంధం ఇలా పెటాకులు కావటంతో అమ్మాయి చదువు, వసతి ఇతరత్రా ఖర్చులన్నీ తల్లిదండ్రులే భరిస్తున్నారు.

ఎన్నారై బంధానికి ఏడు సూత్రాలు:

- ఎన్నారైల ఎంపిక, పెళ్లి చేసే విషయంలో తొందరపడకూడదు.
- వరుడు/వధువు అతని కుటుంబ సభ్యుల నేపథ్యాన్ని ధ్రువీకరించుకోవాలి.
- మ్యారేజ్ బ్రోకర్లు, బ్యూరోలపై ఆధారపడి సంబంధాన్ని అంగీకరించకూడదు.
- ప్రవాసుల వివాహాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలి.
- విదేశాలలో చట్టపరమైన హక్కులు, అర్హతలు, అత్యవసర సేవల గురించి తెలుసుకోవాలి.
- వధువు వీసా, పాస్‌పోర్ట్, ఇతరత్రా ముఖ్యమైన కాపీలను వధువు కుటుంబం లేదా దగ్గరి స్నేహితుల వద్ద ఉంచాలి.
- ఎన్నారై వరుడి పాస్‌పోర్ట్, విదేశీయుల నమోదు కార్డు, సామాజిక భద్రత నంబరు, గత మూడు సంవత్సరాలకు సంబంధించిన పన్ను రిటర్న్‌లు, బ్యాంకు పత్రాలు వంటి కీలకమైన పత్రాలను తనిఖీ చేయాలి.

26న నగరంలో ఇళయరాజా ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సంగీత దర్శకుడు మేస్ట్రో ఇళయరాజా సంగీత ప్రదర్శన నగరంలో ఈ నెల 26న జరుగనుంది. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ హైదరాబాద్ టాకీస్ అండ్ మెర్క్యురీ ప్రతినిధులు తెలిపారు. దాదాపు ఐదు సంవత్సరాల తరువాత ఇళయరాజా తన మ్యూజిక్ షోలను తిరిగి నగరంలో జరిగే ప్రదర్శనతో పునః ప్రారంభించనుండడం విశేషం. గచ్చిబౌలి స్టేడియంలో సాయంత్రం 6.30 గంటల నుంచి ఇళయరాజా సంగీత ప్రదర్శన ఉంటుందని, పేటీఎం ఇన్‌సైడర్ వద్ద టికెట్లు లభిస్తాయని వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ లాస్ట్ చాన్స్ 10th, ఇంటర్, డిగ్రీ/PG, డిప్లమా, డైరెక్ట్ ఫైనలియర్ 100% పాస్ గ్యారంటీ తో పూర్తిచేసి ప్రభుత్వ ఉద్యోగాలు పొందండి. ఫైన్‌తో అడ్మిషన్స్ కలవు. ఫోన్ 6305979755 [H-792977]

ADMISSIONS

■ B.Tech, M.Tech, MBA, LLB, B.Sc., M.Sc., అగ్రికల్చర్, P.G. (all), P.Hd. few seats available. Cont. Cell : 9391471754, 8985533447. [M-8946]

FREE TRAINING

■ PRAISE THE LORD: పేద అమ్మాయిలకు HYD-కూకట్‌పల్లిలో ఫ్రీ-వసతితో HR+ మీడియా+ డిజిటమా..+ అకౌంట్స్+కంప్యూటర్‌లో 120డేస్ ట్రైనింగ్, తర్వాత వర్క్‌ఫ్రమ్ హోమ్ ఆదాయం, డిగ్రీ+ స్మార్ట్ ఫోన్ మస్ట్, ఫోన్ 9182242382. [HA-2416]

Real Estate

■ రీజనల్ రింగ్‌రోడ్డు, Hyd, L.B నగర్, ORRకు 24kmలో వాటర్, రోడ్స్ & క్లబ్ హౌస్ సౌకర్యం ఉన్న ఫామ్ ల్యాండ్స్ ఎకరం 41లక్షలు, 23లక్షలు, 12లక్షలు, 6లక్షలు స్పాట్ రిజిస్ట్రేషన్. 8331023138 [G-6415]

FARM LAND FOR SALE

■ SVT ఫాంల్యాండ్స్ & డెవలపర్స్ కేవలం 15లక్షలకే 1/2 అరఎకరము శ్రీగంధం మొక్కలతో మరియు 5సం॥లలో 10లక్షలు బై బ్యాక్ అగ్రిమెంట్, ఇది కేవలం మొదటి 50 మందికి మాత్రమే, త్వరపడండి, ఫోన్ : 9177619716 [HA-1015]

PLOT FOR SALE

■ 0% ఇంట్రెస్ట్‌తో 30 నెలల ఈక్వల్ EMIతో రాజాపూర్ దగ్గర అన్ని డేవలప్‌మెంట్స్‌తో 147 గజాల MUDA(HMDA) లేఅవుట్లో ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్. Ph: 9949695027 [HA-1022]

■ హైదరాబాద్ @ రామోజీఫిల్మ్‌సిటీ దగ్గర కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ & HMDA లాజిస్టిక్ హబ్ పక్కనే ఉన్న మాన్యూ HMDA వెంచర్‌లో ఇల్లు కట్టుకునే ప్లాట్లు కలవు. Ph: 9666645756 [HA-2404]

■ "గేటెడ్ కమ్యూనిటీలో Luxury 2BHK Flats 39.5L" (HYD కొర్రేముల), DTCP & శ్రీ గంధం ఫార్మ్ ప్లాట్స్ (ఆలేరు మున్సిపాలిటీలో) పంట్లన్ హోల్, కాంపౌండ్ వాల్ తో. Resort Membership Free. Ph: 9246548667 [H-778969]

■ విజయవాడ-హైదరాబాద్ హైవే చిట్యాల మున్సిపల్ 1వ వార్డు DTCP పుడమి వెంచర్ అఫ్‌టర్ 8000/- EMI 10,000 బైబ్యాక్ 12,500/- 1+1 ఆఫర్ 25×1,20,000/- ఫోన్: 9010406634. [H-796857]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మరియు ఏ ఇతర ఫైనాన్స్ లో ఉన్నా మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ఫోన్ : 9494995999 [H-787442]

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-792829]

BUSINESS OFFER

■ బ్రాయిలర్ కోళ్లు & నాటు కోళ్ల పెంపకం మరియు వాటి ఉత్పత్తి (Production) మెషినరీ విభాగంలో 1 లక్ష ఆపైన పెట్టుబడులు కావలెను. సంప్ర: 9441015276 [HA-13846]

CHITS & DEPOSITS

■ శ్రీరామ్ చిట్స్ 5L, 10L, 15L, 25L, 50L, 1Cr వరకు చిట్స్/డిపాజిట్స్ కలవు, 5L చిట్టి వారికి స్పాట్ గిఫ్ట్, యాదాద్రి 1 ఎకరం 35L-1Cr. వరకు అమ్మబడును, ఆల్ ప్లాట్స్ కలవు. ఫోన్ : 9948208005, 7815895825. [HA-1327]

HOME NEEDS

PEST CONTROL

■ చెదలు, బొద్దింకలు నివారణ, న్యూ కన్స్‌ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282 / 8333030227. [HA-10321]

PERSONAL CARE

OLD AGE HOME

■ మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd సంప్ర: 9949520296/7981467036/9346129997. [H-793513]

LOST

■ I, Lalitha Kunda W/o. Adura Lingarao. I lost my Original Passport No. T1126754 While Travelling From shapur to Jeedimetla on 15-12-2022 If Found please Call : 8686937335 [H-786839]

TOURS & TRAVELS

■ 01-03-2023 వారణాసి, అయోధ్య, చిత్రకూటం, నైమిశారణ్యం కురుక్షేత్రం, మధుర మొదలగు. AC - బస్, 10రో॥ భో॥వ॥తో, 22వేలు, భక్త సురేష్. Ph: 8897988391. [HA-13868]

■ మహర్షి యాత్రలు: 6/3 మహారాష్ట్ర 11రో., 3/4 గుజరాత్ మ.ప్ర. జ్యో.13రో.18వే., 18/4 నేపాల్ -ముక్తినాథ్, కాశి 18 రో. 18వే., 11/5 &25/5 & 10/6 చార్ధామ్ యాత్ర. 16 రో. 18 వే., శర్మ. ఫోన్: 8019821107 [G-6264]

Wanted

■ కూకట్‌పల్లి KPHB ఫేస్-4 ప్రముఖ హాస్పిటల్ నందు డే & నైట్ షిఫ్టుల కొరకు హౌస్ కీపింగ్ స్టాఫ్(స్త్రీలు) అర్జెంటుగా కావలెను. 8గం॥ డ్యూటీ, 4 వీక్లీ ఆఫ్స్, ESI, PF, + మంచి జీతం. సంప్ర: Ph: 9000888154, 9032153413 [H-793372]

■ హైటెక్ సిటీ హైటెక్స్‌లో గల మా కంపెనీకి సెక్యూరిటీ గార్డ్స్, సూపర్ వైజర్స్, కావలెను 8 గంటలు జీతం: 12,000/- మరియు 13,500/-. సంప్ర: Ph: 9246355129, 8096360669. [H-793569]

■ నల్లకుంటలో గల మా ఆఫీసులో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేయుటకు అనుభవం గల అభ్యర్థులు కావలెను, జీతం: 20,000/- ఇవ్వబడును. Ph: 9701238229 [H-793570]

■ ఇంటిపని, బేబీకేర్, పేషెంట్‌కేర్, వంటపని, హౌస్‌బాయ్ Salary 15K to 20K రూం+ఫుడ్, లీవ్, బోనస్ 8hrs, 10hrs, 12hrs. Ph: 9160002193, 9160002192 [H-796807]

■ టోలిచౌకిలోని ప్రముఖ కంపెనీ కొరకు కట్టింగ్, ప్యాకింగ్ హెల్పర్స్ (స్త్రీలు మాత్రమే) కావలెను. జీతం: 9గం -9000/-, 12గం -12000/-, సంప్ర: 9951629777, 9059423396 [HA-13869]

■ లేడీస్ & జెంట్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, డిస్ట్రిబ్యూటర్స్ అన్ని ఏరియాలలో AP & TS వెంటనే కావలెను. ఫుల్‌టైం/పార్ట్‌టైం, జీ॥ 1 లక్ష ఆపైన Ph: 7901373777/ 9440724418 [H-792831]

■ సికింద్రాబాద్, గచ్చిబౌలి, కొంపల్లి, జూబ్లీహిల్స్, యాదాద్రిలలో అర్జెంటుగా సెక్యూరిటీ సెక్యూరిటీ గార్డులు కావలెను. రూం+భోజనం + ESI + PF కలవు. Ph: 9398915299, 8639110999. [HA-10325]

■ ప్రముఖ లేడీస్ హాస్టల్ నందు పని చేయుటకు భార్యాభర్తలు మరియు ఆడ పని మనుషులు కావలెను. మంచి జీతం + భోజన వసతి కలదు. Ph: 9866669424 [HA-10324]

■ ప్రముఖ టాక్సీ కంపెనీలో వెంటనే చేరండి. హైదరాబాద్ అంతటా పని చేయుటకు కావలెను. ఆటోమెటిక్ కార్ ప్రాబ్లమ్ ఉండదు. జీతం: 17,600 - 20,000 P/M + కుటుంబానికి ప్రైవేట్ ఇన్సూరెన్స్ + పిల్లల చదువు కోసం చేయూత ఉంటుంది. సంప్ర: 040-49170007. [QA-1732]

■ హాస్పిటల్ క్యాంటీన్‌లో పనిచేయుటకు బాయ్స్ కావలెను. జీతం: 10వేలవరకు, ఉచిత వసతి+ భోజనం, వివేకానంద హాస్పిటల్ క్యాంటీన్ CM క్యాంప్ ఆఫీస్ ప్రక్కన, సోమాజిగూడ ఫోన్: 9247192984 [H-786838]

■ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో పని చేయుటకు బ్రాహ్మణ వంట మనిషి ఆయాలు వార్డ్ బాయ్స్ కావలెను. మంచి జీతం, ఉచిత వసతి భోజన సౌకర్యం. ఫోన్: 9246241153 / 9246201153. [H-778972]

■ టిఫిన్ సెంటర్‌లో స్టాల్ బాయ్స్, కూరగాయల కటింగ్ మాస్టర్స్, టీ మాస్టర్స్, స్టాల్ సూపర్వైజర్ కావలెను, ఇక్కడే ఉండి చేసుకునే వారికి వసతి+భోజనం, మంచి జీతం కలదు 9666934949, 7330608776. [H-793566]

■ స్త్రీ/పురుష సెక్యూరిటీ గార్డ్స్ ASO, SO, నైట్ సెక్యూరిటీ గార్డ్స్, ఆఫీస్ బాయ్స్, హౌస్‌కీపింగ్, డ్రైవర్స్, బౌన్సర్స్, Ex-ఆర్మీ, 8గం॥ - 13వేలు - 30వేలు, అర్హత బట్టి జాబ్, All ఏరియాస్ సంప్ర: 8885537007. [HA-1326]

■ ఇంటర్ BiPC టూ పన్‌ డీస్ ల్యాబ్స్ BE, B.Tech., M.Tech, MBBS, MBA (పాస్/ఫేల్), టి.ఆ. DTP డాటా ఎంట్రీ, రిపోర్టర్లు, యాంకర్లు, ఆర్టిస్ట్స్, సూపర్వైజర్ హెల్పర్స్, డ్రైవర్లు జీ. 10-25K+ ఫ్రీ హాస్టల్ @ 9505261777. [H-792936]

■ ప్రహస్య బేబీకేర్ పిల్లలను చూడటానికి, పెద్దలకు సేవ చేయటానికి మహిళలు కావలెను. 12 Hrs or 24 Hrs, హైదరాబాద్. ఫోన్ : 9533909627, 8125784389. [H-787377]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781833]

■ Wanted Experienced Sales man for Kidswear Store @ Jubilee Hills, Salary based on Exp. (18000 + Incentive) Call / Send resume on 7075566775. [HA-09676]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
అమీర్‌పేట	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	షమ్షాబాద్	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు: 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

ఉస్మానియాలో బేరియాట్రిక్ సర్జరీ విజయవంతం

అఫ్జల్‌గంజ్: స్థూలకాయంతో బాధపడుతున్న ఓ యువకుడికి ఉస్మానియా ఆస్పత్రిలో బేరియాట్రిక్ శస్త్ర చికిత్స ద్వారా పునర్జన్మను ప్రసాదించారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో లక్షలాది రూపాయలు ఖర్చయ్యే ఈ చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ బి నాగేందర్, వైద్యులు సీహెచ్ మధుసూదన్ (సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ), పాండూ నాయక్ (అనస్థీషియా), రాకేష్ సహాయ్ రు(ఎండోక్రైనాలజీ) ఇతర వైద్యాధికారులతో కలిసి వివరాలు వెల్లడించారు. గుడిమల్కాపూర్ మహేష్ నగర్ కాలనీకి చెందిన శివ్ రాజ్‌సింగ్ కుమారుడు మునీందర్‌సింగ్ (23) ఐదేళ్ల ప్రాయం నుండి ఊబకాయంతో బాధపడుతున్నాడు. రెండు నెలల క్రితం కుటుంబ సభ్యులు అతడ్ని ఉస్మానియాకు తీసుకురాగా..వైద్యులు పరీక్షించి ఇటీవలే బేరియాట్రిక్ సర్జరీ నిర్వహించారు. ఆస్పత్రిలో చేరినప్పుడు సుమారు 220 కిలోల బరువున్న అతని శరీరంలో నుండి కొవ్వు తొలగించడంతో పాటు చిన్న పేగును కత్తిరించి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం 70 కిలోల బరువు తగ్గి ఆరోగ్యం మెరుగైందని వైద్యులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ నాగేందర్

నగరంలో సందడి చేసిన ఇంటర్నేషనల్ మేకప్ ఆర్టిస్ట్ జేమ్స్ మ్యాక్

బంజారాహిల్స్: నగరంలోని అలియా బేగ్ అకాడమీ ఆఫ్ మేకప్‌కు అంతర్జాతీయ సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ జేమ్స్ మ్యాక్ ఇనర్షెనీ గెస్ట్ ఫాకల్టీగా నియమితులయ్యారు. బుధవారం బంజారాహిల్స్‌లోని అకాడమీలో ఏర్పాటు చేసిన మేకప్ శిక్షణ కార్యక్రమంలో అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా జేమ్స్ మాక్ మాట్లాడుతూ..తనకు హైద్రాబాద్ అంటే చాలా ఇష్టమని, ఇక్కడి బిర్యానీ రుచులకు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారని పేర్కొన్నారు. ఇక్కడి మేకప్ విద్యార్థులకు శిక్షణ అందించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పక్షి పాల పిట్ట డిజైన్‌ను విదేశీ మోడల్ మోముపైన చిత్రీకరించి అందరినీ ఆకట్టుకున్నారు.



బంజారాహిల్స్‌లోని అలియా బేగ్ అకాడమీలో జేమ్స్ మ్యాక్

మంత్రి కేటీఆర్‌కు పెయింటింగ్ అందజేత



పెయింటింగ్‌ను మంత్రి కేటీఆర్‌కు అందచేస్తున్న లక్ష్మణ్‌రావు గౌడ్

హిమాయత్‌నగర్: గీత వృత్తిదారులైన గౌడల జీవన ఇతివృత్తంతో కూడిన ఓ పెయింటింగ్‌ను తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు, గౌడ హాస్టల్ అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్ రావుగౌడ్ సేకరించి బుధవారం మంత్రి కేటీఆర్‌కు ప్రగతిభవన్‌లో అందచేశారు. తాటి, ఈత చెట్ల నుంచి కల్లు సేకరించడంలో ఏర్పడిన పరిణామ క్రమాన్ని 1950లో సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన చిత్రకారుడు వైకుంఠం క్లాత్‌పై అద్భుతంగా గీశాడు. దీన్ని గౌడ హాస్టల్ నిర్మించిన తర్వాత అక్కడే భద్రపరిచారు. ఆ తర్వాత 2006లో లక్ష్మణ్ రావు హాస్టల్ అధ్యక్షునిగా గెలుపొందడంతో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాజలింగం పెయింటింగ్‌ను ఆయనకు అందచేశారు. తాజాగా లక్ష్మణ్‌రావుగౌడ్ అదే పెయింటింగ్‌ను ఫొటో ఫ్రేమ్‌గా తయారు చేసి మంత్రి కేటీఆర్‌కు బహుమతిగా ఇచ్చారు.

వారసత్వ బావి పునరుద్ధరణ

- సుమారు 200 సంవత్సరాల నాటి మెట్ల బావికి జీవం పోసిన ద.మ.రైల్వే
- రోజుకు లక్ష లీటర్ల నీటిని అందిస్తున్న వైనం..

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని మౌలాలీలోని జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్న సుమారు రెండు వందల ఏళ్ల నాటి వారసత్వ బావిని దక్షిణ మధ్య రైల్వే పునరుద్ధరించింది. ఐదు దశాబ్దాలుగా బావి జోనల్ రైల్వే శిక్షణ సంస్థ నీటి అవసరాలను తీరుస్తోంది. దాదాపు రూ.6 లక్షల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. సుమారుగా రూ.5 లక్షల వరకు గణనీయంగా ఆదా అవుతుందని అంచనా. దాదాపు 50 అడుగుల లోతు ఉన్న ఈ హెరిటేజ్ బావి రోజుకు లక్ష లీటర్ల నీటిని సూపర్‌వైజర్స్ ట్రైనింగ్ సెంటర్, టెరిటోరియల్ క్యాంప్ ఆఫీస్‌లకు నీటి అవసరాలకు అందిస్తోంది. చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్‌ల ద్వారా ఇవి వర్షపు నీటి ప్రవాహాన్ని తగ్గించడానికి, నీటి సంరక్షణను సులభతరం చేయడానికి ఉపయోగపడుతోంది.

చారిత్రక ప్రాముఖ్యత

ఈ వారసత్వ ఓపెన్ బావిని మెట్లతో ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం కాలంనాటి ఈ బావికి చారిత్రక ప్రాధాన్యం ఉంది. సర్ మీర్ తురాబ్ అలీ ఖాన్, సాలార్ జంగ్ (1829-1883) హైదరాబాద్‌కు ఒక గొప్ప ప్రధాన మంత్రి. అతను మామిడి తోటలకు కావాల్సిన నీటికోసం ఈ బావిని ఉపయోగించాడు. నీటిపారుదల సిబ్బంది నివాసం కోసం, బావికి ఉత్తరం వైపు గోడకు సమాంతరంగా 10 గదులను నిజాంలు నిర్మించారు. స్వాతంత్ర్యానంతర 1966 సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు అయినందున ఈ బావిని వారసత్వంగా పొందింది.

నైలాన్ మెష్‌తో..

తాజాగా బావిని నైలాన్ మెష్‌తో కప్పారు. ఇది నీటిలో ఆకులు లేదా ఇతర పదార్థాలు పడకుండా చేయడం ద్వారా నీటిని శుభ్రంగా ఉంచడంలో తోడ్పడుతోంది. నీటిని పంపింగ్ చేసేటప్పుడు, కలుషితం కాని నీటి సరఫరా చేసేందుకు మాన్యువల్‌గా క్లోరినేషన్ కూడా చేసేందుకు కూడా ఉపయోగపడుతుంది. ఈ వారసత్వ బావి వద్ద తాజా పెయింటింగ్‌ను ఉంచి ఎల్‌ఈడీ లైటింగ్‌లతో సుందరీకరించారు .

అభినందన

వారసత్వ మెట్ల బావి పునరుద్ధరణ కోసం హైదరాబాద్ డివిజన్, జెడ్‌ఆర్‌టీఐ చేపట్టిన చొరవను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అభినందించారు. దక్షిణ మధ్య రైల్వే పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉందని, ఈ విషయంలో అనేక హరిత కార్యక్రమాలు, పర్యావరణ అనుకూల కార్యాచరణ ప్రణాళికలను నిరంతరం అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు.



వెంటపడి దాడి చేస్తున్నాయ్!

- బంజారాహిల్స్‌లో వీధి కుక్కల స్వైరవిహారం
- రోడ్లపై తిష్టవేసి పాదచారులపై దాడి
- ఫిర్యాదు చేసినా పట్టికోని జీహెచ్‌ఎంసీ అధికారులు



బంజారాహిల్స్‌లో కరవడానికి వస్తున్న కుక్కలను తరుముతున్న బాటసారి



ఎమ్మెల్యే కాలనీలో రోడ్లపై తిరుగుతున్న కుక్కలు

బంజారాహిల్స్: ఒకట్రెండు కాదు... 50కిపైగా వీధి కుక్కలు అక్కడ తిష్ట వేస్తున్నాయి.. దారినిపోయే వారి వెంటపడి మరీ దాడి చేస్తున్నాయి. .దీంతో రాత్రి వేళల్లోనే కాదు.. పట్టపగలు కూడా ఆ మార్గంలో నడిచి వెళ్లేందుకు జనం జంకుతున్నారు. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎమ్మెల్యే కాలనీ చర్చి రోడ్డులో ఈ పరిస్థితి నెలకొని ఉంది. జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా ఊర కుక్కల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

- బంజారాహిల్స్ రోడ్ నం 2లోని ఇందిరానగర్‌లో అమృత్‌బార్ వీధి, రాజీవ్‌గాంధీ విగ్రహం వీధుల్లో పాతికకుపైగా వీధి కుక్కలు స్థానికులకు నిత్యం చుక్కలు చూపిస్తున్నాయి.
- భౌ.భౌ మంటూ కుక్కలు అరుస్తుండటంతో తమకు కంటిమీద కునుకు లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఏసీబీ కార్యాలయం ముందు గ్రామసింహాల బెడద తీవ్రంగా ఉంది. తమ కార్యాలయం ముందు కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, వాటిని నియంత్రించాలని ఏసీబీ అధికారులు పలుమార్లు జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయిందని తెలిసింది.
- ఎన్టీఆర్ భవన్ వెనుక వీధిలో కుక్కల విపరీతంగా పెరిగిపోయాయి. విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్తున్న వారి వెంటపడి కరిచేందుకు యత్నిస్తున్నాయని స్థానిక బీఆర్‌ఎస్ నేత డి.సింహం ఆరోపించారు. 25 సార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.
- జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని సర్కిల్-17, సర్కిల్-18 పరిధిలోని వీధి కుక్కల బెడద తీవ్ర రూపంగా ఉంది. కుక్కలను పట్టుకునే వాహనాలు తూతూ మంత్రంగా తిరుగుతున్నాయి తప్పితే వాటిని పట్టుకున్న దాఖలాలు లేవు.
- ప్రతినెలా వీధి కుక్కలను పట్టుకోవడం, వాటి నియంత్రణ కోసం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలో లక్షలాది రూపాయలు ఖర్చు పెడుతున్నా ఉపయోగం లేకుండాపోతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఖైరతాబాద్ జోన్ పరిధిలో సుమారు 25 వేలకుపైగా కుక్కలు ఉన్నాయని సంబంధిత విభాగం రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఒక్క జోన్ పరిధిలోనే కుక్కల బెడద తీవ్రంగా ఉందని గతంలోనే పలుమార్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి.
- జీహెచ్‌ఎంసీ వెటర్నరీ విభాగం సిబ్బంది కుక్కలను పట్టుకొని, వాటికి వ్యాక్సిన్లు వేసి వ్యాసెక్టమీ ఆపరేషన్లు చేస్తున్నారు. తర్వాత వాటిని ఎక్కడి నుంచి పట్టుకెళ్లారో అక్కడికే తీసుకొచ్చి వదిలేస్తుండటం వల్ల సమస్య మరింత తీవ్రంగా మారుతోంది.

సింహ వాహనంపై శ్రీవారు



సింహ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

బంజారాహిల్స్: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన గురువారం స్వామివారు సింహ వాహనంపై యోగ నృసింహుడిగా మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాయకుడి అవతారంలో నాల్గోది నృసింహావతారం. దుష్ట జన శిక్షణ, శిష్టజన రక్షణకు సింహ వాహనం ప్రతీతి అని అర్చకులు తెలిపారు. సింహ వాహన సేవలో నగర నలుమూలల నుంచి వచ్చిన శ్రీవారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా స్వామివారు ముత్యపు పందిరి వాహనంలో ఊరేగారు. అంతకు ముందు తెల్లవారుజామున సుప్రభాతం తోమాల అర్చన అంగరంగ వైభవంగా నిర్వహించారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు రూ.12.50 లక్షల విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న నర్సింగ్ క్లాత్ ఎంపోరియం ఎండీ సంజయ్ సింఘానియా

బంజారాహిల్స్: హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ సేవా కార్యక్రమాలకు తమ వంతు మద్దతుగా నగరంలోని ప్రఖ్యాత వ్యాపార సంస్థ శ్రీనర్సింగ్ క్లాత్ ఎంపోరియం ముందుకు వచ్చింది. బుధవారం బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ మూవ్‌మెంట్ స్వర్ణ దేవాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్సింగ్ క్లాత్ ఎంపోరియం ఎండీ సంజయ్ సింఘానియా, డైరెక్టర్ రవికాంత్ సింఘానియా, హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీకి రూ.12.50 లక్షల చెక్కును అందజేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అనేది ఇస్కాన్ బెంగళూరు మార్గదర్శనంలో నడిచే ఒక పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ అని, ఇది కృష్ణ చైతన్యాన్ని అందరికీ వ్యాప్తి చేయడంతో పాటు తన అనుబంధ ట్రస్టులతో కలిసి తెలంగాణలో ప్రతిరోజూ లక్షలాది మందికి వివిధ పథకాల ద్వారా ఉచితంగా ఆహారం అందిస్తోందని, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని సత్యగౌర చంద్రదాస తెలిపారు. ఈ సంస్థ చేస్తున్న సేవలకు ఆకర్షితులమై ఈ విరాళాన్ని అందించినట్లు సింఘానియా తెలిపారు.

క్లుప్తంగా

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

లిబర్టీ: గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని భారతీయ ధార్మిక సేవా సమితి అధ్యక్షుడు కేవీఎస్ శర్మ ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనాధిగా భారతీయ సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం గోవును భారతీయులు పూజిస్తున్నారని గుర్తు చేశారు. భారతీయ ధార్మిక సేవా సమితి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గోవును జాతీయ ప్రాణిగా గుర్తిస్తున్నట్టు పార్లమెంట్ సమావేశాల్లో ప్రధానమంత్రి అధికారికంగా గుర్తిస్తున్నట్టు ప్రకటించడంతో పాటు చట్టం చేయాలని కేవీఎస్ శర్మ కోరారు.

నేటి నుంచి ఎఫ్‌ఎన్‌సీసీలో కంటి వెలుగు శిబిరం



కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేసే హాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఫిలింనగర్: స్థానిక ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్‌ఎన్‌సీసీ)లో కంటి వెలుగు శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ అధికారులు తలపెట్టారు. ఇందులో భాగంగా బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ కార్తీక్, జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకటేష్ బుధవారం ఎఫ్‌ఎన్‌సీసీలో కంటి వెలుగు శిబిరం ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం నుంచి వారం రోజుల పాటు ఇక్కడ నిర్వహించే శిబిరంలో ఎఫ్‌ఎన్‌సీసీలో పని చేసే 300లకుపైగా ఉద్యోగులతో పాటు కల్చరల్ సెంటర్ సభ్యులు పరీక్షలు చేయించుకుంటారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎన్‌సీసీ కార్యదర్శి ముళ్లపూడి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలి

లిబర్టీ: అంబర్‌పేటలో వీధి కుక్కల దాడిలో మృతి చెందిన చిన్నారి ప్రదీప్ కుటుంబానికి రూ. పది లక్షల పరిహారం, జీహెచ్‌ఎంసీలో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం లిబర్టీ వద్ద ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, నాలుగేళ్ల ప్రదీప్‌ను వీధి కుక్కలు చంపిన దారుణ ఘటన అందరినీ తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఈ ఘటనకు జీహెచ్‌ఎంసీ బాధ్యత వహించాలని, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ స్పందించి చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని సుధాకర్ డిమాండ్ చేశారు.

ఆత్మీయ సత్కారం



విజయసాయిరెడ్డిని సన్మానిస్తున్న ఆదినారాయణ

లిబర్టీ: రాజ్యసభలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడు విజయసాయిరెడ్డిని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో ఆత్మీయ సత్కారం చేసి అభినందించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అమలు చేయాల్సిన హామీల విషయాన్ని విజయసాయిరెడ్డి రాజ్యసభలో ఎప్పటికప్పుడు లేవనెత్తుతూ కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారని ఈ సందర్భంగా ఆదినారాయణ అన్నారు. ఏపీ అభివృద్ధి కోసం కేంద్ర స్థాయిలో విజయసాయిరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం .14లోని వెంకటేశ్వరనగర్ బస్తీలో బుధవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులన్నీ కాలిపోయాయి. ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... వెంకటేశ్వరనగర్ బస్తీకి చెందిన శాస్త్రి పెయింటర్‌గా పని చేస్తుంటాడు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం విధులకు వెళ్లిపోయాడు. మధ్యాహ్నం ఒంటి గంటకు అతడి ఇంటి నుంచి పొగలు వస్తుండగా స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, అప్పటికే ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిడ్జ్‌తో పాటు రూ.1.80 లక్షల నగదు, సర్టిఫికెట్లు, ఇంటి పత్రాలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు.

ఫంక్షన్ హాల్ పనుల పరిశీలన

రహమత్‌నగర్: పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 ఎస్‌ఈ శంకర్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. హెచ్‌ఎఫ్‌నగర్ క్వారీలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులను ఆయన గురువారం ఈఈ రాజ్ కుమార్, డీఈ శ్రీరాములు, ఏఈ జమీల్‌తో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్సూర్, హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్-2 బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గనీ, జబ్బార్‌ఖాన్ పాల్గొన్నారు.

మాతృభాషలోనే ప్రాథమిక విద్యాభ్యాసం జరగాలి



డాక్టర్ నర్సయ్యను సత్కరిస్తున్న వీసీ సీతారామారావు తదితరులు

ఫిలింనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మహిళా అభివృద్ధి, విస్తరణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సంగనభట్ల నర్సయ్య «మాతృభాషా కమనీయం- విద్యాసాధన రమణీయం« అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. విద్యార్థి మనో వికాసానికి సమగ్ర అధ్యయనానికి మాతృభాష ప్రధాన భూమిక పోషిస్తుందని అన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసం తప్పనిసరిగా మాతృభాషలోనే జరగాల్సిన ఆవశ్యకతను వివరించారు. తెలుగు భాషను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం భాషా ప్రియులు, యువత, ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సీతారామారావు, ప్రొఫెసర సుధారాణి, డాక్టర్ జి.మేరి సునంద, ప్రొఫెసర్లు షకీలాభానం, ఆనంద్ పవార్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

వెంగళరావునగర్: ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని, పరీక్షలను దృష్టిలో పెట్టుకుని మరింత క్రమశిక్షణతో చదవాలని యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం నర్సింహా విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్వశిక్షా అభియాన్ పథకంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు బుధవారం నుంచి అల్పాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదో తరగతి చదివే ప్రతి విద్యార్థికి అల్పాహారం కోసం ప్రభుత్వం రూ.15 అందిస్తున్నదని, 40 రోజుల పాటు విద్యార్థులకు టిఫిన్స్ ఇస్తామని చెప్పారు. ఈ ఏడాది తమ పాఠశాల నుంచి 120 విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పలువులు టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల దశ నుంచే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ శంకర్ రాజు తదితరులు

పంజగుట్ట: పిల్లలు పాఠశాల దశ నుంచే ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. సోమాజిగూడలోని జిక్రా హైస్కూల్‌లో బుధవారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జ్యోతితో కలిసి ఆయన మాట్లాడుతూ... మైనర్లు డ్రైవింగ్ చేస్తే వారికి జరిమానా వేయడంతో పాటు వాహన యజమానిపై కేసు కూడా నమోదువుతుందని తెలిపారు. స్టాప్‌లైన్, రాంగ్ రూట్, త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల కలిగే నష్టాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చూపించారు. హెడ్ కానిస్టేబుల్ పద్మావతి, సిబ్బంది మాజిద్ ఖాన్, చిరంజీవి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బ్లాక్ ఫిలిం అద్దాల వాహనాలపై కేసులు



బంజారాహిల్స్ రోడ్ నం.12లో కేసులు నమోదు చేస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: కారు అద్దాలకు బ్లాక్ ఫిలిం అమర్చిన వాహనదారులపై బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. బుధవారం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 30 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశామని బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. అలాగే, నంబర్ ప్లేట్ సరిగ్గా లేని వాహనదారులు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్న వారి వాహనాలను సీజ్ చేసి కౌన్సెలింగ్ అనంతరమే వారికి తిరిగి ఇస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభం

రాంగోపాల్‌పేట్: నేడు ప్రభుత్వ ఉద్యోగాలు అందని ద్రాక్షలా మారాయని.. అవి కేవలం 3 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి, గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ, లాస్య ఇన్ఫోటెక్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. గ్రూప్ 4 అభ్యర్థులకు ఈ శిక్షణఇస్తారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. నిరంతరం ఆకాశమే హద్దుగా ప్రయత్నం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో కొర్వి కృష్ణ స్వామి ముదిరాజ్ సేవా సమితి అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్, లాస్య ఇన్ఫోటెక్ ఎండీ ఓరుకంటి వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా శాంతి దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న స్కౌట్స్ విద్యార్థులు

ఫిలింనగర్: స్కౌట్స్ వ్యవస్థాపకుడు లార్డ్ బెడెన్ పావెల్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్రపంచ శాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ వి.లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ, ప్రతియేటా లార్డ్ బెడెన్ పావెల్ పుట్టిన రోజు సందర్భంగా శాంతి దినోత్సవంతో పాటు థింకింగ్ డే కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నదన్నారు. అనంతరం పావెల్ చిత్రపటానికి విద్యార్థులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి



జోడో యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, వీహెచ్

రహమత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలిచే పార్టీ అని రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుమంతరావు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన హాత్‌సే హాత్ జోడో యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతమైందని, తెలంగాణలో చేపట్టిన హాత్‌సే హాత్ జోడో యాత్ర కూడా విజయవంతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌హిల్స్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టంగా ఉందని, రాబోయే ఎన్నికల వరకు మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు కోరారు. పేదల పక్షపాతిగా పేరున్న పీజేఆర్ నేటికీ ప్రజల్లో గుర్తుండి పోయారని కొనియాడారు. రాష్ట్ర నాయకుడు నిరంజన్, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, యూత్ కాంగ్రెస్ నాయకుడు అభిషేక్, ఓబీసీ చైర్మన్ శ్రీకాంత్, మెనారిటీ చైర్మన్ సోహైల్, డాక్టర్ రోహిత్‌రెడ్డి, కోటంరెడ్డి వినయ్‌రెడ్డి, నగర నాయకులు భవాని శంకర్, ఖదీర్, లియాకత్ అలీ, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుశీల్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి



మేయర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రహమత్‌నగర్: ట్యాంక్ బాండ్‌పై రమాబాయి విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గుడిమల్లే వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం నగర మేయర్ విజయలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. తమ వినతికి మేయర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. కార్యక్రమంలో షెడ్యూలు కులాల హక్కుల పరిరక్షణ సమితి ఉపాధ్యక్షుడు ఎం .ప్రభాకర్, జేఎంబీబీ సెక్రటరీ మోహన్, అంబేడ్కర్ విగ్రహ పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి యాదగిరి, బోరబండ డివిజన్ అధ్యక్షుడు బొట్టు శివ, కార్యదర్శి దశరథ్ పాల్గొన్నారు.

కార్నర్ మీటింగ్‌లకు విశేష స్పందన

రహమత్‌నగర్: బీజేపీ చేపడుతున్న కార్నర్ పాయింట్ మీటింగ్‌లకు ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారని బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ హర్షం వ్యక్తం చేశారు. బోరబండ డివిజన్ సైట్-3 బ్రాహ్మణవాడిలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్నస్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నగరంలో బీజేపీ బలపడుతున్నదని, రాబోయే ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధించడం ఖాయమన్నారు. శక్తి కేంద్ర అధ్యక్షుడు రాజేందర్, నాయకులు లంకాల దీపక్‌రెడ్డి, కుంభాల గంగరాజు, ప్రేమ్, కృష్ణమోహన్, కుమార్ నాయక్, శరణ్ రెడ్డి, మధు పాల్గొన్నారు.

ఆకాశ రామన్న ఉత్తరాలతో బిల్డర్‌కు బ్లాక్‌మెయిల్

- ఇద్దరు నిందితుల అరెస్టు
- పరారీలో ప్రధాన నిందితుడు

బంజారాహిల్స్: ప్రముఖ బిల్డర్‌కు ఆకాశ రామన్న ఉత్తరాలు రాయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న వ్యవహారంలో ఇద్దరు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటున్న ప్రముఖ బిల్డర్‌కు జూబ్లీహిల్స్ రోడ్ నం. 46లో ఉంటున్న పీసీహెచ్ ఈజోన్ సంస్థ అధినేత బల్విందర్ సింగ్ పదేళ్ల క్రితం ఓ స్థలాన్ని డెవలప్‌మెంట్ కోసం ఇచ్చాడు. ఆ స్థలంలో ఐదేళ్ల క్రితమే భవన నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. కాగా తనకు రావాల్సిన మొత్తానికంటే సుమారు ఐదు కోట్లు అదనంగా ఇవ్వాలని బల్విందర్ సింగ్ పలుమార్లు బిల్డర్‌ను డిమాండ్ చేశాడు. ఒప్పందం ప్రకారం... తాను మొత్తం డబ్బులు చెల్లించానని అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదని బిల్డర్ చెబుతూ వస్తున్నాడు. దీనిని మనసులో పెట్టుకున్న బల్విందర్ సింగ్ బ్లాక్‌మెయిల్ చేసి కక్ష సాధించాలని కుట్రకు తెరలేపాడు. బిల్డర్ కార్యాలయంలో పని చేసే ఓ యువతి(30) పేరుతో ఆకాశ రామన్న ఉత్తరాన్ని తయారు చేశాడు. బిల్డర్ తనను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని, అతడిపై అత్యాచారం కేసు నమోదు చేయాలని ఆ లేఖలో కోరారు. లేఖ ప్రతులను రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ ప్రముఖులు, పోలీసు ఉన్నతాధికారులు, మంత్రులు, రియల్ ఎస్టేట్ సంస్థల అధినేతలకు పంపాడు. ఈ లేఖలను పంపించే పనిని తన వ్యక్తిగత పనులు నిర్వహించే బాగ్‌లింగంపల్లికి చెందిన ప్రకాశ్ (39)కు, మైసూర్‌లో పని చేసే మరో ఉద్యోగి నరేందర్(40)కు అప్పగించాడు. ఈ మేరకు లేఖలు తయారు చేసిన ప్రకాశ్ వాటిని మైసూర్‌లో ఉండే నరేందర్‌కు కొరియర్ చేశాడు. అక్కడి నుంచి పలువురికి పోస్ట్ ద్వారా ఆ లేఖలను పంపించారు. వాటిని అందుకున్న కొంతమంది స్నేహితులు ఈ విషయం గురించి చెప్పడంతో సదరు బిల్డర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులు బల్విందర్ సింగ్, నరేందర్, ప్రకాశ్‌లపై ఐపీసీ 419, 469, 389 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు బల్విందర్ సింగ్ పరారీలో ఉండగా, నరేందర్, ప్రకాశ్‌లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తన పేరును దుర్వినియోగం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని యువతి కూడా ఇటీవల ఫిర్యాదు చేయడంతో మరో కేసు నమోదైంది.

'నువ్వే కావాలి అమ్మ' పాట విడుదల



సాక్షి, సిటీబ్యూరో: నటి ఆమని, నటుడు మానస్ తల్లీ కొడుకులుగా 'నువ్వే కావాలి అమ్మ..' అనే పాటలో నటించారు. నివృతి వైబ్స్ బ్యానర్‌పై జ్యోతి కున్నూరు నిర్మించిన ఈ పాటకు సందీప్ సన్ను దర్శకత్వం వహించగా, రంజిత్ కుమార్ రిక్కీ సాహిత్యం, మానీస్ కుమార్ కల్ల సంగీతం అందించారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్‌ల్యాబ్‌లో జరిగిన కార్యక్రమంలో 'మా' ఈసీ మెంబర్ శైలజ, నటి ఆమని, పద్మిని నాగులపల్లి, జ్యోతి కున్నూరు కలిసి 'నువ్వే కావాలి అమ్మ..' పాటను నివృతి వైబ్స్ యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేశారు. 'ఫిల్మ్ ఛాంబర్' ప్రెసిడెంట్ బసిరెడ్డి, నిర్మాత బెక్కం వేణుగోపాల్, మ్యూజిక్ డైరెక్టర్స్ రఘు కుంచె, నటులు మాదాల రవి, సుధాకర్, రచయితలు రంజిత్ కుమార్ రిక్కీ, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు చేపట్టాలి

వెంగళరావునగర్: డివిజనల్ గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పనులను తక్షణమే చేపట్టాలని కార్పొరేటర్ దేదీప్య విజయ్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. బుధవారం ఆమె జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 కార్యాలయానికి వెళ్లి వివిధ సమస్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ, యూసుఫ్‌గూడ నుంచి రహమత్‌నగర్ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో రోజురోజుకూ జాప్యం జరుగుతోందని, అన్ని రకాల ఎస్టిమేట్లు పూర్తయినా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. రహమత్‌నగర్ జంక్షన్ వెడల్పు, వైకుంఠధామం, మోడల్ మార్కెట్ నిర్మాణం వంటి పనులను సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని అన్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ ఎ.రమేష్, ఎస్‌ఈ శంకర్ నాయక్, ఈఈ రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఫిలింనగర్: విద్యార్థులకు అనేక నైపుణ్యాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో బుధవారం జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ 8వ తరగతి విద్యార్థులకు విపత్తు నిర్వహణ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు, వాటి నష్టాల గురించి ప్రదర్శన ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదాలు నివారించడానికి ఉపయోగించే వివిధ పరికరాలు, స్టాప్ డ్రాప్ రోల్ యాంత్రిక పద్ధతుల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (విపత్తు నిర్వహణ దళం) అధికారి ప్రకాశ్ రెడ్డి ప్రమాదాలు జరిగినప్పుడు తమ సిబ్బంది ఎలా జాగ్రత్తలు తీసుకుంటారు, కాపాడతారు అనేది వివరించారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ ప్రెసిడెంట్ కె.కృష్ణ దేవ్‌రావు, చైర్మన్ ఎ.మురళీ ముకుంద్, శ్రవణ్‌కుమార్, పి.కాంచనవల్లి పాల్గొన్నారు.

స్టూడియో ముసుగులో స్పా, మసాజ్ సెంటర్ నిర్వహణ

సనత్‌నగర్: స్టూడియో ముసుగులో స్పా, మసాజ్ సెంటర్లను నిర్వహిస్తున్న ఓ వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన మేరకు.. అమీర్‌పేటకు చెందిన ఎస్.అనిల్‌కుమార్ (31) అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని కృష్ణారెడ్డి బిల్డింగ్స్‌లో ఓషన్ బ్యూటీ స్టూడియో నిర్వహిస్తున్నాడు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం స్టూడియోపై దాడులు నిర్వహించగా అక్కడ స్పా, మసాజ్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ కేంద్రానికి ఎటువంటి అనుమతులు, ట్రేడ్ లైసెన్స్ లేకపోగా, కస్టమర్ల రిజిస్టర్ నిర్వహించకపోవడం, సీసీ కెమెరాల ఏర్పాటు లేకపోవడం, అర్హులైన థెరపిస్ట్ లేకపోవడం తదితర సమస్యలను గుర్తించారు. స్టూడియోను మూసివేసి నిర్వాహకులు అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

ఈనాడు 'కొట్టు'కథ

రెండేళ్ల కిందటి ఫొటోలతో.. 'పట్టాభినీ కొట్టారు' అంటూ కట్టుకథనం

అవి పాత ఫొటోలని నిర్ధారించి.. ఉతికి ఆరేసిన సోషల్‌ మీడియా యాక్టివిస్టులు

(సాక్షి, అమరావతి)

'ఈనాడు'పత్రిక ఎందుకింతలా దిగజారిపోతోంది? ఒక పార్టీపై బురద జల్లడానికి.. ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చడానికి... పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయటానికి... మనుషుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి రెండేళ్ల కిందటి ఫొటోలు కూడా ఇవ్వాల్టివేనని అబద్ధాలు చెబుతూ ప్రచురించే స్థాయికి ఎందుకు పడిపోయింది? అసలిలాంటి పత్రికను ఎవరైనా నమ్మొచ్చా? చంద్రబాబును అధికార పీఠంపైకి తేవటం కోసం ఈ రాష్ట్రాన్ని ఏం చేసినా పర్వాలేదనుకునే రామోజీరావు మనస్తత్వాన్ని క్షమించవచ్చా?

'పట్టాభినీ కొట్టారు'అంటూ పతాక స్థాయిలో వేసిన శీర్షికలోనే కాదు... ఆ వార్తలో ప్రతి అక్షరం అబద్ధాలతో కూడిన కాలకూట విషమే. అసలు పట్టాభిని కొట్టనే లేదని పోలీసులు కోర్టులో చెబితే... దాన్ని వైద్యాధికారులు సైతం ధ్రువీకరిస్తే... కొట్టారంటూ 'ఈనాడు'లో వార్తలేంటి? పైపెచ్చు... 'తీవ్రంగా కొట్టారు. అరచేతిపైనా, కాళ్లపైనా థర్డ్‌ డిగ్రీ ప్రయోగించార'ంటూ దుర్మార్గపు రాతలేంటి? ఆ రాతలన్నీ నిజమని నమ్మించటానికి వాటికి రుజువులుగా ఎప్పుడో రెండేళ్ల కిందట '2021 ఫిబ్రవరి 3న'తన పత్రికలోనే వేసిన ఫొటోలను మళ్లీ ఇపుడు వేసేసిన దౌర్భాగ్యపు పరిస్థితేంటి? అంటే... మీ దృష్టిలో మీ పాఠకులంతా వెర్రివాళ్లా రామోజీరావు గారూ? మీరు ఏం రాసినా నమ్మేస్తారనే భ్రమల్లోనే ఇంకా బతుకుతున్నారా? అదంతా ఒక చరిత్ర అని... 'సాక్షి'రాకముందు కొన్నాళ్లపాటు తెలుగు పత్రికారంగం ఎదుర్కొన్న సంధికాలమని ఇప్పటికీ తెలియటం లేదా? 'సాక్షి'ఆవిర్భవించిన నాటి నుంచీ మీ ఏకచ్ఛత్రాధిపత్యానికి కాలం చెల్లిందని... వార్తలకు రెండోవైపున ఏమున్నదో కూడా జనం చూస్తున్నారని మరిచిపోయారా? ఇంటర్నెట్‌ వేదికగా వ్యక్తులే శక్తిమంతమైన మీడియాగా మారుతున్న ఈ రోజుల్లోనూ మీరు పచ్చి అబద్ధాలను పోగేస్తే నమ్మేస్తారని ఎలా అనుకుంటున్నారు? అసలు ఏనాటికైనా మారుతుందా 'ఈనాడు'?

'బీసీ'ల అభ్యున్నతి జనానికి చేరకుండా...

సోమవారం శాసనమండలి అభ్యర్థులను ప్రకటిస్తూ... ఉన్న 18 స్థానాల్లో 14... అంటే ఏకంగా 68 శాతాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కేటాయిస్తూ కొత్త చరిత్రను లిఖించారు ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్మోహన్‌రెడ్డి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా బీసీలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఎక్కడికక్కడ ముఖ్యమంత్రి చిత్ర పటాలకు పాలాభిషేకాలు చేశారు. ఆనందంతో ర్యాలీలు చేశారు. ఇప్పటికే బీసీల్లో బలం పెంచుకున్న వై.ఎస్‌.జగన్‌కు... దీని వల్ల మరింత ఖ్యాతి వస్తుందని భావించిన తెలుగుదేశం, దాని మిత్ర మీడియా... వ్యూహం ప్రకారం అదేరోజున 'గన్నవరం'కుట్రకు తెరతీశాయి. తామే రెచ్చగొట్టి కయ్యానికి కాలుదువ్వటమే కాక... విజయవాడ నుంచి గన్నవరానికి వెళ్లి మరీ పట్టాభి సహా టీడీపీ నేతలు అక్కడి ఎమ్మెల్యే వంశీ అనుచరులతో ఘర్షణకు దిగారు. దాదాపు అన్ని ఛానెళ్లలోనూ బీసీలకు పట్టం కట్టిన వ్యవహారం రాకుండా... టీడీపీ చక్రం తిప్పింది. మంగళవారం నాడు 'ఈనాడు'లో ... గన్నవరంలో ప్రభుత్వమే దారుణాలకు పాల్పడ్డట్టుగా... పోలీసులే దౌర్జన్యం చేసినట్టుగా దారుణమైన కథనాలు వండివార్చేశారు. ఆ ఘర్షణల సందర్భంగా అరెస్టయిన పట్టాభిని పోలీసులు దారుణంగా కొట్టారంటూ బుధవారం దాన్ని కొనసాగించారు. అందుకు రుజువులుగా ఎప్పుడో 2021 ఫిబ్రవరి 3నాటి ఫొటోలను... ఇప్పటివేనంటూ వేసేశారు. అదీ జరిగిన కథ!!. ఔరా రామోజీ??

2021, ఫిబ్రవరి 3 'ఈనాడు'ఏం రాసిందంటే

'కర్రలు, రాడ్లతో పట్టాభిపై దాడి'అని 'ఈనాడు' బ్యానర్‌గా ప్రచురించిన వార్త ఇది. టీడీపీ నేత పట్టాభిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ 'ఈనాడు'హడావుడి చేసింది. విజయవాడలోని తన ఇంటి నుంచి కారులో వచ్చిన ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని... కారు అద్దాలు పగలగొట్టారని... పట్టాభిని కారు నుంచి బయటకులాగి... ఎడమ మోచేయి, ఎడమ మోకాలు, తొడపై ఇష్టారాజ్యంగా కొట్టారని వార్త ప్రచురించింది. తన భర్తకు ప్రాణహాని ఉందని పట్టాభి భార్య చందన ఆవేదన వ్యక్తం చేసినట్టు మరో వార్త ఇచ్చింది. పోలీసులు స్పందించి ఆ దాడిని మెడికో లీగల్‌ కేసుగా నమోదు చేస్తాం... ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేస్తామంటే పట్టాభి వద్దన్నారని, దాంతో... పోలీసులు బలవంతంగా ఆయన్ని ఆసుపత్రికి తీసుకువెళ్లారని ఇంకో వార్త వేసింది. పట్టాభికి సంఘీభావంగా చంద్రబాబు హుటాహుటిన ఆయన నివాసానికి వచ్చి పరామర్శించటమే కాక... ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే చంపేస్తారా? అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన వార్త కూడా వేసింది. ఇక పట్టాభి శరీరంపై గాయాలు... పట్టాభిపై దాడికి ఉపయోగించిన కర్ర... ధ్వంసమైన పట్టాభి కారు అద్దాలు...పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తీసుకువెళుతుండటంతో విలపిస్తున్న పట్టాభి... పట్టాభిపై దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన తరువాత పోలీసులతో మాట్లాడుతున్న చంద్రబాబు... పట్టాభి శరీరంపై గాయాలను పరిశీలిస్తున్న చంద్రబాబు... అంటూ పెద్దపెద్ద ఫొటోలతో విపరీతమైన హడావుడి చేసి... రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిందనే భావన కలిగించాలని కుట్ర పన్నింది.

కానీ... ఆ కుట్ర బెడిసికొట్టింది

చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టింది. ఎందుకంటే ఆ దాడి గురించి ఫిర్యాదు చేయడానికి పట్టాభి ఇష్టపడలేదు. ఎవరిపైనయినా అనుమానం ఉందా? అంటే కూడా చెప్పలేదు. పోలీసుల దర్యాప్తునకు సహకరించలేదు. పోలీసులు దర్యాప్తు జరపటానికే ఆయన ఒప్పుకోలేదు. ఎందుకో తెలుసా? వాస్తవానికి పట్టాభికి సంబంధించిన వ్యక్తిగత రహస్యాలు, వ్యక్తిగత వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, కొందర్ని ఆయన చేసిన మోసాలు అప్పట్లో కథలుకథలుగా వినిపించాయి. తన వ్యక్తిగత రహస్యాలను బయట పడకుండా బ్లాక్‌మెయిలింగ్‌ చేసేందుకు పట్టాభే ఆ దాడి డ్రామా ఆడించారని టీడీపీ వర్గాలు లోలోపల వ్యాఖ్యానించాయి కూడా. ఇవన్నీ బయటకు వస్తాయన్న ఉద్దేశంతోనే ఆయన దర్యాప్తునకు ఇష్టపడలేదు. దీంతో పట్టాభిని అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలన్న చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టింది.

అయినా... మనసు మారలేదు

అప్పట్లో చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టినా... 'ఈనాడు'మాత్రం మారలేదు. మళ్లీ బుధవారం నాడు పాత స్కీమునే పునరావృత్తం చేసింది. పట్టాభి అరికాళ్లు, తొడలపై దెబ్బలు అంటూ అలనాటి 5 ఫొటోలను మొదటి పేజీలో ప్రచురించింది. 'దేశమంతా ఐపీసీ చట్టం.. రాష్ట్రంలో వైసీపీ చట్టం' అంటూ మరో కథనంతో మొదటి, రెండు పేజీలను నింపేసింది. 'నా భర్త ప్రాణాలకు ముప్పు'అంటూ పట్టాభి భార్య చందన వాపోతున్నట్టుగా మరో వార్తను ఏకంగా అయిదు ఫొటోలతో ప్రచురించి 3వ పేజీని నింపేసింది. 'ఫిర్యాదు చేస్తే దాడులు చేస్తారా'అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు మరో వార్త కూడా వేసింది. అంటే... రెండేళ్ల కిందటి ఘటనతో బుద్ధి తెచ్చుకోకుండా మళ్లీ ఆ స్కీమ్‌ను పునరావృత్తం చేశారు రామోజీరావు గారు. కాకపోతే మధ్యాహ్నానికల్లా సోషల్‌ మీడియాలోనే అందరూ నిజానిజాలు చెబుతూ 'ఈనాడు'వలువలు ఊడదీసేశారు. ఇప్పటికైనా రామోజీ మారతారా?

పట్టాభిని పోలీసులు కొట్టనే లేదు

వైద్య పరీక్షల్లో నిర్ధారణ

పట్టాభిని పోలీసులు కొట్టారన్న టీడీపీ ఆరోపణలు అవాస్తవమని స్పష్టమైంది. న్యాయస్థానం ఆదేశాలతో పట్టాభికి విజయవాడలోని ప్రభుత్వ జనరల్‌ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవని వైద్యులు నిర్ధారించారు. వైద్యులు రెండు సార్లు పరీక్షించి మరీ ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవని న్యాయస్థానానికి నివేదిక సమర్పించారు. దాంతో తనను కొట్టారంటూ పట్టాభి ఆడిన డ్రామా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన అవాస్తవ ఆరోపణలు... రాష్ట్రంలో ఐపీసీ కాదు వైసీపీ అమలు అవుతోందంటూ ఈనాడు చేసిన దుష్ప్రచారం అంతా పక్కా ముందస్తు కుట్రేనన్నది స్పష్టమైంది.

ఏపీలో 175 సీట్లలో బీఆర్‌ఎస్‌ పోటీ: తోట

గుంటూరు మెడికల్‌: రానున్న ఎన్నికల్లో 175 ఎమెల్యే, 25 ఎంపీ స్థానాల్లో బీఆర్‌ఎస్‌ పోటీ చేయనుందని, ఏపీలో బీఆర్‌ఎస్‌ మూడో ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఆవిర్భవిస్తున్నదని బీఆర్‌ఎస్‌ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్‌ అన్నారు. బీఆర్‌ఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం గుంటూరు పర్యటనకు వచ్చిన ఆయనకు బీఆర్‌ఎస్‌ శ్రేణులు స్వాగతం పలికాయి. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

శ్రీవాణి ఆఫ్‌లైన్‌ దర్శన టికెట్ల జారీ పునఃప్రారంభం

తిరుమల: తిరుమలలోని గోకులం కార్యాలయంలో బుధవారం నుంచి ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి టికెట్ల జారీని టీటీడీ పునఃప్రారంభించింది. తిరుమలలో ఈ నెల 28వ తేదీ వరకు రోజుకు 150 శ్రీవాణి టికెట్లను జారీ చేయనున్నారు. మార్చి నుంచి 500 టికెట్లు ఆన్‌లైన్‌లో, 400 టికెట్లు తిరుమలలోని గోకులం కార్యాలయంలో, 100 తిరుపతి విమానాశ్రయంలో కరెంట్‌ బుకింగ్‌ కింద భక్తులకు అందుబాటులో ఉంటాయి.

పట్టాభిని కొట్టామనడం

అవాస్తవం

- గొడవలు సృష్టించాలనే పట్టాభి దురుద్దేశం
- టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో 9 మంది అరెస్టు
- కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా వెల్లడి

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్‌ కోడ్‌ను స్కాన్‌ చేయండి

టీడీపీ నేత పట్టాభికి 14 రోజుల రిమాండ్‌


- మొత్తం 11 మంది రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలింపు
- పట్టాభి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు
- విజయవాడ జీజీహెచ్‌ వైద్యుల ధ్రువీకరణ
- ఈ మేరకు మెడికల్‌ సర్టిఫికెట్‌ను కోర్టులో సమర్పించిన పోలీసులు

గోదారికి కరకట్టలతో కట్టడి!

నదికి ఇరువైపులా రూ.8వేల కోట్లతో 16కి.మీల మేర నిర్మాణం

- కుడి వైపున సంజీవరెడ్డిపాలెం- అమ్మగారిపల్లె వరకు
- ఎడమవైపున సుభాష్‌నగర్‌ కాలనీ-సున్నంభట్టి వరకు
- రూ.1629 కోట్లు, రూ.1587 కోట్లతో వేర్వేరు ప్రతిపాదనలు
- భూసేకరణకు రూ.230 కోట్ల--రూ.250 కోట్ల అంచనా వ్యయం
- రూ.25 కోట్లతో రెడ్డిసత్రం, కొత్త కాలనీల్లో రెండు పంప్‌హౌజ్‌లు
- వీటి ద్వారా వాగుల్లోని వరద నీరు గోదావరిలోకి ఎత్తిపోత
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించిన నిపుణుల కమిటీ

సాక్షి, హైదరాబాద్‌: భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు వరదల నుంచి రక్షణ కోసం గోదావరి నదికి ఇరు వైపులా 16 కి.మీల పొడవున కరకట్టలు నిర్మించాలని నిపుణుల కమిటీ ప్రతిపాదించింది. గోదావరికి కుడి వైపున బుర్గంపహాడ్‌ మండలం సంజీవరెడ్డిపాలెం నుంచి అస్వాపురం మండలం అమ్మగారిపల్లె వరకు, ఎడమవైపున భద్రాచలంలోని సుభాష్‌నగర్‌ కాలనీ నుంచి దుమ్ముగూడెం మండలం సున్నంభట్టి వరకు కొత్త కరకట్టలు నిర్మించడంతో పాటు ఇప్పటికే కరకట్టలు ఉన్న చోట వాటిని బలోపేతం చేయాలని సూచించింది. ఇందుకు రూ.1629 కోట్లు, రూ.1587 కోట్ల అంచనాలతో రెండు వేర్వేరు ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. గతేడాది జూలైలో గోదావరి నదికి వరదలు భీకరంగా పోటెత్తడంతో భద్రాచలం పట్టణంతో పాటు పరిసర గ్రామాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. జూలై 17న సీఎం కేసీఆర్‌ భద్రాచలంలోని ముంపు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వరదల నుంచి శాశ్వత పరిష్కారం కల్పించడానికి రూ.1000 కోట్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(ఓ అండ్‌ ఎం) బి.నాగేంద్ర రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ వరదల నుంచి శాశ్వత పరిష్కారంపై అధ్యయనం జరిపి ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది.



రూ.8వేల కోట్లతో కరకట్టలు !

వరద రక్షణ గోడల పనుల కోసం తొలి ప్రతిపాదన ప్రకారం భూసేకరణ నిర్వహిస్తే రూ.237 కోట్లు, మరో ప్రతిపాదనను అనుసరిస్తే రూ.253.1 కోట్లు వ్యయం కానుందని కమిటీ అంచనా వేసింది. ఎకరాకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని ప్రతిపాదించింది. దాదాపు 230–250 ఎకరాల వరకు భూసేకరణ జరపాల్సి ఉండనుంది. కరకట్టల నిర్మాణానికి తొలి ప్రతిపాదన అనుసరిస్తే రూ.8329.75 కోట్లు, రెండో ప్రతిపాదనను అనుసరిస్తే రూ.8443.9 కోట్లు కానుందని తెలిపింది. కరకట్టలతో పాటు 15 మైనర్‌ స్ట్రక్చర్లు, 2 మీడియం స్ట్రక్చర్లు, 6 మేజర్‌ స్ట్రక్చర్ల నిర్మాణాన్ని ప్రతిపాదించింది.

పంపులతో గోదావరిలోకి వాగుల నీళ్లు ఎత్తిపోత

వరదల సమయంలో గోదావరిలో బ్యాక్‌వాటర్‌ వెనక్కి తన్నుతుండడంతో సమీపంలోని వాగుల ప్రవాహం అందులో కలవలేక ఎక్కడికక్కడే పేరుకుపోయి పరిసర ప్రాంతాలను ముంపునకు గురి చేస్తున్నాయి. దీనికి పరిష్కారంగా భద్రాచలంలోని రెడ్డిసత్రం, కొత్త కాలనీల వద్ద రూ.25 కోట్ల అంచనాలతో రెండు పంప్‌హౌజ్‌లు నిర్మించి వరద నీళ్లను ఎత్తి గోదావరిలో పోయాలని కమిటీ సూచించింది. బీటీ రోడ్లు, అప్రోచ్‌ రోడ్డుల కోసం మరో రూ.6.75 కోట్లను ప్రతిపాదించింది.

కరకట్టలను నిర్మించాలని ఏపీని కోరనున్న ప్రభుత్వం...

పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌ ప్రభావంతోనే భద్రాచలం, పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు గోదావరికి ఇరువైపులా కరకట్టలు నిర్మించే పనులను చేపట్టాలని ఏపీ ప్రభుత్వం/పోలవరం ప్రాజెక్టు అథారిటీని త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కోరనుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణలో ఏర్పడనున్న ముంపు సమస్యకు పరిష్కారం కల్పించాలని గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఏపీతో పాటు కేంద్రాన్నీ కోరుతున్న విషయం తెలిసిందే. ముంపునకు గురవుతున్న భూముల సేకరణ లేదా కరకట్టలతో వాటికి రక్షణ కల్పించంలో ఏదైనా ఒక పనిని పోలవరం ప్రాజెక్టు అథారిటీ/ఏపీ ప్రభుత్వం చేయాల్సి ఉంటుందని తెలంగాణ అధికారులు పేర్కొంటున్నారు.

నగర వార్తలు

కామినేని ఆస్పత్రికి హైకోర్టు షోకాజ్‌ నోటీసులు

రవీందర్‌రావు మృతిపై నివేదిక అందజేయాలని ఆదేశం

మన్సూరాబాద్‌: ఈ నెల 16న ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్‌లో నాగోలు బండ్లగూడకు చెందిన రవీందర్‌రావు మృతి ఘటనపై రాష్ట్ర హైకోర్టు స్పందించింది. రాష్ట్ర హోం సెక్రటరీ, రాష్ట్ర డీజీపీకి, రాచకొండ పోలీస్‌ కమిషనర్, ఎల్‌బీనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ హౌస్‌ ఆఫీసర్‌కు జరిగిన ఘటనపై విచారణ చేపట్టి వచ్చే నెల 7వ తేదీలోగా నివేదికను కోర్టుకు సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా ఎల్‌బీనగర్‌ కామినేని హాస్పిటల్స్‌ చైర్మన్, చికిత్సను అందించిన డాక్టర్‌ కృష్ణచౌదరిని వచ్చే నెల 7వ తేదీన కోర్టుకు హాజరు కావాలని షోకాజ్‌ నోటీసులు జారీ చేసింది.

మహిళ అనుమానాస్పద మృతి

సంతోష్‌నగర్‌: బుధవారం రాత్రి సంతోష్‌నగర్‌లో ఓ ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. ఏసీపీ మహ్మద్‌గౌస్‌ తెలిపిన మేరకు.. మెహిన్‌ బాగ్‌కు చెందిన మహ్మద్‌ అమీర్‌ హుస్సేన్‌(33)తో షాహీన్‌నగర్‌ బిస్మిల్లా కాలనీకి చెందిన ఆసియా బేగం(32)తో వివాహమైంది. రూ.10 లక్షల విలువగల వంద గజాల స్థలాన్ని ఆసియా బేగం పేరున కట్నం రూపంలో ఇచ్చారు. గతకొద్ది రోజులుగా భర్త మహ్మద్‌ అమీర్‌ హుస్సేన్‌ తన పేరున రిజిస్ట్రేషన్‌ చేయాలని కోరుతూ భార్యను వేధింపులకు గురి చేసే వాడు. సంతానం లేకపోవడంతో భర్త, అత్త, ఆడపడుచులు తరచుగా కట్నం కోసం వేధించేవారు. గతంలో ఆసియా బేగం సంతోష్‌నగర్‌ పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది. ఇరు వర్గాల వారు మాట్లాడుకుని ఆసియా బేగంను భర్త మళ్లీ ఇంటికి తీసుకెళ్లాడు. కాగా బుధవారం ఆసియయా బేగం ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఓ అపోలోకు తీసుకెళ్లారు. మృతురాలి సోదరుడు మహ్మద్‌ అహ్మద్‌ ఆస్పత్రికి వెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తన సోదరి మృతిపై అనుమానాన్ని వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

24 నుంచి 'అలీప్‌ వేకార్ట్‌ ఎగ్జిబిషన్‌'

పంజగుట్ట: అసోసియేషన్‌ ఆఫ్‌ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్‌ ఆఫ్‌ ఇండియా (అలీప్‌) ఆధ్వర్యంలో ఈ నెల 24 నుండి 26 వరకు 'అలీప్‌ వెకార్ట్‌ ఎగ్జిబిషన్‌' నిర్వహిస్తున్నట్టు అధ్యక్షురాలు రమాదేవి కన్నెగంటి తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం తమకు సహకరిస్తూ పీపుల్స్‌ప్లాజా గ్రౌండ్‌ను ఉచితంగా ఎగ్జిబిషన్‌ కోసం కేటాయించిందన్నారు.

రాత్రికి రాత్రే కూల్చేశారు



ఇళ్లను కూల్చివేయడంతో రోడ్డున పడ్డ కుటుంబాలు

పంజగుట్ట: 'అర్ధరాత్రి మిడతల దండులా మా ఇళ్ల మీద పడ్డారు. ఇంట్లోవాళ్లని బయటకు లాగి, సామాన్లను బయటపడేసి ఇండ్లు కూల్చేశారు. ఫ్యాన్లు, ఏసీలు అలాగే ఉన్నాయి. ఇంటిలోపల ద్విచక్రవాహనాలు కూడా ఉన్నాయి. ఇళ్లు మొత్తం నేల మట్టం చేసి రోడ్డునపడేశారు. మేము ఎక్కడకు వెళ్లాలి.. మా ఉసురు తగులుతుంది'.. అని ఎర్రమంజిల్‌ వాసులు అధికారులపై దుమ్మెత్తిపోశారు. ఎర్రమంజిల్‌ రవీంద్రనికేతన్‌ పాఠశాల సమీపంలో ఉన్న సుమారు 30 ఇళ్లను మంగళవారం అర్ధరాత్రి వందలకొద్ది రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, పోలీస్, ఆర్‌అండ్‌బీ అధికారులు వచ్చి కూల్చివేశారు. 50 సంవత్సరాల నుండి ఇక్కడే ఉంటున్నాము. ప్రభుత్వం జీవో నెంబర్‌ 58 కింద మాకు పట్టాలు కూడా ఇచ్చింది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, మాకు ప్రత్యామ్యాయం ఏమీ చూపకుండా ఎలా కూల్చివేస్తారని అక్కడి స్థానికులు తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేశారు. బుధవారం బాధితులంతా కలిసి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం నండి సంబంధిత అధికారులందరికీ నోటీసులు పంపించారు.

మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో రెవెన్యూ అధికారులు వచ్చి అరగంటలో ఇండ్లు ఖాళీ చేయాలని కూల్చివేస్తామని వారికి చెప్పడంతో సమాచారం అందుకున్న టీపీసీసీ ప్రధానకార్యదర్శి, కార్పొరేటర్‌ పి.విజయారెడ్డి అక్కడకు వచ్చి వారికి మద్దతుగా అక్కడే బైఠాయించించారు. సాయంత్రం వరకు అక్కడే ఆమె ఉన్నారు. రాత్రి 2 గంటల ప్రాంతంలో ఒకేసారి వందల కొద్ది పోలీసులు నలుగురు తహశీల్దార్లు, ఆర్‌డీవో, పెద్దెత్తున రెవెన్యూ అధికారులు అక్కడకు వచ్చి ప్రతీ ఇంట్లోకి వెళ్లడం అక్కడ కరెంట్‌ తీసేయ్యడం, ఇంట్లో ఉన్నవారిని బయటకు లాగి, చేతికి దొరికిన సామాన్లు బయటపడేసి రెండు జేసీబీలతో ఇండ్లు మొత్తం కూల్చేశారు. ఫ్యాన్లు, ఏసీలు అలానే ఇంట్లోనే కూరుకుపోయాయి. చాలా ఇండ్లల్లో పెట్టుకున్న ద్విచక్రవాహనాలు కూడా మట్టిలోనే కూరుకుపోయాయి.

విషయం తెలుసుకున్న కార్పొరేటర్‌ విజయారెడ్డి అర్ధరాత్రి 2:30 ప్రాంతంలో అక్కడకు వచ్చి వారిని అడ్డుకునేందుకు యత్నించించారు. అడ్డుకున్న పోలీసులు ఆమెను అరెస్టు చేసి ఎస్సార్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌కు, కొంతమంది బాధితులు, విజయారెడ్డి అనుచరులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎర్రమంజిల్‌లో ఇళ్లు కూల్చివేసిన అధికారులు



మరీ.. ఇంత దారుణమా



అర్ధరాత్రి 2:30 గంటల సమయంలో మేము గాఢ నిద్రలో ఉన్నాము. తలుపులు తట్టగా బయటకు వచ్చేసరికి 40 మంది ఉన్నారు. బయటకు రావాలి.. ఇళ్లకూల్చేస్తున్నామని ఒకరు మాట్లాడుతుంటేనే మరొకరు కరెంట్‌ కట్‌చేశారు. మరొకరు టార్చ్‌లైట్‌ తీసుకుని నన్ను బయటకు ఈడ్చేశారు. మా బాబు ఉన్నాడు అని చెబితే మరొకరు వెళ్లి ఐదునెలల తన బాబును తీసుకువచ్చి నా చేతిలో ఉంచి ఇల్లు కూల్చేశారు.మరీ ఇంత దారుణమా. – శిరీష

కనీసం నోటీసు కూడా ఇవ్వలేదు



ఇంట్లో పెద్దవారి మందులు ఉన్నాయి. పిల్లల పుస్తకాలు ఉన్నాయి వాటిని తీసుకుంటామన్నా వినలేదు. మాకు కనీసం నోటీసులు ఇవ్వకుండా, ఎలాంటి ప్రత్యామ్యాయం చూపకుండా బయటకు గెంటేస్తే ఎలా జీవో 58 ప్రకారం మాకు పట్టా కూడా ఇచ్చారు. – మల్లీశ్వరి



రాత్రంతా పోలీస్‌స్టేషన్‌లోనే మహిళా కార్పొరేటర్‌

అమీర్‌పేట: ఎర్రమంజిల్‌ కాలనీ రామకృష్ణానగర్‌లో ఇళ్లు కూల్చడాన్ని అడ్డుకున్న ఖైరతాబాద్‌ కార్పొరేటర్, టీపీసీసీ జనరల్‌ సెక్రటరీ పి.విజయారెడ్డిని పోలీసులు మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో అరెస్టుచేసి స్టేషన్‌కు ఎస్‌ ఆర్‌ నగర్‌ స్టేషన్‌తీసుకెళ్లారు. ఆమెను బుధవారం ఉదయం 10 గంటల తరువాత వదిలి పెట్టారు. మహిళ అని చూడకుండా తనను రాత్రంతా స్టేషన్‌లో ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. విజయారెడ్డిని కాంగ్రెస్‌ సీనియర్‌ నేత వి.హనుంతరావు పరామర్శించారు.



పురస్కారం అందుకుంటున్న డాక్టర్‌ దాసరి ప్రసాదరావు

డా. దాసరి ప్రసాదరావుకు జీవిత సాఫల్య పురస్కారం

ఆల్విన్‌కాలనీ: ప్రముఖ వైద్యుడు, గుండె శస్త్ర చికిత్స నిపుణులు, నిమ్స్‌ మాజీ డైరెక్టర్‌ పద్మశ్రీ అవార్డ గ్రహీత డాక్టర్‌ దాసరి ప్రసాదరావుకు జీవిత సాఫల్య పురస్కారం లభించింది. కొయంబత్తూరులో జరిగిన హార్ట్‌ సర్జన్స్‌ ఆఫ్‌ ఇండియా 69వ వార్షికోత్సవంలో ఆయనకు అందజేశారు. గుండె, ఊపిరితిత్తులు, కాలేయ వ్యాధుల శస్త్ర చికిత్సలో ఉత్తమ సేవలు అందించినందుకు ఆయనను ఈ పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో వెయ్యి మందికి పైగా గుండె శస్త్ర చికిత్స నిపుణులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ... దేశంలో పేదలకు అధునాతన వైద్యం అందుబాటులోకి రావాలన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు దీనిపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

నాకు ప్రాణ హాని ఉంది..రక్షణ కల్పించాలి



క్యాసినో వ్యాపారి చీకోటి ప్రవీణ్‌కుమార్‌

సైదాబాద్‌: ఇంటి వద్ద తన కారు మాయం కావడం సాధారణ దొంగతనంగా భావించడంలేదని, ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉన్నందున పోలీసులు తనకు రక్షణ కల్పించాలని క్యాసినో వ్యాపారి చీకోటి ప్రవీణ్‌కుమార్‌ కోరారు. బుధవారం వినయ్‌ నగర్‌ కాలనీలోని తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. కారు అపహరణ ఘటనలో ఐదారుగురు వ్యక్తులు తన ఇంటి వద్ద తచ్చాడినట్లు సీసీ ఫుటేజ్‌లో గమనించామన్నారు. గతంలోనూ రక్షణ కోసం పోలీసులకు విజ్ఞప్తి చేసానని, రాష్ట్ర నూతన డీజీపీని కూడా కలిసి రక్షణ కల్పించాలని కోరానని ఆయన వివరించారు. ఇప్పటికైనా పోలీసులు తగిన విచారణ జరిపి తనకు సెక్యూరిటీ కల్పించాలని ఆయన కోరారు.

ఇదిలా ఉండగా చీకోటి ప్రవీణ్‌ కారు ఆచూకీ దొరికిందని తెలిసింది. ఈ ఘటనలో ఐదుగురు పాల్గొన్నట్లు, అందులో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. అపహరించిన కారును తీసుకెళుతున్న సమయంలో అగంతకులు కారుతో ఒక ప్రమాదానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కారు అపహరణ కేసును సైదాబాద్‌ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి



వినతి పత్రం చూపిస్తున్న కాంగ్రెస్‌ నేత రోహిణ్‌రెడ్డి

వెంకటేశ్వరకాలనీ: నగరంలో వరుసగా చిన్నారులే లక్ష్యంగా వీధి కుక్కలు దాడులు చేస్తున్నా జీహెచ్‌ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్లు బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్‌ సి.రోహిణ్‌రెడ్డి అన్నారు. అంబర్‌పేట్‌లో వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ళ చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఘటనలో చట్టపరమైన చర్యలతో పాటు కుటుంబానికి న్యాయం చేయాలంటూ జీహెచ్‌ఎంసీ అధికారులకు బుధవారం వినతి పత్రం అందజేశారు. వీధి కుక్కల నిర్మూలనలో జీహెచ్‌ఎంసీ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రెండు రోజుల్లో ఈ ఘటనలపై చర్యలు తీసుకోకపోతే జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. వీధి కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాధిత బాలుడి కుటుంబానికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నేతలు దర్పల్‌ రాజశేఖర్, కోటింరెడ్డి వినయ్‌రెడ్డి,ఫిరోజ్‌ఖాన్, నీలా తదితరులు పాల్గొన్నారు. మేయర్‌ షేమ్‌.. షేమ్‌ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్‌ అమయ్‌కుమార్‌

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: శాసన మండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పకుండా పాటించాలని, ఈ విషయంలో జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్‌ ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌ రాజ్‌ సూచించారు. బుధవారం హైదరాబాద్‌ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, ప్రవర్తనా నియమావళి అమలు, ఓటరు తుది జాబితా, బ్యాలెట్‌ పేపర్‌ వెరిఫికేషన్‌ తదితర విషయాలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన ఉపాధ్యాయుల వివరాలు ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేట్‌ ఉపాధ్యాయులకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే అప్‌లోడ్‌ చేయాలన్నారు. బ్యాలెట్‌ పత్రాలకు సంబంధించి వెరిఫికేషన్‌ రిపోర్టు పంపించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అమయ్‌ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, అభిషేక్‌ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఆర్డీఓలు రవి, మల్లయ్య, కలెక్టరేట్‌ ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 23-2-2023


డి.ఉమామహేశ్వరి

పురస్కారం

14వ ఏట నుంచి డి.ఉమామహేశ్వరి హరికథ కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. 'సంస్కృతం'లో హరికథ చెప్పగలిగే ఏకైక మహిళా భాగవతారిణి. తెలుగులో ఆమె చెప్పే హరికథలకు విశేష అభిమానులు ఉన్నారు. ప్రతిష్ఠాత్మక సంగీత్ నాటక్ అకాడెమీ పురస్కారాన్ని న్యూఢిల్లీలో నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నారు. అక్కడి రబీంద్ర భవన్‌లో ఫిబ్రవరి 24న ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే...

హరికథే ఆమె కథ

''మాది బందర్ (మచిలీపట్నం). మా నాన్న లాలాజీ రావు నాదస్వర విద్వాంసుడు. వేములవాడ దేవస్థానంలో 30 ఏళ్ల పాటు నాదస్వర వాదన చేశాడాయన. మేము వేములవాడలో ఉన్నా అవకాశం దొరికినప్పుడల్లా బందర్‌కు తీసుకెళ్లేవాడు. అక్కడ నేను హరికథలు వినేదాన్ని. మా చిన్నప్పుడు కోట సచ్చిదానంద శాస్త్రిలాంటి వారు 40 రోజుల పాటు మహాభారతం చెప్పేవారు. జనం విరగబడేవారు. సినిమాహాళ్ల యజమానులొచ్చి హరికథను ముగించమని, జనం సినిమాలకు రావడం లేదని బతిమిలాడేవారు. అలా హరికథ నా మనసులో ముద్ర వేసింది.

హరికథా గురుకులంలో...

తూ.గో.జిల్లా కపిలేశ్వరపురంలో జమీందారు సత్యనారాయణ గారు, వారి శ్రీమతి రాజరాజేశ్వరి గారు డాన్స్ స్కూల్ స్థాపించాలనుకున్నారు. కాని నటరాజ రామకృష్ణ గారు ఇది తెలిసి డాన్స్ స్కూల్స్ చాలా ఉన్నాయి హరికథ కళ అంతరించిపోతోంది... దాని కోసం స్కూల్ తెరువు అనంటే రాజావారు తన తండ్రి పేరున శ్రీ సర్వరాయ హరికథా గురుకులం స్థాపించారు. మా నాన్న ఇది తెలిసి నన్ను అక్కడ చేర్పించారు. 14 ఏళ్ల వయసులో అక్కడ చేరి ఆదిభట్ల నారాయణదాసు ఏ సంప్రదాయం హరికథకు స్థిరపరిచారో ఆ సంప్రదాయంలోనే నేర్చుకున్నాను. నాతో పాటు మరో 40 మంది అమ్మాయిలు హరికథను నేర్చుకున్నారు. హరికథ చెప్పాలంటే సంగీతం, సాహిత్యం, నృత్యం, సంస్కృతం, తెలుగు తెలిసి ఉండాలి. ఆటా పాటా మాట... వీటిని మేటిగా మేళవిస్తూ రక్తి కట్టేలా కథ చెప్పాలి. గురువుల దయవల్ల నేను నేర్చుకోగలిగాను. విజయనగరం సంస్కృత పాఠశాలలో నా తొలి ప్రదర్శన ఇచ్చాను.



సంస్కృతంలో హరికథ

తెలుగులో హరికథలు చాలామంది చెబుతారు. కాని అవి తెలుగువారికి మాత్రమే పరిమితం. దేశంలో వేద విద్యను సంస్కృతంలో అభ్యసిస్తున్న వారు, సంస్కృత స్కాలర్లు, టీచర్లు, ఆ భాష ప్రేమికులు చాలామంది ఉన్నారు. వారి కోసం సంస్కృతంలో హరికథలు చెప్తే బాగుండునని అనుకున్నాను. ఎస్.పి.హెచ్.కృష్ణమాచార్యులు గారు కాళిదాసు కావ్యాలను హరికథలుగా రాసి ఇచ్చారు. ఉజ్జయినిలో సంస్కృత పండితుల ఎదుట 'అభిజ్ఞాన శాకుంతలం' చెప్పడంతో నేను ఆ భాషలో చెప్పే తొలి మహిళను అయ్యాను. కుమార సంభవం, రఘువంశం, ఆది శంకరాచార్య, గీత గోవిందం, భక్త జయదేవ... వీటిని హరికథలుగా సంస్కృతంలో చెబుతున్నాను. 1993లో హార్వర్డ్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ వేదిక్ కాన్ఫరెన్స్ జరిగితే హాజరయ్యి సంస్కృతంలో హరికథ చెప్పాను. ప్రశంసలు పొందాను.

భక్తిమార్గం

కొందరు సినిమా పాటలను కలిపి హరికథలు చెబుతుంటారు. అది నా మార్గం కాదు. సరిగా హరికథ చెప్తే నేటికీ ప్రేక్షకులు ఎందరో వస్తున్నారు. నా దగ్గరకు వచ్చిన ఔత్సాహికులకు ఈ కళను నేర్పిస్తున్నాను. ఆదిభట్ల గారి మునిమనవరాళ్లకు నేర్పించాను. కాని ఈ కళ కోసం మరింత జరగాల్సి ఉంది.

భర్తతో కలిసి

మా ఆయన కళాకృష్ణ ప్రసిద్ధ నాట్యకారుడు. మాకు కొడుకు, కూతురు ఉన్నారు. మేమిద్దరం శక్తి ఉన్నంత కాలం మా కళను ప్రదర్శిస్తూ కొత్త తరాలకు నేర్పిస్తూ ఉండాలని నిశ్చయించుకున్నాం.''

బ్యూటిప్స్



ఏ కాలంలోనైనా జిడ్డు చర్మం బాగా ఇబ్బంది పెడుతుంటుంది. జిడ్డు పోగొట్టి ముఖం ఫ్రెష్‌గా ఉండడానికి ఎగ్, లెమన్ ఫేస్‌మాస్క్ బాగా పనిచేస్తుంది.

ఒక గుడ్డును తీసుకుని దానిలోని తెల్లసొనను ఒక గిన్నెలో వేసి దానికి స్పూను తాజా నిమ్మరసం చేర్చి బాగా కలపాలి. తరువాత ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఇరవై నిమిషాలపాటు ఆరనివ్వాలి. ఫేస్‌మాస్క్ ఆరిన తరువాత గోరు వెచ్చని నీటితో కడిగి తుడుచుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయడం వల్ల ముఖం మీద జిడ్డు, మొటిమలు తగ్గుతాయి.

టేబుల్ స్పూన్ తేనె, గుడ్డులోని తెల్లసొన కలిపి ముఖానికి ప్యాక్‌లా వేయాలి. పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. జిడ్డును తొలగించి, ముఖాన్ని కాంతివంతంగా మారుస్తుంది ఈ ప్యాక్.

సేవాపథం

ఆ ఊరికి ఆత్మబంధువులు

ఉద్యోగం నిమిత్తం భార్య సుమితో కలిసి ఆఫ్రికాలోని మలావి దేశానికి వెళ్లాడు కేరళలోని మలప్పురంకు చెందిన అరుణ్ అశోకన్. అక్కడ ఒక గ్రామంలో శిథిలావస్థలో ఉన్న స్కూల్‌ను చూసి చలించిపోయాడు. ఆ తరువాత భార్యాభర్తలు ఇద్దరూ కలిసి స్కూల్ పునర్నిర్మాణానికి నడుం కట్టారు. తమ కలను సాకారం చేసుకున్నారు...

● మలావి డైరీ



స్కూలు పిల్లలతో సుమి, అరుణ్ అశోకన్

మలావిలో ఒకరోజు...

తాను పనిచేస్తున్న ప్రదేశానికి చిసాలియా అనే గ్రామం మీదుగా కారులో వెళుతున్నాడు అరుణ్ అశోకన్. వర్షం మొదలైంది. తల మీద పుస్తకాలు, బ్యాగులు పెట్టుకొని స్కూల్ పిల్లలు గుంపులు, గుంపులుగా పరుగెడుతున్నారు.

'వర్షం పడుతున్నప్పుడు స్కూల్లో కూర్చోక ఇలా పరుగెడుతున్నారేమిటి!' అని డ్రైవర్‌ను అడిగాడు అరుణ్.

'అది పేరుకే స్కూలు. గదులు పాడైపోయాయి. పిల్లలందరూ ఆరుబయటే కూర్చుంటారు. వర్షం వచ్చినప్పుడల్లా ఇలా ఇంటికి పరుగులు తీయాల్సిందే' అని చెప్పాడు డ్రైవర్.



అరుణ్‌కు మనసులో చాలా బాధగా అనిపించింది. ఇంటికి వెళ్లిన తరువాత తన బాధను భార్య సుమితో కలిసి పంచుకున్నాడు.

'బాధపడడం ఎందుకు? మనమే స్కూల్ కట్టిద్దాం' అన్నది సుమి.

నిజానికి ఈ యువదంపతులు సంపన్నులు కారు. అయితే వారు ఆ నిర్ణయం తీసుకునే ముందు 'మనం స్కూల్ కట్టించగలమా?' 'అంత డబ్బు మన దగ్గర ఉందా?' అని ఆలోచించలేదు.

'మనం స్కూల్ కట్టించాలి. అంతే!' అని గట్టిగా అనుకున్నారు. తమ సేవింగ్స్‌ను బయటికి తీశారు. స్కూల్ పునర్నిర్మాణంలో శ్రమదానం చేయడానికి ఊరివాళ్లను ఒప్పించారు.

తమ దగ్గర ఉన్న పొదుపు మొత్తాలతోనే పని కాదనే విషయం ఈ దంపతులకు అర్థమైంది. ఈ పరిస్థితులలో 'మలావి డైరీ' పేరుతో యూట్యూబ్ చానల్‌కు శ్రీకారం చుట్టింది సుమి. ఈ చానల్ ద్వారా వచ్చిన డబ్బు, తమ సేవింగ్స్‌తో లోకాస్ట్ కన్‌స్ట్రక్షన్ టెక్నిక్‌తో స్కూల్ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

స్కూలు ఆవరణలో తోట పెంచారు. లైబ్రరీ ఏర్పాటు చేశారు. ప్లేగ్రౌండ్ తయారుచేశారు.

స్కూల్ ప్రారంభోత్సవాన్ని ఒక పండగలా ఘనంగా జరుపుకున్నారు.

సుమి, అరుణ్‌లు ఇప్పుడు చిసాలియా ఊరి వాళ్లకు ఆత్మబంధువులయ్యారు.

'స్కూల్‌ను పునర్నిర్మించాలనుకున్నాం. నిర్మించాం. ఇక సెలవ్' అనడం లేదు సుమి, అరుణ్ దంపతులు. పిల్లల చదువుల గురించి కూడా పట్టించుకుంటున్నారు. తమకు సమయం ఉన్నప్పుడల్లా క్లాస్‌రూమ్‌లో పిల్లలతో కలిసి సమావేశం అవుతున్నారు. నాలుగు మంచి విషయాలు చెబుతున్నారు.

'బాగా చదువుకోవాలి. పెద్ద ఉద్యోగాలు చేయాలి' 'పెద్ద చదువులు చదవడానికి పేదరికం ఎప్పుడూ అడ్డు కాదు'... మొదలైన మాటలను గట్టిగానే చెబుతున్నారు.

కావల్సినన్ని వనరులు సమకూరినప్పుడు కూర్చుని సేద తీరుదామనుకుంటారు చాలామంది. తమ చుట్టూ ఉన్న నలుగురికైనా వారి స్వశక్తిని నమ్ముకునేలా చేయూతనిద్దాం అనుకుంటారు అతి కొద్దిమంది. అలాంటివారిలో కొత్తమాసు కృష్ణవేణి ఒకరు. సికింద్రాబాద్‌లోని టెలికాం కాలనీ, కానాజీగూడలో ఉంటున్న ఈ గృహిణి తన ఇంటినే సేవాకేంద్రంగా మలిచి పదేళ్లుగా మహిళలకు ఉపాధి శిక్షణా కార్యక్రమాలను ఉచితంగా అందిస్తున్నారు.



టైలరింగ్‌లో శిక్షణనిస్తున్న కృష్ణవేణి

ఇల్లే సేవా కేంద్రం

మహిళలకు శిక్షణ ఇస్తూ బిజీగా ఉన్న కృష్ణవేణిని కలిసినప్పుడు, ఆమె సేవామార్గం వివరాలను ఇలా పంచుకున్నారు..

''పదిహేనేళ్ల క్రితం మావారు రంగారావు సత్యసాయి సేవాకార్యక్రమాలలో పాల్గొనేవారు. నేనూ ఆ కార్యక్రమాలకు వారి వెంట వెళ్లేదాన్ని. ఆ సమయంలోనే గ్రామాలలోని మహిళలకు స్వయం ఉపాధికి పనికి వచ్చే కార్యక్రమాలు చేస్తే బాగుంటుందనుకున్నాను. అప్పుడే మల్లాపూర్ గ్రామంలో మొట్ట మొదటిసారిగా నాకు వచ్చిన కుట్టు పనులను అక్కడి మహిళలకు నేర్పించి, వారికి ఆదాయ మార్గం చూపటం సంతృప్తినిచ్చింది.


పిల్లలకు ఫ్రీ ట్యూషన్ చెప్తున్న కృష్ణవేణి

ఇంటి వద్ద నుంచి..

సేవా కార్యక్రమాలు ఎలా చేయచ్చో ఆ అడుగులు ఎలాగూ నేర్పించాయి. ఇంట్లో మా వారికి చెప్పి పైన ఓ గదిని ఏర్పాటు చేశాను. ఇంట్లోనే ఉంటాను కాబట్టి మహిళలకు టైలరింగ్, సాయంకాలాలు పేద పిల్లలకు ట్యూషన్లు చెప్పేదాన్ని. ఇక్కడ ఒక్కచోటే సేవ చేస్తూ ఉంటే కాదు, మరికొందరికి ఉపాధిని అందిస్తే బాగుంటుందనే ఉద్దేశ్యంతో గ్రామాలకి వెళ్లడం ప్రారంభించాను. వెళ్లిన ఊళ్లో ముందుగా అక్కడ అనువైన స్థలం చూసుకొని, ఒక టీచర్‌ని ఏర్పాటు చేసి, నేర్చుకునేవారిని ఎంపిక చేసేదాన్ని. సాయిసంస్థ ద్వారానే రెండు నెలల పాటు 200 మందిని 10 బృందాలుగా చేసి, స్వయంగా శిక్షణ ఇచ్చాను. గృహిణిగా ఇంటి పనులు చేసుకుంటూ ఉండే నేను అలా ఒక్కో ఏడాది దాటుతూ సేవాకార్యక్రమాల్లో తీరిక లేకుండా అయిపోవడం ఎంతో సంతృప్తినిచ్చింది.

స్వచ్ఛంద సంస్థలతో కలిసి..

ఈ 10 ఏళ్లలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలోని 300 గ్రామాలలో దాదాపు పన్నెండు వేల మంది గ్రామీణ మహిళలకు కుట్టుమిషను, మెహెందీ, ఫ్యాషన్ డిజైనింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్, పేపర్ వర్క్, ఫ్యాషన్ జ్యువెలరీ తయారీ, బ్యూటీషియన్ .. వంటి శిక్షణా కార్యక్రమాలను ఉచితంగా నిర్వహించాం. ఆ తర్వాత ఈ సేవామార్గంలో కొన్ని స్వచ్ఛంద సంస్థల వాళ్లు పరిచయమయ్యారు. అలా మేధా చారిటీ, అభయ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థలతోనూ కలిసి గ్రామీణ మహిళలకు ఎనిమిది వేల కుట్టుమిషన్లు, ఇతర ఉపాధులకు అవసరమయ్యే పనిముట్లను ఏర్పాటు చేశాం.

పిల్లలకు ఫ్రీ ట్యూషన్లు

కరోనా తర్వాత పిల్లలకు చదువులు బాగా తగ్గిపోయాయి. డల్‌గా ఉన్న స్టూడెంట్స్ మరీ వెనకబడిపోకుండా ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు ఫ్రీ ట్యూషన్స్ ఏర్పాటు చేశాం. ఇందుకు ప్రభుత్వ స్కూల్ విద్యార్థులనే ఎంచుకుంటాం.

ఉపాధికి దారులు

అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలలో తెలిసినవారి నుంచి ఇక్కడి మహిళలకు ఆర్డర్ మీద వర్క్స్ ఇప్పిస్తుంటాను. ఈ ఆర్డర్లు తెచ్చుకోవడానికి ఈ బృందంలోని వారి నుంచి కొందరిని నియమిస్తాను. అమెరికాలో, దూరప్రాంతాల్లో తెలిసినవారుంటే వారికి మావాళ్లు చేసిన వర్క్స్ ఫోన్ల ద్వారా చూపించి, ఆర్డర్స్ తెప్పిస్తుంటాం. వారికి కొరియర్ ద్వారా పంపిస్తుంటాం. దీని ద్వారా ఈ మహిళలకు కొంత ఆదాయం లభిస్తుంది. కోర్సు తర్వాత వారి ఇంటి వద్దనే నేర్చుకున్న పనిని కొనసాగించేలా కూడా చూస్తున్నాం'' అని కృష్ణవేణి వివరించారు.

– నిర్మలారెడ్డి

ఆన్‌లైన్‌లో మహిళా భద్రతకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చే సైట్స్..

https://securityinabox.org/en/
https://exposingtheinvisible.org/resources/#filter=.watching-out-yourself
https://ssd.eff.org/
https://hackblossom.org/cybersecurity/
https://www.accessn

మీరు సైబర్ క్రైమ్‌కు గురైతే జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ https://www.cybercrime.gov.in/కు లాగిన్ చేసి, ఫిర్యాదును ఫైల్ చేయండి. నేషనల్ టోల్ ఫ్రీ నంబర్ 1930 కి ఫోన్ చేసి, సహాయం పొందవచ్చు.

సైబర్ టాక్

డిజిటల్ కూడలిలో మహిళ

వందన డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇంటా బయట చురుగ్గా ఉండే వందన వారం రోజులుగా ఇంటి గడప దాటి కాలు బయట పెట్టలేకపోతోంది. కారణం, తన వ్యక్తిగత ఫొటోలు, వీడియో క్లిప్పింగ్స్ ఒక సైట్‌లో కనపడటం ఆమెను కలవరపరుస్తోంది. వ్యక్తిగత పరువుకు సంబంధించిన విషయాలు బయటకు రావడం ఆమెను తీవ్ర మనో వేదనకు గురిచేస్తోంది. ఈ విషయాలను ఇంట్లో వారితో పంచుకోలేక, స్నేహితులతో చెప్పలేక ఇబ్బంది పడుతూ ఎటూ తేల్చుకోలేక ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. రకరకాల డిజిటల్ సమస్యలను ఎదుర్కొనే యువతుల సంఖ్య ఇటీవల విపరీతంగా పెరుగుతోంది.

ఇటీవల కాలంలో మహిళల అవకాశాలు ఇంటర్నెట్ ద్వారా విస్తృతమయ్యాయి. ఉపాధి అవకాశాలను పెంచుకోవడానికి, అదనపు ఆదాయాన్ని సంపాదించడానికి, జ్ఞానాన్ని, ఆర్థికవృద్ధిని, మరింత సమగ్రమైన డిజిటల్ ప్రపంచాన్ని సృష్టించడానికి వీలు కల్పిస్తుంది. అయితే, సైబర్ శాఖ ఆన్‌లైన్‌లో పెరుగుతున్న మహిళా ప్రయోజనాలనే కాదు, వారికి సమస్యగా మారే అంశాలను కూడా పరిశీలిస్తుంది. మహిళలు ఆన్‌లైన్‌లో తమ సురక్షిత ప్రయాణం సాగించడానికి డిజిటల్ భద్రత తెలుసుకోవడం అత్యవసరం.


ప్రతీకాత్మక చిత్రం

డిజిటల్ నేరాలలో ప్రధానమైనవి..

డాక్సింగ్ : ఇది ఒక వ్యక్తి లేదా సంస్థకు సంబంధించిన గతంలోని వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ మాధ్యమం ద్వారా బహిర్గతం చేసే చర్య. మోసగాళ్లు సాధారణంగా పబ్లిక్‌గా అందుబాటులో ఉన్న డేటాబేస్‌లు, గత సోషల్ మీడియా పోస్టింగ్‌లు, సోషల్ ఇంజనీరింగ్ నుండి సమాచారాన్ని పొంది, ఆన్‌లైన్ షేమింగ్ లేదా దోపిడీకి దారితీయవచ్చు.

సైబర్‌స్టాకింగ్: ఇది ఎలక్ట్రానిక్ మార్గాలను ఉపయోగించి ఒక వ్యక్తిని పదేపదే ట్రాక్ చేయడం. ఉదాహరణకు: అసందర్భంగా ఫోన్ కాల్స్ చేయడం, వాయిస్ సందేశాలు లేదా మెసేజీలు చేయడం, గూఢచర్యం లేదా సోషల్ మీడియా కార్యకలాపాలను పర్యవేక్షించడం లేదా ఇంటర్నెట్‌లో తగని సమాచారాన్ని పోస్ట్ చేస్తామని బెదిరించడం.. వంటి సైబర్‌స్టాకింగ్ శారీరక, మానసిక క్షోభకు దారితీయవచ్చు.

స్వాటింగ్: ఇది పోలీసులను రెచ్చగొట్టడానికి, మనల్ని మోసం చేయడానికి అత్యవసర ఫోన్ కాల్స్ చేయడం వంటి చర్య. ఇది సైబర్ దోపిడీకి ఒక రూపం. దీని ద్వారా వ్యక్తులు లైంగిక ప్రయోజనాలను పొందాలని చూస్తారు. లైంగిక వేధింపులు వ్యక్తిగత, సన్నిహిత ఫొటోల పంపిణీకి దారితీయవచ్చు.

రివెంజ్ పోర్న్: అసభ్యకరమైన చిత్రాలు లేదా వీడియోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి వేధిస్తారు. ఏ మాత్రం మన అనుమతి లేకుండా ఆన్‌లైన్‌లో షేర్ అవుతుంటాయి. ఇవి ఎక్కువగా బాధితురాలి మాజీ జీవిత భాగస్వామి లేదా బాయ్‌ఫ్రెండ్ ద్వారా జరిగేవి ఉంటాయి.

లైంగిక వేధింపులు: తెలియకనో లేక ఏదైనా భావోద్వేగ సమయంలోనో లైంగిక అనుకూల రిక్వెస్ట్‌లకు అనుమతి ఇస్తుంటారు. అంటే, ఫొటోలు, కంటెంట్, జోక్స్, మరొక స్త్రీ ద్వేషానికి సంబంధించినవి అయి ఉండవచ్చు. ఇవి ఒకరి ప్రతిష్ఠకు హాని కలిగించే వాస్తవాలు. ఉదాహరణకు.. 'దొంగ, అబద్ధాలకోరు లేదా అనైతిక ప్రవర్తన'.. వంటివి.

వంచన: మోసగాళ్లు మీలా నటిస్తూ నకిలీ ఖాతాను సృష్టిస్తారు. మీ సోషల్ మీడియా పరిచయాల నుండి డబ్బు అడుగుతారు, ఇది బాధితులను వేధించడానికి ఇతరులకు ప్రోత్సాహకంగా కూడా ఉపయోగపడుతుంది. ద్వేషపూరిత ప్రసంగాల ద్వారా రెచ్చగొట్టడం, జాతి విద్వేషాన్ని ప్రోత్సహించడం లేదా సమర్థించడం, రాజకీయ, కార్పొరేట్ లేదా పోటీదారుల పోటీలో పాల్గొనడం వంటివి ఉంటాయి.

సేఫ్టీ చిట్కాలు:

సమస్యలు వస్తాయని ఎవరూ తమ ప్రయోజనాలను వదులుకోరు. అయితే, బయట మన క్షేమం కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో, ఆన్‌లైన్ బజార్‌లోనూ అంతే భద్రంగా ఉండటం ముఖ్యం.

- HTTPS:// (ప్యాడ్‌లాక్ సింబల్) ఉన్న వెబ్‌సైట్‌లను మాత్రమే బ్రౌజ్ చేయండి.
- పెద్ద అక్షరాలు, సంఖ్యలు, ప్రత్యేక అక్షరాలను కలిగి ఉన్న సంక్లిష్ట పాస్‌వర్డ్‌ను ఉపయోగించండి.
- అన్ని సామాజిక, ఇ-మెయిల్, బ్యాంకింగ్ లాగిన్‌ల (2FA) కోసం రెండు-దశల ప్రమాణీకరణను పాటించండి.
- ఎస్సెమ్మెస్, వాట్సప్, సోషల్ మీడియా మెసెంజర్‌ల ద్వారా వచ్చిన చిన్న లింక్‌లను ఎప్పుడూ క్లిక్ చేయవద్దు.
- సామాజిక మాధ్యమాలలో ఫొటోలను చూస్తున్నప్పుడు లేదా అప్‌లోడ్ చేస్తున్నప్పుడు మీ లొకేషన్ స్టేటస్‌ను స్టాప్ చేయండి.
- ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ మెసెంజర్‌లను మాత్రమే ఉపయోగించండి.
- అన్ని సోషల్ మీడియా, మెసెంజర్, ఇ-మెయిల్ అప్లికేషన్‌ల కోసం ప్రైవసీ సెట్టింగ్స్‌ను సెట్ చేయండి.
- సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో (ఆర్థిక, లాగిన్ ఆధారాలు, సంస్థ, వ్యక్తిగత సమాచారం... వంటి) సెన్సిటివ్ సమాచారాన్ని పంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.
- నిజమైన, తెలిసిన వ్యక్తులతో మాత్రమే కనెక్ట్ అవ్వండి. ప్రత్యామ్నాయంగా, గోప్యతా సెట్టింగ్‌లను ఉపయోగించి మీరు మీ ప్రొఫైల్‌లను లాక్ చేయడాన్ని ఎంచుకోవచ్చు.
- ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పరస్పర చర్యలలో సమ్మతిని ఒకే విధంగా పరిగణించాలి.
- మీ వెబ్‌క్యామ్‌ను ఎప్పుడూ ప్లగ్ ఇన్ చేసి ఉంచవద్దు.
- యాంటీ-వైరస్, యాంటీ-మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌లతో మీ స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను సురక్షితం చేయండి.
- ఇది సురక్షితమైన నెట్‌వర్క్ అని మీరు నిర్ధారించుకునే వరకు పబ్లిక్ వై ఫైని ఎప్పుడూ యాక్సెస్ చేయవద్దు.
- ప్రసిద్ధ మూలాధారాల నుండి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేయండి (ప్లే స్టోర్ లేదా యాపిల్ స్టోర్ వంటివి).



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



సెమీఫైనల్లో రోహన్ బోపన్న జోడీ

ఖతర్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. దోహాలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 1-6, 6-4, 11-9తో భారత్‌కే చెందిన సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ జంటను ఓడించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. సాకేత్-యూకీలకు 12,750 డాలర్ల (రూ. 10 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఐపీఎల్ టోర్నీ మధ్యలోనే వెళ్లిపోతా: స్టోక్స్



ఐర్లాండ్‌తో జరిగే ఏకైక టెస్టు, ఆస్ట్రేలియాతో జరిగే యాషెస్ సిరీస్ సన్నాహాల కోసం ఐపీఎల్ టి20 టోర్నీ మొత్తం మ్యాచ్‌లు ఆడబోనని ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ తెలిపాడు. మార్చి 31 నుంచి మే 28 వరకు ఐపీఎల్ జరుగుతుంది. ఐర్లాండ్‌తో ఏకైక టెస్టు జూన్ 1 నుంచి, యాషెస్ సిరీస్ జూన్ 16 నుంచి జరుగుతాయి. గత రెండు ఐపీఎల్ సీజన్‌లకు దూరంగా ఉన్న స్టోక్స్‌ను గత డిసెంబర్‌లో చెన్నై జట్టు రూ. 16 కోట్ల 25 లక్షలకు కొనుగోలు చేసింది.

ప్రతాప్ సింగ్‌కు స్వర్ణం



కైరో (ఈజిప్టు): ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్ ఖాతాలో నాలుగో స్వర్ణ పతకం చేరింది. బుధవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ పసిడి పతకం సాధించాడు. ఫైనల్లో 22 ఏళ్ల ప్రతాప్ సింగ్ 16-6తో అలెగ్జాండర్ షిమిర్ల్ (ఆస్ట్రియా)పై గెలుపొందాడు. ఎనిమిది మంది పాల్గొన్న ర్యాంకింగ్ రౌండ్‌లో షిమిర్ల్, ప్రతాప్ సింగ్ వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచి ఫైనల్ చేరారు. భారత్‌కే చెందిన అఖిల్ షెరాన్ ఏడో ర్యాంక్‌లో నిలిచాడు. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ రిథమ్ సాంగ్వాన్ రెండో ర్యాంకింగ్ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన మను భాకర్, ఇషా సింగ్ క్వాలిఫయింగ్‌లో వరుసగా 32వ, 34వ స్థానాల్లో నిలిచారు.

యూపీ వారియర్స్ కెప్టెన్‌గా అలీసా హీలీ



లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే యూపీ వారియర్స్ జట్టుకు ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్ అలీసా హీలీ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. యూపీ వారియర్స్ జట్టులో సభ్యురాలైన భారత ఆల్‌రౌండర్, ఉత్తరప్రదేశ్‌కే చెందిన దీప్తి శర్మను కాదని అనుభవజ్ఞురాలైన అలీసా హీలీకి సారథ్య బాధ్యతలు అప్పగించారు. వికెట్ కీపర్, ఓపెనర్ బ్యాటర్ అయిన 32 ఏళ్ల అలీసా ఇప్పటి వరకు 139 అంతర్జాతీయ టి20లు ఆడి 2,446 పరుగులు సాధించింది. ఇందులో ఒక సెంచరీ, 14 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఐదుసార్లు టి20 ప్రపంచకప్ టైటిల్ (2010, 2012, 2014, 2018, 2020) సాధించిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యురాలిగా ఉన్న అలీసా గత ఏడాది న్యూజిలాండ్ వేదికగా వన్డే వరల్డ్‌కప్ నెగ్గిన ఆసీస్ జట్టులోనూ కీలకపాత్ర పోషించింది. తొలి డబ్ల్యూపీఎల్ మార్చి 4 నుంచి 26 వరకు ముంబైలో జరుగుతుంది.

ప్రతీకార పోరుకు సై...

ఆస్ట్రేలియా సొంతగడ్డపై గత మెగా ఈవెంట్ ఫైనల్లో మన 'ప్రపంచకప్' కలని కలగానే మిగిల్చింది. మళ్లీ బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో 'స్వర్ణ'వకాశాన్ని ఎగరేసుకుపోయింది. ఈ రెండు ఫైనల్స్‌లో ఓడిన భారత్ చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇప్పుడు కంగారూ అమ్మాయిల్ని తుదిపోరుకు చేరకుండా చేసే అవకాశం సెమీస్ మ్యాచ్ ద్వారా భారత్‌కు లభించింది. హర్మన్‌ప్రీత్ సేన సమష్టిగా రాణించి ఆసీస్‌ను దెబ్బకొట్టాల్సిన తరుణం వచ్చేసింది. నిలకడగా రాణిస్తున్న ఆస్ట్రేలియాను భారత్ ఓడించి ఫైనల్ పోరుకు అర్హత సాధిస్తుందా లేక మరోసారి ఓటమి మూటగట్టుకుంటుందా వేచి చూడాలి.

- నేడు ఆస్ట్రేలియాతో భారత్ సెమీఫైనల్
- సాయంత్రం గం. 6:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్'లో ప్రత్యక్ష ప్రసారం



కేప్‌టౌన్: భారత అమ్మాయిల ఆట నాకౌట్‌కు చేరింది. ఇక్కడ రెండు మ్యాచ్‌లు గెలిస్తే ప్రపంచకప్ చేతికి అందుతుంది. ఇందులో మొదటి అడుగు వేసేందుకు భారత మహిళల జట్టు నేడు పటిష్టమైన డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో తొలి సెమీఫైనల్లో తలపడుతుంది. 'కంగారూ' జట్టు భారత్‌కెపుడూ మింగుడు పడని ప్రత్యర్థే! గత ప్రపంచకప్‌లోనే కాదు... తొలిసారి కామన్వెల్త్ గేమ్స్‌లో ప్రవేశ పెట్టిన క్రికెట్‌లోనూ చాంపియన్ కాకుండా అడ్డుకుంది. ఆఖరి పోరులో భారత్‌ను పరాజితగా నిలిపిన ఆస్ట్రేలియా జట్టుపై ప్రతీకారం కోసం ఎదురు చూస్తున్న హర్మన్‌ప్రీత్ సేనకు ఇదే సరైన సమయం. బ్యాటర్లంతా ఫామ్‌లో ఉండటం, బౌలింగ్ నిలకడగా ఉండటం జట్టు అవకాశాల్ని మెరుగు పరుస్తోంది. అయితే ఆసీస్ ఆషామాషీ జట్టు కాదు. ఈ పొట్టి మెగా ఈవెంట్ ఏడుసార్లు జరిగితే ఇందులో 'హ్యాట్రిక్' సహా ఐదుసార్లు (2010, 2012, 2014, 2018, 2020) గెలిచిన గట్టి ప్రత్యర్థి. ఇలాంటి జట్టును ఓడించాలంటే ఒక్క ఫామ్ ఉంటే సరిపోదు! సర్వశక్తులు ఒడ్డితేనే అనుకున్న ఫలితం సాధించవచ్చు. కచ్చితంగా ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిస్తేనే భారత్ ఆఖరి పోరుకు అర్హత సాధిస్తుంది. ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా తప్పకుండా బ్యాట్‌కు పని చెప్పాల్సిందే. మిడిలార్డర్‌ను హర్మన్, రిచా ఘోష్ నడిపిస్తే పరుగులు వేగంగా సాధించవచ్చు. బౌలింగ్‌లో రేణుక సింగ్ పదును చూపెట్టాలి. శిఖా పాండే, దీప్తి శర్మలు కూడా రాణించాలి.

అజేయంగా ఆస్ట్రేలియా

ఈ ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా అజేయంగా సాగుతోంది. గ్రూప్-1లో ఎదురేలేని జట్టుగా నిలిచి సెమీస్ చేరింది. పటిష్టమైన న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించి మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసిన కంగారూ సేన ఇప్పటివరకు అన్నీ ఆల్‌రౌండ్ ప్రదర్శనతోనే విజయాలు సాధించింది. దక్షిణాఫ్రికాతో ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడని వికెట్ కీపర్ అలీసా హీలీ పూర్తి ఫిట్‌నెస్‌తో అందుబాటులోకి వచ్చింది. టాపార్డర్‌లో ఆమెతో పాటు బెత్ మూనీ, కెప్టెన్ మెగ్ లానింగ్ మెరుపులు మెరిపిస్తున్నారు. మిడిలార్డర్‌లో ఆష్లే గార్డ్‌నర్, ఎలీస్ పెర్రీ, గ్రేస్ హారిస్, తాలియా మెక్‌గ్రాత్‌లు కూడా బ్యాటింగ్‌లో సత్తా చాటుతుండటంతో ఏడో వరుస వరకు బ్యాటింగ్ ఆర్డర్‌కు ఢోకా లేదు. బౌలర్లలో మేగన్ షుట్, డార్సీ బ్రౌన్, అలానా కింగ్‌లు ప్రత్యర్థి బ్యాటర్లను హడలెత్తించగలరు.

30 అంతర్జాతీయ టి20ల్లో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు. ఇందులో భారత్ 6 మ్యాచ్‌ల్లో నెగ్గింది. ఆస్ట్రేలియా 22 మ్యాచ్‌ల్లో గెలిచింది. ఒక మ్యాచ్ 'టై'కాగా... మరో మ్యాచ్ రద్దయింది. టి20 ప్రపంచకప్ చరిత్రలో ఈ రెండు జట్లు ఐదుసార్లు తలపడ్డాయి. రెండు మ్యాచ్‌ల్లో భారత్, మూడు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా విజయం సాధించాయి.

తుది జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ, రిచా ఘోష్, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, పూజ, శిఖా పాండే, రాజేశ్వరి గైక్వాడ్, రాధా యాదవ్, రేణుక.

ఆస్ట్రేలియా: మెగ్ లానింగ్ (కెప్టెన్), బెత్ మూనీ, అలీసా హీలీ, ఎలీస్ పెర్రీ, ఆష్లే గార్డ్‌నర్, తాలియా మెక్‌గ్రాత్, గ్రేస్ హారిస్, జార్జియా, అలానా కింగ్, మేగన్ షుట్, డార్సీ బ్రౌన్.

రెండో సెమీస్‌లో ఇంగ్లండ్‌తో దక్షిణాఫ్రికా 'ఢీ'

మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీలో సెమీఫైనల్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు అదరగొట్టింది. గ్రూప్-1 చివరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 10 వికెట్లతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. దాంతో గ్రూప్-1లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక నాలుగు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్‌తో దక్షిణాఫ్రికా (0.738) సెమీస్ చేరగా... న్యూజిలాండ్ (0.138), శ్రీలంక (-1.460) ఇంటిముఖం పట్టాయి. దక్షిణాఫ్రికాతో పోరులో మొదట బంగ్లాదేశ్ 6 వికెట్లకు 113 పరుగులు చేసింది. తర్వాత దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 117 పరుగులు చేసింది. ఓపెనర్లు వోల్వార్ట్ (66 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), తజ్మిన్ బ్రిట్స్ (50 నాటౌట్; 4 ఫోర్లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. శుక్రవారం జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో దక్షిణాఫ్రికా ఆడుతుంది.


బ్రిట్స్


వోల్వార్ట్

ప్రపంచ చెస్ చాంపియన్ కార్ల్‌సన్‌పై విదిత్ విజయం





చెన్నై: ప్రొ చెస్ లీగ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతి గొప్ప ఫలితం సాధించాడు. ప్రపంచ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)పై విదిత్ గెలుపొందాడు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఇండియన్ యోగిస్ జట్టు తరఫున పోటీపడుతున్న విదిత్ బ్లిట్జ్ గేమ్‌లో 58 ఎత్తుల్లో కెనడా చెస్‌బ్రాస్ జట్టు తరఫున ఆడుతున్న కార్ల్‌సన్‌పై విజయం సాధించాడు. 16 జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీని లక్షా 50 వేల డాలర్ల ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో కార్ల్‌సన్‌ను ఓడించిన నాలుగో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ కావడం విశేషం. ప్రజ్ఞానంద, గుకేశ్, ఇరిగేశి అర్జున్ కూడా ఈ నార్వే దిగ్గజంపై వివిధ టోర్నీలలో గెలుపొందారు.

అండర్సన్... ఐదేళ్ల తర్వాత మళ్లీ 'టాప్'లోకి...



దుబాయ్: ఐసీసీ టెస్టు బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ పేస్ బౌలర్ అండర్సన్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. చివరిసారి 2018లో అండర్సన్ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో అండర్సన్ ఏడు వికెట్లు పడగొట్టడంతో రెండు స్థానాలు ఎగబాకి 866 పాయింట్లతో అగ్రస్థానానికి చేరాడు. 1936 తర్వాత ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్ సాధించిన పెద్ద వయస్కుడిగా అండర్సన్ (40 ఏళ్ల 207 రోజులు) గుర్తింపు పొందాడు. భారత స్పిన్నర్ అశ్విన్ 864 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో ఉన్నాడు.

స్వదేశానికి ఆసీస్ స్పిన్నర్ అగర్



న్యూఢిల్లీ: భారత పర్యటనలో ఉన్న ఆస్ట్రేలియా జట్టు ఎడంచేతి వాటం స్పిన్నర్ ఆష్టన్ అగర్ స్వదేశానికి వెళ్లిపోయాడు. భారత్‌తో జరిగే చివరి రెండు టెస్టుల్లో పాల్గొనే ఆస్ట్రేలియా తుది జట్టులో అతనికి స్థానం లభించే అవకాశం లేకపోవడంతో... దేశవాళీ మ్యాచ్‌లు ఆడేందుకు రమ్మన్నట్లు జాతీయ సెలక్టర్ టోనీ తెలిపారు.

సినిమా

ఫారిన్ స్టోరీ.. బాలీవుడ్ మూవీ

విదేశీ కథలపై హిందీ దర్శక-నిర్మాతలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నట్లుగా తెలుస్తోంది. దాదాపు పది విదేశీ చిత్రాలు రీమేక్ రూపంలో హిందీ తెరపై కనిపించనున్నాయి. ఆ ఫారిన్ చిత్రాల్లోని కథలు ఇండియన్ ఆడియన్స్‌కు దగ్గరగా ఉండటంతో రీమేక్ చేస్తున్నారు. ఇక ఫారిన్ స్టోరీతో రీమేక్ అవుతున్న బాలీవుడ్ మూవీస్ గురించి తెలుసుకుందాం.



● సల్మాన్ ఖాన్ ● షాహిద్ ● సోనమ్ ● అమితాబ్, దీపికా ● టైగర్ ష్రాఫ్

స్పానిష్ స్పోర్ట్స్ అండ్ కామెడీ డ్రామా 'చాంపియన్స్' (2018) హిందీ రీమేక్‌ను నిర్మించే ఆలోచనలో ఉన్నట్లుగా ఆమిర్ ఖాన్ ఇటీవల ఓ సందర్భంలో పేర్కొన్న సంగతి గుర్తుండే ఉంటుంది. అయితే ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ మెయిన్ లీడ్ రోల్ చేయనున్నారని తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా కోసం ఆమిర్, సల్మాన్‌లు కలిసి చర్చించుకున్నారు. ఈ చిత్రానికి ఆమిర్ నిర్మాతగా మాత్రమే వ్యవహరించాలనుకుంటున్నారట. ఒకవైపు ఈ రీమేక్ గురించి చర్చిస్తూనే మరోవైపు సౌత్ కొరియన్ డిటెక్టివ్ డ్రామా 'వెటరన్' (2015) హిందీ రీమేక్‌లో నటించేందుకు సల్మాన్ ఖాన్ ఆసక్తి చూపిస్తున్నారని టాక్. 'వెటరన్' హిందీ రీమేక్ హక్కులను బాలీవుడ్ దర్శక -నిర్మాత అతుల్ అగ్నిహోత్రి దక్కించుకున్నారు. ఇక అమెరికన్ కామెడీ డ్రామా 'ది ఇంటర్న్' (2015) హిందీ రీమేక్‌లో అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్ లీడ్ రోల్స్ చేయనున్నారు. ఈ రీమేక్‌కి అమిత్ శర్మ దర్శకత్వం వహించనున్నారు. అయితే ఈ సినిమా ప్రకటన ఎప్పుడో వచ్చినప్పటికీ ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. ఈ సినిమా నుంచి దీపికా తప్పుకునే ఆలోచనలో ఉన్నారని, అందుకే షూటింగ్ ఆరంభించలేదని టాక్. కాగా, ఫ్రెంచ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ట్రాన్స్‌పోర్టర్' (2002) హిందీ రీమేక్ రైట్స్‌ను దక్కించుకున్నారు నిర్మాత విశాల్ రానా. ఇందులో హృతిక్ రోషన్, రణ్‌వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్‌లలో ఎవరో ఒకరు నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. అలాగే అమెరికన్ సూపర్‌హిట్ యాక్షన్ ఫ్రాంచైజీ 'ర్యాంబో' రీమేక్‌లో టైగర్ ష్రాఫ్ హీరోగా నటించనున్నారని ప్రకటన వచ్చింది. ఇక షాహిద్ కపూర్ హీరోగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో 'బ్లడీ డాడీ' అనే సినిమా రూపొందుతోంది. ఇది ఫ్రెంచ్ ఫిల్మ్ 'స్లీప్‌లెస్ నైట్' (2011)కు రీమేక్ అనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. అదే విధంగా సౌత్ కొరియన్ క్రైమ్ థ్రిల్లర్ 'బ్లైండ్' (2011) హిందీ రీమేక్‌లో సోనమ్ కపూర్ లీడ్ రోల్ చేస్తున్నారు. అలాగే ఆస్కార్ విన్నింగ్ ఫిల్మ్ 'కోడ' (2021) రీమేక్‌ను దర్శకుడు విశాల్ బాల్ తెరకెక్కించనున్నారని, అమెరికన్ మార్షల్ ఆర్ట్స్ ఫిల్మ్ 'కిల్ బిల్' (2003) రీమేక్ అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రూపొందనుందనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఇలా విదేశీ చిత్రాల హిందీ రీమేక్ జాబితాలో మరికొన్ని కూడా ఉన్నాయి.

మనసును హైజాక్ చేసి...

'మళ్లీ మళ్లీ నువ్వే ఎదురెదురొస్తే దట్స్ ఏ సైన్ అని మనసంటుందే.. నా లేటెస్ట్ మిషనువు నువ్వే.. సాధించాలనిపిస్తుందే...' అంటూ సాగుతుంది 'ఏజెంట్' చిత్రంలోని పాట. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న స్పై యాక్షన్ ఫిల్మ్ 'ఏజెంట్'. ఇందులో సాక్షీ వైద్య హీరోయిన్. ఈ సినిమా నుంచి 'మళ్లీ మళ్లీ నువ్వే... మనసే హైజాక్ చేసి కొల్లగొట్టావు' అంటూ సాగే పాటను చిత్ర యూనిట్ బుధవారం విడుదల చేసింది. ఆదిత్యా అయ్యంగార్ సాహిత్యం అందించిన ఈ పాటను ఈ చిత్ర సంగీత దర్శకుడు హిప్‌హప్ తమిళ పాడారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్‌రెడ్డి 2 సినిమాస్ పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజయ్ సుంకర, దీపారెడ్డి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 'ఏజెంట్' చిత్రం ఏప్రిల్ 28న విడుదల కానుంది.



● అఖిల్, సాక్షీ వైద్య



● 'అల్లరి' నరేష్, మిర్నా, హరీష్ పెద్ది, నాగచైతన్య, సాహు గారపాటి, విజయ్ కనకమేడల

ఉగ్రం టీజర్ అదిరిపోయింది - నాగచైతన్య

''ఉగ్రం' సినిమా టీజర్ అదిరిపోయింది.. నెక్ట్స్ లెవల్‌లో ఉందనిపించింది. 'నాంది' తర్వాత నరేష్ మళ్లీ అలాంటి ఇంటెన్స్ రోల్ చేయడం ఆనందంగా ఉంది'' అని హీరో నాగచైతన్య అన్నారు. 'నాంది' వంటి సూపర్ హిట్ తర్వాత హీరో 'అల్లరి' నరేష్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ఉగ్రం'. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ని నాగచైతన్య రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నరేష్, విజయ్ కాంబినేషన్ ఒక బ్రాండ్‌లా ఉంది. సాహు, హరీష్ అద్భుతమైన నిర్మాతలు. నా కెరీర్‌లో 'మజిలీ' వంటి మంచి సినిమా ఇచ్చారు వారు. ఆ సినిమాలా 'ఉగ్రం' బ్లాక్ బస్టర్ కావాలి'' అన్నారు. నరేష్ మాట్లాడుతూ– ''ఒక నటుణ్ణి దర్శకుడు ఎంత నమ్మితే అన్ని మంచి విజయాలు వస్తాయి. మా నాన్నగారు (ఈవీవీ సత్యనారాయణ) నన్ను నమ్మినప్పుడు వరుస విజయాలు వచ్చాయి. క్రిష్‌గారు నన్ను నమ్మినప్పుడు 'గమ్యం', సముద్రఖని నమ్మినప్పుడు 'శంభో శివ శంభో' వంటి మంచి సినిమాలు వచ్చాయి. ఆ తర్వాత 'నాంది'తో విజయ్ నాకు కొత్త రూటు చూపించారు'' అన్నారు. ''నిజాయితీగా సినిమా తీస్తే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'నాంది' విజయం చూపించింది.. 'ఉగ్రం' కూడా అంతే నిజాయితీగా ఉంటుంది'' అన్నారు విజయ్ కనకమేడల.

మా టీమ్ సక్సెస్ సీక్రెట్ అదే - బన్నీ వాసు

''వినరో భాగ్యము విష్ణు కథ' విషయంలో కొత్తవారి మీద చాలా ఎక్కువగా ఖర్చు పెట్టారా? అని కొందరు అడుగుతున్నారు. అల్లు అరవింద్‌గారి క్రమశిక్షణ వల్ల మా ఖర్చు హద్దుల్లో ఉంటుంది. అదే మా టీమ్ సక్సెస్ సీక్రెట్'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. కిరణ్ అబ్బవరం, కశ్మీర జంటగా మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'.



● బన్నీ వాసు, కిరణ్, కశ్మీర, మురళీ కిషోర్

అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''నేను తీసిన అన్ని సినిమాల్లోకెల్లా త్వరగా బ్రేక్ ఈవెన్ అయిన చిత్రమిది. ఇప్పుడిప్పుడే 'కేజీఎఫ్, విక్రమ్' వంటి సినిమాల ఫార్మాట్లకు ప్రేక్షకులు అలవాటుపడుతున్నారు. కొత్త దర్శకులకు ధైర్యాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా తీశాం'' అన్నారు. ''ఈ సినిమాతో మా అందరికీ గౌరవం వచ్చింది.. ఆదరించిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు కిరణ్ అబ్బవరం. ''మా చిత్రం కేవలం నంబర్ నైబర్ కాన్సెప్ట్ కోసం తీసింది కాదు. అమ్మ సెంటిమెంట్ కూడా ఉంది'' అన్నారు మురళీ కిషోర్ అబ్బూరు. నిర్మాత ఎస్‌కేఎన్, మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్ మాట్లాడారు.

ఆస్పత్రిలో ప్రభు



ప్రముఖ నటుడు ప్రభు అనారోగ్యం బారిన పడ్డారు. రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆయన చెన్నై కోడంబాక్కంలోని మెడ్‌వే ఆస్పత్రిలో చేరారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో రాళ్లను తొలగించడానికి యురిట్రోస్ కోపీ అనే లేజర్ శస్త్ర చికిత్సను మంగళవారం నిర్వహించారు. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని, రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు పేర్కొన్నారు.

సాచి హిట్ కావాలి - ప్రభాస్

''సాచి' సినిమా ట్రైలర్ బాగుంది. మహిళా సాధికారతకు సంబంధించిన చిత్రం ఇది. ఇలాంటి మంచి సినిమా హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అని హీరో ప్రభాస్ అన్నారు. సంజన రెడ్డి, గీతిక రథన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సాచి'. సత్యానంద్ సమర్పణలో వివేక్ పోతగోని స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా మార్చి 3న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని ప్రభాస్ విడుదల చేశారు. వివేక్ పోతగోని మాట్లాడుతూ– ''బిందు అనే ఒక నాయీ బ్రాహ్మణ అమ్మాయి నిజ జీవిత గాథ ఇది. తెలంగాణ నాయీబ్రాహ్మణ అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్‌గారు మా చిత్రం ప్రివ్యూ చూసి, బాగుందని అభినందించారు. ఈ చిత్రం అన్ని వర్గాల వారికి నచ్చుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కేవీ భరద్వాజ్, నిర్మాణ సారథ్యం: ఉపేన్ నడిపల్లి, వివేక్ పోతగోని.



● ప్రభాస్, సత్యానంద్

వినోదం.. సందేశం

మణి సాయితేజ, రేఖ నిరోషా జంటగా నటించిన చిత్రం 'మెకానిక్'. ముని సహేకర దర్శకత్వంలో ఎమ్. నాగ మునెయ్య నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేసి, చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ''ఓ బర్నింగ్ ప్రాబ్లమ్‌కు కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి, గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రం ఇది. వినోదంతో పాటు సందేశం కూడా ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, సహనిర్మాతలు: కొండ్రాసి ఉపేందర్ – నంది పాటి శ్రీధర్ రెడ్డి.



● మణి సాయితేజ, 'దిల్' రాజు

స్పీకర్ ఆన్ చేసి మాట్లాడాలి

నవీన్ నేని, ప్రణీత పట్నాయక్ ముఖ్య తారలుగా కెఎస్ హేమరాజ్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'రిచిగాడి పెళ్లి'. త్వరలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు దర్శకుడు హరీష్ శంకర్. 'ఏ ఫోన్‌కాల్ వచ్చినా స్పీకర్ ఆన్ చేసి మాట్లాడాలి అంతే..!', 'రిచిగాడి పెళ్లి' జీవితంలో మర్చిపోకూడదు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''మానవ సంబంధాలకు అద్దం పట్టే కథతో 'రిచిగాడి పెళ్లి'ని రూపొందించాం'' అన్నారు హేమరాజ్.



● హరీష్ శంకర్, నవీన్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
928	272
59,745	17,554

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	11,538	△	45
డోజోన్స్	33,221	△	91
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,931	▽	47
డాక్స్	15,400	△	2
హాంగ్‌సెంగ్	3,291	▽	15
నికాయ్	27,104	▽	369

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	56,496	△	112
బంగారం (22 క్యారెట్)	56,270	△	112
వెండి (కిలో)	65,986	△	216

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.07	83.74
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.82	89.92
€	యూరో	ఒకటి	98.80	102.15
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	60.51	62.46
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.55	57.92
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.92	62.88
SAR	సౌదీ రియాల్	ఇండిజిషన్	21.01	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	ఇండిజిషన్	21.66	23.45
¥	చైనా యువాన్	ఇండిజిషన్	10.89	12.97

అయిదు నెలల్లో అతిపెద్ద పతనం

- భౌగోళిక ఉద్రిక్తతలు, వడ్డీరేట్ల పెంపు ప్రభావం
- అన్ని రంగాల షేర్లలో అమ్మకాలే
- 61 వేల దిగువకు సెన్సెక్స్
- నెల కనిష్టానికి నిఫ్టీ

ముంబై: వడ్డీరేట్ల పెంపు, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావంతో బుధవారం దలాల్ స్ట్రీట్ కుప్పకూలింది. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ బేర్ సంపూర్ణ ఆధిక్యతను ప్రదర్శించడంతో బెంచ్‌మార్క్ సూచీలు అయిదు నెలల్లో అతిపెద్ద పతనాన్ని చవిచూశాయి. అన్ని రంగాల షేర్లలో అమ్మకాల సునామీ తలెత్తడంతో సెన్సెక్స్ 928 పాయింట్లు నష్టపోయి 59,745 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 272 పాయింట్లు క్షీణించి 17,554 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది వరుసగా నాలుగోరోజూ నష్టాల ముగింపు. సెన్సెక్స్ సూచీలో 30 షేర్లకు గానూ ఒక్క ఐటీసీ(0.41%) మాత్రమే లాభంతో ముగిసింది. నిఫ్టీ 50 ఇండెక్స్‌లో నాలుగు షేర్లు మాత్రమే నష్టాల నుంచి గట్టెక్కాయి. మార్కెట్లో అస్థిరతను సూచించే వీఐఎక్స్ ఇండెక్స్ ఏకంగా 11 శాతం పెరగడంతో మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు ఒకశాతానికి పైగా క్షీణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.580 కోట్ల షేర్లను అమ్మేశారు. డీఐఐలు రూ.372 కోట్ల షేర్లను కొన్నారు. అమెరికా స్టాక్ మార్కెట్లు మంగళవారం ఈ ఏడాదిలోనే అతి పెద్ద పతనాన్ని చవిచూశాయి. బుధవారం ఆసియా మార్కెట్లు రెండుశాతం, యూరప్ మార్కెట్లు అర శాతం నష్టపోయాయి.



4 రోజుల్లో రూ. 7 లక్షల కోట్ల నష్టం

గడచిన నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1530 పాయింట్లు, నిఫ్టీ 462 పాయింట్ల చొప్పున క్షీణించాయి. సూచీలు మూడుశాతానికి పైగా కుదేలవడంతో స్టాక్ మార్కెట్లో దాదాపు రూ. 7 లక్షల కోట్లు నష్టం వాటిల్లింది. బుధవారం ఒక్కరోజే రూ.3.87 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. దీనితో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.261 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ఇంట్రాడే ట్రేడింగ్ ఇలా

ఉదయం సెన్సెక్స్ 281 పాయింట్ల పతనంతో 60391 వద్ద, నిఫ్టీ 72 పాయింట్ల నష్టంతో 17,755 వద్ద మొదలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో బలహీనతల ప్రభావంతో తొలి నుంచీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపారు. ఒకదశలో సెన్సెక్స్ 992 పాయింట్లు క్షీణించి 59,681 వద్ద, నిఫ్టీ 297 పాయింట్లు నష్టపోయి 17,529 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేశాయి.

నష్టాలు ఎందుకంటే...

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌లో పర్యటించిన కొన్ని గంటలకే అణు ఒప్పందం నుంచి రష్యా తప్పుకుంటుందని వ్లాదిమిర్ పుతిన్ ప్రకటనతో రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు చెలరేగాయి. ఫెడ్ మినిట్స్ వెల్లడికి ముందు అప్రమత్తత, వడ్డీ రేట్ల పెంపు భయాలు, బాండ్లపై రాబడులు పెరగడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. దేశీయంగా ఆర్‌బీఐ మినిట్స్ వెల్లడి (మార్కెట్ ముగింపు తర్వాత), ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ ముగింపు(నేడు) నేపథ్యంలో ఇన్వెస్టర్లు జాగ్రత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు. అదానీ గ్రూప్ షేర్లలో అమ్మకాల పరంపర ఒత్తిడిని మరింత పెంచింది. విదేశీ ఇన్వెస్టర్లు వరుసగా నాలుగోరోజూ అమ్మకాలు పాల్పడ్డారు. ఈ జాతీయ అంతర్జాతీయ పరిణామాలు దేశీయ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ''గత మూడు ట్రేడింగ్ సెషన్లలో బేర్స్‌కు ఎదురొడ్డి నష్టాలను పరిమితం చేసిన బుల్స్ బుధవారం చేతులెత్తేశారు. కోవిడ్, అధిక ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు భయాల నుంచి మార్కెట్ రికవరీ అవుతున్న తరుణంలో అమెరికా, రష్యా, ఉక్రెయిన్ దేశాల ప్రచ్ఛన్న యుద్ధం సెంటిమెంట్‌ను పూర్తిగా దెబ్బతీసింది. ప్రస్తుతానికి నిఫ్టీకి 17,500 వద్ద మద్దతు ఉంది. ఈ కీలక స్థాయిని కోల్పోతే మరో దఫా లాభాల స్వీకరణ జరిగే వీలుంది. దిగువ స్థాయిలో 17,350 వద్ద మరో మద్దతు ఉంది'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెన్సెక్స్ కీలకమైన 60 వేల స్థాయిని కోల్పోయి మూడువారాల కనిష్టం వద్ద ముగిసింది. నిఫ్టీ 17,500 స్థాయికి చేరువలో నెల కనిష్టం వద్ద స్థిరపడింది.
- ఇండెక్సులో అధిక వెయిటేజీ గల రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ద్వయం, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్ బ్యాంక్ షేర్లు 3 నుంచి 2శాతం నష్టపోయి సూచీల భారీ పతనానికి ప్రధాన కారణమయ్యాయి.
- వడ్డీరేట్ల పెంపు, ఆర్థిక మాంద్య భయాలతో రియల్టీ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. గోద్రేజ్ ప్రాపర్టీస్, డీఎల్ఎఫ్, మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్స్ షేర్లు మూడు శాతం నష్టపోయాయి. శోభ, ఓబెరాయ్ రియల్టీ, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్, ప్రెస్టేజ్ ఎస్టేట్స్ షేర్లు 1-2% చొప్పున పతనమయ్యాయి. మైండ్‌స్పేస్ రీట్, బ్రూక్‌ఫీల్డ్ రీట్ షేర్లు అరశాతం చొప్పున నష్టపోయాయి.

వడ్డీ రేట్ల డెరివేటివ్స్ వేళల పొడిగింపు

- సాయంత్రం 5 గంటల వరకు పెంచిన ఎన్‌ఎస్‌ఈ
- గురువారం నుంచి అమల్లోకి
- ఎక్స్‌పైరీ తేదీకి వర్తింపు



న్యూఢిల్లీ: వడ్డీ రేట్ల డెరివేటివ్స్ ట్రేడింగ్ వేళలను కాంట్రాక్టు ఎక్స్‌పైరీ తేదీల్లో సాయంత్రం 5 గం.ల వరకూ పొడిగించాలని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) నిర్ణయించింది. దీన్ని గురువారం నుంచి అమలు చేయనుంది. ప్రస్తుతం కాంట్రాక్టుల ట్రేడింగ్ సమయం ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 3.30 గం. వరకు ఉంటోంది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన వడ్డీ రేట్ల డెరివేటివ్ కాంట్రాక్టుల ట్రేడింగ్ వేళలు ఫిబ్రవరి 23న (ఎక్స్‌పైరీ తేదీ) సాయంత్రం 5 గం. వరకు ఉంటాయని ఎన్‌ఎస్‌ఈ తెలిపింది. ఆ రోజున మిగతా వడ్డీ రేట్ల డెరివేటివ్ కాంట్రాక్టుల వేళల్లో మాత్రం మార్పులేమీ ఉండవని తెలిపింది. ఆయా కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ తేదీల్లో మాత్రం సాయంత్రం 5 గం. వరకు ట్రేడింగ్ అందుబాటులో ఉంటుందని వివరించింది. ఈక్విటీ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ వేళలను పొడిగించాలని ఎన్‌ఎస్‌ఈ యోచిస్తోందన్న వార్తల నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం దేశీ స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్ వేళలు ఉదయం 9.15 గం. నుంచి సాయంత్రం 3.30 గం. వరకు, కమోడిటీ డెరివేటివ్స్ సెగ్మెంట్ వేళలు ఉదయం 10 గం. నుంచి రాత్రి 11.55 గం. వరకు ఉంటున్నాయి.

రిస్కుల హెడ్జింగ్‌కు ఉపయోగపడుతుంది..

దేశీ స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్ వేళలను పొడిగిస్తే .. క్రితం రోజు అంతర్జాతీయంగా చోటుచేసుకునే పరిణామాల వల్ల తలెత్తే రిస్కులను హెడ్జింగ్ చేసుకునేందుకు ఉపయోగపడగలదని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు. 'అంతర్జాతీయంగా మార్కెట్లు ఒకదానికి మరొకటి మరింతగా అనుసంధానమవుతున్నాయి. అమెరికా, యూరప్ వంటి పెద్ద మార్కెట్లలో పరిణామాలకు మన స్టాక్ మార్కెట్లు స్పందిస్తున్నాయి. కాబట్టి ఆయా రిస్కులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ట్రేడింగ్ వేళల పెంపు ఉపయోగపడగలదు' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఈడీ ఎ. బాలకృష్ణన్ తెలిపారు. ఈక్విటీ సెగ్మెంట్‌లో వేళల పెంపుతో మార్కెట్ వర్గాలు, రిటైల్ ఇన్వెస్టర్లకూ ప్రయోజనం చేకూరగలదని వివరించారు. అంతర్జాతీయ అనిశ్చితుల రిస్కులను ఎదుర్కొనేందుకు ఈక్విటీ ఎఫ్అండ్ఓ, కరెన్సీ సెగ్మెంట్స్ ట్రేడింగ్ వేళలను పెంచడం చాలా అవసరమని ఫైయర్స్ సీఈవో తేజస్ ఖోడే చెప్పారు. దీన్ని వ్యతిరేకిస్తే మన క్యాపిటల్ మార్కెట్ల వృద్ధికి విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. ట్రేడింగ్ వేళల పెంపుతో అంతర్జాతీయ ట్రేడర్లకు దీటుగా దేశీ ట్రేడర్లకు కూడా సమాన అవకాశాలు లభించగలవని జిరోధా సహ వ్యవస్థాపకుడు నితిన్ కామత్ ట్వీట్ చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-2-2023	
విశాఖ	400-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	66.00
22-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	385-00
వరంగల్	387-00
రిటైల్ ధర	4.55

ప్రపంచ ఎకానమీలో భారత్ వెలుగులు

- ఐఎంఎఫ్ ఎండీ ప్రశంసలు
- 2023 ప్రపంచాభివృద్ధిలో దేశం వాటా 15 శాతమని అంచనా

వాషింగ్టన్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ''ప్రకాశవంతమైన ప్రాంతం'గా కొనసాగుతోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) క్రిస్టాలినా జార్జివా అన్నారు. 2023లో ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 15 శాతంగా ఉంటుందని భారత్‌లో పర్యటించనున్న ఆమె అంచనా వేశారు. కరోనా మహమ్మారి సమస్య నుంచి ప్రపంచంలోని ఐదవ-అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను ''డిజిటలైజేషన్'' బయటపడవేయగలిగిందన్నారు. దీనికితోడు దేశం అనుసరిస్తున్న వివేకవంతమైన ఆర్థిక విధానం, వచ్చే ఆర్థిక సంవత్సరం (2022-23)లో మూలధన పెట్టుబడులను గణనీయంగా పెంచుతూ (33 శాతం పెంపుతో రూ.10 లక్షల కోట్లకు) బడ్జెట్‌లో తీసుకున్న కీలక నిర్ణయాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతుండడం దేశ వృద్ధి వేగాన్ని కొనసాగించడంలో సహాయపడతాయని జార్జివా పేర్కొన్నారు. ఒక ఇంటర్వ్యూలో ఆమె ఈ మేరకు తెలిపిన అభిప్రాయాల్లో కొన్ని ముఖ్యాంశాలు...

- 2022-23లో భారత్ వృద్ధి రేటు 6.8 శాతంగా ఉండొచ్చు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ రేటు 6.1%గా ఉంటుందన్నది మా అభిప్రాయం. ఆయా గణాంకాలు దేశాన్ని ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఎకానమీగా నిలుపుతాయి.
- ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటును 5.9 శాతానికి తగ్గించాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధి అభినందనీయం.
- భారత్ ఎకానమీ మిగతా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలాగా కాస్త నెమ్మదించినప్పటికీ, ప్రపంచ సగటు కంటే, భారత్ వృద్ధి వేగం ఎక్కువగా ఉంది. 2023లో ప్రపంచ వృద్ధిలో భారతదేశం వాటా దాదాపు 15 శాతంగా ఉంటుందని భావిస్తున్నాం.
- దేశాన్ని 'గ్రీన్ ఎకానమీ' వైపు మళ్లించడానికి, తద్వారా వృద్ధిని కొనసాగించడానికి పునరుత్పాదక ఇంధనాలతో సహా వివిధ విభాగాల్లో పెట్టుబడులు పెట్టడంపై భారతదేశం ఎంత శ్రద్ధ కనబరుస్తోందో నేను ప్రత్యేకంగా గమనించాను.



ధరలు పెంచిన వోల్వో



న్యూఢిల్లీ: వాహన తయారీ సంస్థ వోల్వో కార్ ఇండియా మైల్డ్ హైబ్రిడ్ మోడళ్లపై 2 శాతం వరకు ధర పెంచింది. ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీ సవరించిన నేపథ్యంలో పెరిగిన ముడిసరుకు వ్యయానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ ప్రకటించింది. దీని ప్రకారం ఎక్స్‌సీ40, ఎక్స్‌సీ60, ఎస్90, ఎక్స్‌సీ90 వేరియంట్ల ధరలు అధికం కానున్నాయి. బెంగళూరు ప్లాంటులో ఈ మోడళ్లను కంపెనీ అసెంబుల్ చేస్తోంది.

భవిత

ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, మోడల్‌పేపర్స్, ప్రీవియస్ పేపర్స్, గైడెన్స్ మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

భారతీయ యువతకు.. యూకే ఎర్రతివాచీ

జాబ్స్ అబ్రాడ్



» ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్ ప్రారంభం
» ఈ నెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకూ దరఖాస్తులు
» బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా దరఖాస్తుకు అవకాశం
» ఎంపికైతే రెండేళ్లపాటు యూకేలో కొలువుకు మార్గం

విదేశీ ఉద్యోగం..మన యువత స్వప్నం! డిగ్రీలు పూర్తవుతూనే విదేశీ విద్య, ఆ తర్వాత అక్కడే ఉద్యోగం కోసం అన్వేషిస్తుంటారు. ఇలాంటి యువతకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. అదే.. ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్!! భారత్, యూకే ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం-ఈ కొత్త పథకం ఈ నెల 28 నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో..యూకే ప్రభుత్వ.. ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్ ఉద్దేశం, భారతీయ యువతకు ప్రయోజనాలు, అర్హత ప్రమాణాలపై ప్రత్యేక కథనం..

ఇండియా యంగ్ ప్రొఫెషనల్ స్కీమ్ ఫస్ట్ బ్యాలెట్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు యూకే ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఈ నెల 28న ప్రారంభం కానున్న బ్యాలెట్‌లో 2,400 వీసాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది. మార్చి 2వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

అర్హతలు

భారతీయ పౌరుడై ఉండాలి. వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. భారత్‌లోని గుర్తింపు పొందిన యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ,అంతకంటే ఎక్కువ అర్హతలు ఉన్న వారు దరఖాస్తుకు అర్హులు.

ఆన్‌లైన్‌లో బ్యాలెట్ ఎంట్రీ

తొలుత ఆన్‌లైన్ విధానంలో ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్ బ్యాలెట్ దశకు దరఖాస్తు చేసుకోవాలి. పేరు, పుట్టినతేది, పాస్‌పోర్టు వివరాలు, పాస్‌పోర్ట్ స్కాన్ చేసిన కాపీ, ఫోన్ నెంబర్, ఈమెయిల్ ఐడీ తదితర వివరాలు ఇవ్వాలి. దీనికి ఉచితంగానే దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాలెట్ దశ దరఖాస్తు గడువు ముగిసిన రెండువారాల్లోపు ర్యాండమ్‌గా ఎంపిక చేసి.. విజేతలైన వారి ఈమెయిల్‌కు సమాచారం అందిస్తారు.

వీసాకు 30 రోజుల గడువు

- ప్రస్తుత ఫిబ్రవరి బ్యాలెట్ దశలో 2,400 వీసాలు అందుబాటులో ఉన్నాయి.
- బ్యాలెట్ దశలో ఎంపికైతే వీసాకు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తారు. వీసాకు దరఖాస్తు చేసుకోవడానికి 30 రోజుల సమయం ఇస్తారు.
- బ్యాలెట్ దశలో ఎంపికై సంబంధిత అన్ని పత్రాలతో వీసాకు దరఖాస్తు చేసుకుంటే.. మూడు వారాల్లోపు వీసా మంజూరుపై నిర్ణయం వెలువడుతుంది. వీసా మంజూరైన వారు ఆరునెలల్లోపు యూకేకు వెళ్లాల్సి ఉంటుంది.
- ప్రస్తుత బ్యాలెట్‌లో ఎంపిక కాని వారు తదుపరి బ్యాలెట్(జూలై)కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

అవసరమైన పత్రాలు

వ్యాలిడ్ పాస్‌పోర్టు; విద్యార్హతల సర్టిఫికెట్లు; బ్యాంక్ అకౌంట్‌లో 2,530 పౌండ్లు ఉన్నట్లు చూపే పత్రం; టీబీ టెస్ట్ రిపోర్ట్, పోలీస్ క్లియరెన్స్ తదితర సర్టిఫికెట్‌లను వీసా దరఖాస్తు సమయంలో అందజేయాల్సి ఉంటుంది. • **ఫీజు వివరాలు:** దరఖాస్తు ఫీజు 259 పౌండ్లు, హెల్త్‌కేర్ సర్‌చార్జెస్ 940 పౌండ్లు చెల్లించాలి.

ప్రయోజనాలు ఇవే

- ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్ ద్వారా వీసా పొందిన వారు గరిష్టంగా రెండేళ్ల మాత్రమే బ్రిటన్‌లో ఉద్యోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆ సమయంలో వీరు చదువుకోవచ్చు. స్వయం ఉపాధి సైతం పొందొచ్చు. సొంతంగా కంపెనీ ప్రారంభించుకునే వీలుంది.
- వీసా అమల్లో ఉన్న కాలంలో ఎప్పుడైనా యూకేలో ప్రవేశించొచ్చు. తిరిగి స్వదేశానికి రావచ్చు. కావాలంటే మళ్లీ వెళ్లొచ్చు. అయితే వీసా రెండేళ్ల గడువు ముగిసాక పొడిగించుకునేందుకు అవకాశం ఉండదు.

సరళీకరణ బాట

బ్రిటన్ గత కొన్నేళ్లుగా భారతీయులకు స్టడీ, వర్క్ వీసాల విషయంలో సరళీకృత విధానాలను అనుసరిస్తోంది. గ్రాడ్యుయేట్ రూట్ వీసా, స్కేల్ అప్ వీసా వంటి పథకాలను ప్రారంభించింది. వీటి ప్రకారం-పోస్ట్ స్టడీ వర్క్ నిబంధనలను సడలించడం, కోర్సు పూర్తయి స్వదేశానికి వెళ్లిన తర్వాత రెండేళ్లలోపు తిరిగొచ్చి ఉద్యోగం కోసం అన్వేషించేందుకు అవకాశం కల్పించడం వంటి పలు చర్యలు తీసుకుంటోంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులు ప్రారంభం:** ఫిబ్రవరి 28, 2023
- **దరఖాస్తులకు చివరి తేది:** మార్చి 2, 2023
- **వెబ్‌సైట్:** https://www.gov.uk/india-young-professionals-scheme-visa

ఇంజనీరింగ్.. ఇంటర్మీడియెట్ ఎంపీసీ చదువుతున్న లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ఇందుకోసం ఇంటర్‌లో చేరిన తొలిరోజు నుంచే.. ఎంట్రెన్స్‌ల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తుంటారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలు మొదలు.. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే.. ఎంసెట్ వరకు అన్నింటికీ సిద్ధమవుతున్న పరిస్థితి! వీరంతా తమ ప్రిపరేషన్ మరింత ముమ్మరం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. తెలంగాణ రాష్ట్రంలో.. ఎంసెట్-2023 ఇంజనీరింగ్ విభాగం పరీక్షను మే 7 నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించడమే!! ఈ నేపథ్యంలో.. ఎంసెట్ పరీక్ష విధానం.. ఇందులో టాప్ స్కోర్ సాధించేందుకు మార్గాలు..

ఎంసెట్.. టాప్ స్కోర్ ఇలా!

» టీఎస్ ఎంసెట్-2023 తేదీలు ఖరారు
» మే 7 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్ష
» అన్వయ దృక్పథం, కాన్సెప్ట్‌లపై పట్టుతోనే విజయం

ఎంసెట్.. తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు పరిచయం అక్కర్లేని పరీక్ష. ఈ ఎంట్రన్స్‌లో విజయం సాధించి.. రాష్ట్ర స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సీటు సొంతం చేసుకోవాలని లక్షల మంది అభ్యర్థులు పోటీ పడుతుంటారు. మే 7వ తేదీ నుంచి టీఎస్ ఎంసెట్ నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యామండలి ఇటీవల ప్రకటించింది. కాబట్టి ఇప్పటి నుంచి నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే.. మంచి ర్యాంకు సొంతం చేసుకునే అవకాశముంది.

మే 7 నుంచి 11 వరకు

టీఎస్ ఎంసెట్-2023.. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలను మే 7 నుంచి 11 వరకు ఆన్‌లైన్ విధానంలో అయిదు రోజులపాటు నిర్వహించనున్నారు. అంటే.. అభ్యర్థులకు దాదాపు రెండున్నర నెలల సమయం అందుబాటులో ఉంది. అయితే మార్చి 2 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, ఆ తర్వాత మార్చి 16 నుంచి ఏప్రిల్ 4 వరకు బోర్డ్ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుంటే.. ఇంటర్ బోర్డ్ పరీక్షల తర్వాత ప్రిపరేషన్‌కు లభించే సమయం నెల రోజులు మాత్రమే. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు ఇప్పటి నుంచే నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి.

ఎంసెట్ పరీక్ష ఇలా

ఎంసెట్ పరీక్ష మొత్తం 160 ప్రశ్నలు-160 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో ఉంటుంది. ఇందులో ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40, మ్యాథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు ఉంటాయి. అంటే.. మ్యాథమెటిక్స్‌కు ఎక్కువ వెయిటేజీ ఉంటుందని గుర్తించాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్‌లోని అన్ని టాపిక్స్‌పై పూర్తి పట్టు సాధించాలి.

70 శాతం సిలబస్

టీఎస్ ఎంసెట్-2023లో.. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి 70 శాతం సిలబస్ నుంచే ప్రశ్నలుంటాయని తెలంగాణ ఉన్నత విద్యా మండలి స్పష్టం చేసింది.ప్రస్తుతం ద్వితీయం సంవత్సరంలో ఉన్నవారు 2021-22లో ప్రథమ సంవత్సరం చదివారు. ఆ సమయంలో కోవిడ్ కారణంగా బోర్డ్ సిలబస్‌ను 70 శాతానికి కుదించిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇది విద్యార్థులకు ప్రిపరేషన్ పరంగా కొంత అనుకూలించే అంశంగా చెప్పొచ్చు. తొలగించిన 30 శాతం సిలబస్‌కు కొనసాగింపు ఉండే అంశాలను చదివే విషయంలో విద్యార్థులు కొంత ఇబ్బంది ఎదుర్కొనే ఆస్కారముంది. దీన్ని అధిగమించేందుకు తొలగించిన సిలబస్ అంశాలు, వాటికి కొనసాగింపుగా ఉన్న టాపిక్స్‌ను పరిశీలిస్తూ.. ప్రాథమిక భావనలు, సిద్ధాంతాలు, సూత్రాలపై అవగాహన పెంచుకోవాలని సబ్జెక్ట్ నిపుణులు సూచిస్తున్నారు.

బోర్డ్ పరీక్షలకు ప్రాధాన్యం

ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రస్తుతం తమ ప్రిపరేషన్‌ను పూర్తిగా ఇంటర్మీడియెట్ పరీక్షలకే కేటాయించాలనేది నిపుణుల సూచన. వాస్తవానికి ఎంసెట్ లక్ష్యంగా చేసుకున్న అభ్యర్థులు ఇప్పటికే తమ ప్రిపరేషన్‌ను పూర్తి చేసుకొని ఉంటారు. కాబట్టి ఎంసెట్ గురించి ఆందోళన చెందకుండా.. బోర్డ్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా కృషిచేయాలని సూచిస్తున్నారు.

వార్షిక పరీక్షల తర్వాత

బోర్డ్ పరీక్షలు పూర్తయ్యాక ఎంసెట్ ప్రిపరేషన్ కోసం పూర్తి సమయం కేటాయించాలి. వాస్తవానికి ఇప్పటికే ప్రిపరేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు.. ఆ సమయాన్ని రివిజన్ కోసం వినియోగించుకునే విధంగా వ్యవహరించాలి. ప్రిపరేషన్ సమయంలో తాము రాసుకున్న సొంత నోట్స్,షార్ట్‌కట్స్‌ను అనుసరిస్తూ.. రివిజన్ సాగిస్తే సమయం ఆదా అవుతుంది.దీంతోపాటు ఎంసెట్ సిలబస్‌లో పేర్కొన్న అన్ని అంశాలను పూర్తి చేయడానికి ఆస్కారం ఉంటుంది.

కాన్సెప్ట్స్ ఆధారిత ప్రిపరేషన్

గత రెండు, మూడేళ్ల ఎంసెట్ ప్రశ్నల శైలిని గమనిస్తే.. అధిక శాతం ప్రశ్నలు అభ్యర్థులోని అప్లికేషన్ అప్రోచ్‌ను పరీక్షించే విధంగా ఉంటున్నాయి.కాబట్టి అభ్యర్థులు కాన్సెప్ట్స్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రిపరేషన్ దశ నుంచే అప్లికేషన్ దృక్పథాన్ని అనుసరించాలి. ఫలితంగా ఎంసెట్‌లో మంచి మార్కులు సాధించే అవకాశం లభిస్తుంది.

సమయ పాలన

విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షల తర్వాత ప్రిపరేషన్ కోసం ప్రతిరోజు ప్రతి సబ్జెక్ట్‌కు మూడు గంటలు చొప్పున సమయం కేటాయించుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఇలా ఒక్కో సబ్జెక్ట్‌కు నిర్దేశించుకున్న మూడు గంటల వ్యవధిలో మొదటి పదిహేను నిమిషాలను అంతకుముందు రోజు చదివిన అంశాల పునరావలోకనం కోసం కేటాయించాలి. ప్రిపరేషన్ సమయంలోనే ముఖ్యాంశాలతో షార్ట్ నోట్స్ రాసుకోవాలి. దీని వల్ల పరీక్షకు వారం రోజుల ముందు క్విక్ రివిజన్‌కు అవకాశం లభిస్తుంది.



టీఎస్ ఎంసెట్-2023

మోడల్ టెస్ట్‌లకు హాజరు

ఇంటర్మీడియెట్ పరీక్షల తర్వాత ఎంసెట్‌కు పూర్తి సమయం కేటాయించే అభ్యర్థులు.. ఆ సమయంలోనే మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరవ్వాలి. వీటి ఫలితాలను విశ్లేషించుకోవాలి. తద్వారా తమ సామర్థ్య స్థాయి, ఇంకా పట్టు సాధించాల్సిన అంశాలపై స్పష్టత తెచ్చుకోవాలి. ఒకవేళ ఆయా అంశాలు క్లిష్టంగా ఉండి..ప్రస్తుత సమయంలో పట్టు సాధించలేమని భావిస్తే.. కనీసం ప్రాథమిక భావనల గురించి తెలుసుకోవాలి.

జేఈఈతో అనుసంధానం

ఎంసెట్‌కు హాజరయ్యే విద్యార్థుల్లో అధిక శాతం .. జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్‌లకు కూడా సన్నద్ధమవుతుంటారు. ఇలాంటి అభ్యర్థులు జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షలతో ఎంసెట్ ప్రిపరేషన్‌ను అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ఫలితంగా ఒకే సమయంలో మూడు పరీక్షలకు సన్నద్ధత లభిస్తుంది. జేఈఈ-మెయిన్-2023 సెషన్-2 పరీక్షలు.. ఏప్రిల్ 6 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఈ సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు సీరియస్ ప్రిపరేషన్ సాగిస్తే.. అది ఎంసెట్‌లో టాప్ స్కోర్ సాధించేందుకు ఉపయోగపడుతుంది.

100కు పైగా సాధించేలా

టీఎస్ ఎంసెట్ అభ్యర్థులు 100కు పైగా మార్కులు సాధించేలా కృషి చేయాలి. ఇంజనీరింగ్ కళాశాలలు, సీట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే.. 70 మార్కులు సాధించినా సీటు లభించే అవకాశం ఉంది. కాని బెస్ట్ కళాశాలల్లో సీటు సొంతం చేసుకోవాలంటే.. 100కు పైగా మార్కులు సాధించే ప్రయత్నం చేయాలి. అదే విధంగా యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు, టాప్-10 కళాశాలల్లో సీటు పొందాలంటే.. జనరల్ కేటగిరీ అభ్యర్థులు మరింత ఎక్కువగా కష్టపడాల్సి ఉంటుంది. ఎంసెట్ అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో సిలబస్‌లోని అన్ని అంశాలపై పట్టు సాధించేలా వ్యవహరించాలి. అప్పుడే.. పరీక్షలో వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలకు సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

సబ్జెక్ట్‌ల వారీగా.. కీలక టాపిక్స్

మ్యాథమెటిక్స్

కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్. దీంతోపాటు 3-డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్; క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్; థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్;బైనామియల్ థీరమ్;లోకస్ అంశాలపై పూర్తి స్థాయి అవగాహన అవసరం.

ఫిజిక్స్

ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌లో లోతైన అవగాహన ఏర్పరచుకుంటే.. మంచి మార్కులు సొంతం చేసుకునే అవకాశాలు మెరుగవుతాయి.

కెమిస్ట్రీ

కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహారల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌండ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

టీఎస్ ఎంసెట్-2023.. ముఖ్య సమాచారం

- మే 7 నుంచి 11 వరకు ఎంసెట్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్).
- ఇంటర్మీడియెట్ ఎంపీసీ అర్హతతో పోటీ పడే అవకాశం.
- ద్వితీయ సంవత్సరం అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- మొదటి సంవత్సరంలో 70 శాతం సిలబస్ నుంచే ప్రశ్నలు.





Authorised Dealers For Bajaj Auto Ltd.: Bahadurpura SRI VINAYAKA BAJAJ 9393745666 • Begumpet SRI VINAYAKA BAJAJ 9390459666 • Chandanagar VARUN BAJAJ 8297544420 • Dilsukhnagar SRI VINAYAKA BAJAJ 9391770116 •NAMPALLY SRI VINAYAKA BAJAJ 9642488833• Erragadda MGB BAJAJ 8978865666• Habsiguda SELECT BAJAJ 8008104400 • Hydernagar SELECT AUTMOBILES 9154292288 • Kachiguda SRI VINAYAKA BAJAJ 9030030280 • Suchitra VVC Motorcycle 8143690900, 9154311770 • Kondapur VARUN BAJAJ 8297544408 • Kukatpally Y Jun SELECT AUTMOBILES 9154292288 • LB Nagar SRI VINAYAKA BAJAJ 9948222455 • RC Puram VARUN BAJAJ 8297544405 • RP Road DECCAN BAJAJ 9948884427 • Tolichowki ABHINANDAN BAJAJ 8008803761 • Uppal SELECT BAJAJ 8008100966. **Authorised Service Centre:** ALWAL 9441799486, AMBERPET 9133425299, ANAND BAGH 9246827460, ATTAPUR 8008803765, BALAPUR 9949256471, BALANAGAR 9246115566, BN REDDY COLONY 9989652503, BODDUPAL 8008104449, CHANDRAYANGUTTA 9885647692, DMRL'X'ROAD 9849300124, ECIL 8008104461, GAJWEL 9848347349, GHATKESAR 7032141444,HAYATH NAGAR 9010115299 IBRAHIMPATNAM 9912299916, IDPL COLONY 9246260803, Isnapur 6303910598, LUNGER HOUSE 9885562687, MADHAPUR 9581291777, MALAKPET 9000228558, MALKAJGIRI 8008104445, MEDAK 9440033366, MEDCHAL 9440442588, MEERPET 9949523333, METTUGUDA 9000049373, MOOSAPET 9989192111, MUSHEERABAD 9160599998 , NAGARAM 6301212199, Narayankhed 9000110040, NARSAPUR 7702313330, NARSINGI 8297544402, PARIGI 8297544414,*RAMAYAMPET 9848444434, SADASIVPET 9848877161, SAINIKPURI 9652040129 , SANGAREDDY 8297544409, SHAMSHABAD 9100793093 , SHANKARPALLY 9949022233, Shapur 9246260802, SIDDIPET 9133309650 , Somajiguda 9848295965, SURARAM 9848295965, TANDUR 8297544419, TEMPLE ALWAL 9000055318, THUMKUNTA 9985731111, VIKARABAD 8297544413, ZAHEERABAD 8297544426, KARMANGHAT 9908886782, Yousufguda 9949949112, Manikonda ABHINANDAN BAJAJ 9100988102, Toopran VVC Motorcycle 9154311773 • Gandimaissamma VVC Motorcycle 9154311772, Nallagandla Varun Motors 9581429111, JOGIPET, SRI SAI SAGHAMESWARA MOTORS 967620406

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.